
ఆణిముత్యాలు
2006
కస్తూరి బెహన్

# ఆణిముత్యాలు
## 2006



కస్తూరి బెహెన్

## వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

కస్తూరీ బెహెన్ పుస్తకాల కొరకు

K. రామదాస్ - **9440652774**

K. సుదర్శన్ - **9247805058**

సంప్రదించగలరు.

# ఆణిముత్యాలు
# 2006

కస్తూరీ బెహెన్

ఈ సంవత్సరం సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సహజమార్గ అభ్యాసీ సోదరీ సోదరులు లక్నో నగరంలో సెయింట్ కస్తూరీ బెహెన్‌ను దర్శించుకున్న సందర్భంలో పలుసందేహాలకు ఆమె ఇచ్చిన వివరణాత్మక సమాధానాలు, మార్గదర్శనాల 'కరదీపిక' ఇది.

గమనిక: అభ్యాసులు అడిగిన ప్రశ్నలకు వివరణాత్మక సమాధానలను **1979**వ సంవత్సరంలో అలహాబాద్‌లో జరిగిన బాబూజీ జన్మదినోత్సవం సందర్భంగా వెలువడిన సావనీర్‌లోని **"Face to Face with Kasturi Behan"** శీర్షికలోనివి, **2012** వ సంవత్సరంలో లక్నోలో జరిగిన శ్రీ లాలాజీ మహరాజ్ అవతరణ మహెూత్సవం సందర్భంగా "దివ్య ప్రసాదము"లోని "దివ్య దినములు", " సిస్టర్ కస్తూరీ బెహెన్ విరచిత సంధ్యాగీతాల సంగ్రహ సారాంశం" లను ఈ పుస్తకంలో ప్రచురించబడినవి.

# ఆణిముత్యాలు - 2006

సాధన చేయటం నియమంగా పెట్టుకోవాలని చెప్పారు బాబూజీ. సాధనలో ధ్యానమనేది అభ్యాసీని బాబూజీతో సంధాన పరుస్తుంది. నేను సాధన చేస్తున్నాను, అభ్యాసం చేస్తున్నాను అని అనుకోవటం, మనం బాహ్యం నుంచి దివ్యం (డివైన్) వైపు మరలుతున్నట్లవుతుంది. కాని పదే పదే, నేను సాధన చేస్తున్నాను, దైవంతో సంబంధం కల్పించుకుంటున్నాను అనుకుంటూ ఉండటం కంటే బాబూజీని స్మరణలో నిలుపుకొని బాబూజీ తనవారే అని అనుకుంటే 'ఐ' (నేను) అనగా అహం తొలగిపోతుంది. అభ్యాసం చేస్తున్నాను అని అనుకోవటం సంస్కారమవుతుంది. భౌతికత్వంతో బంధనం కలిగి ఉండటమవుతుంది. అలా కాకుండా ప్రాపంచిక వ్యవహారాలు నిర్వర్తిస్తున్నా, ఇంటిలో ఉన్నా, ఆఫీస్ పనిలో ఉన్నా బాబూజీనే స్మరణలో నిలుపుకుంటే అది సంస్కార రహితమే కాకుండా దైవంతో సంబంధం కలిగి ఉన్నట్లవుతుంది. మన హృదయం నుంచి 'నేను' అను భావం తొలగించుకున్నట్లయితే, బాబూజీ మనల్ని తన వారిగా చేసుకుంటారు. వారినే మదిలో (స్మరణలో) నిలుపుకుంటే మీరు ఎక్కడ ఉన్నా, ఏ పని చేస్తున్నా, బాబూజీ మహరాజ్ మీవారుగా, మీ సమీపంలో, మీ ఎదుటనే ఉన్నట్లుగా అనుభూతి చెందుతారు.

ఒకసారి బాబూజీ లాలాజీతో "నేను ఎప్పుడూ నా చూపులోను, భావనలోను, హృదయంలోనూ మీ సన్నిధినే అనుభూతి చెందుతున్నాను, ఎందుకని?" అని అడిగారు. అందుకు సమాధానంగా లాలాజీ సాహెబ్– "నీ దృష్టిలో కాని, ఆలోచనలో కాని, నీ హృదయంలో కాని నీవు లేవు, అన్నింటా నేను మాత్రమే ఉన్నాను కనుక నీవు అలా అనుభూతి చెందుతున్నావు" అని అన్నారు. అనగా బాబూజీ హృదయంలో లాలాజీకితప్ప మరెవ్వరికీ చోటులేదని, పూర్తిగా వారి స్మరణలోనే మునిగి ఉండేవారని అర్థం చేసుకోవాలి. అదే విధంగా మనం కూడా బాబూజీ స్మరణలోనే మునిగి ఉంటే మన మనోవాక్కాయ కర్మలందు 'వారి' సామీప్యత, దర్శనం కలుగుతూ ఉంటాయి. అభ్యాసీ తన హృదయంలోనే బాబూజీ ఉన్నారనుకొని, వారితో గాఢంగా అనుబంధాన్ని పెంచుకొని, తన్మయమైనట్టి స్థితిలో, పెల్లుబుకుతున్న ప్రాణాహుతి ఫలితంగా, అభ్యాసీకి చేరువలో అభ్యాసులు కానివారు ఎవరైనా ఉండి ఉంటే వారికి కూడా ఆ ప్రాణాహుతి యొక్క అనుభూతి కలుగుతుంది. దానివలన లాభం కూడా చేకూరుతుంది. దైవం మనలో ఉన్నాడనుకోవటం ఒక ఆలోచన. తర్వాత దివ్యకాంతి మన హృదయమంతటా విరజిమ్ముతుంది. అప్పుడింక ఆలోచనలతో పని లేకుండా అనుభూతినే పొందుతూ ఉంటాము. అనగా ఆలోచన యదార్థతగా మారుతుంది. అందుచేత ఆరంభంలో ఆలోచనకు తావిచ్చినా, తర్వాత అనుభూతిని పొందటానికి ప్రయత్నించాలి.

**ప్రశ్న: అనుభూతి (ఎక్స్‌పీరియన్స్) అంటే ఏమిటి?**

**జవాబు:** బాబూజీ మహరాజ్ యొక్క సామీప్యతానుభూతిని పొందటమే.

నేను అభ్యాసీగా చేరిన క్రొత్తలో బాబూజీ స్మరణ వలన నాకు ఒక విధమైన ఆనందానుభూతి కలుగుతూ ఉండేది. కాని 'వారి' యొక్క సామీప్యతానుభూతి కలిగేది కాదు. ఈ విషయం నేను బాబూజీగారితో ప్రస్తావించుతూ –"మీరు నాకు జ్ఞాపకం వస్తున్నారు కాని మీరు నాలో ఉన్న అనుభూతి రావటం లేదు,

ఎందుకు?" అని అడిగాను. దానికి సమాధానంగా, "నన్ను జ్ఞాపకం ఉంచుకోవటం అనేది మొదటి దశ. ఆ తర్వాత నేను ఉన్నాను అని అనుభూతి చెందటమనేది రెండవ దశ. ఆ మొదటి దశ రెండవ దశకు దారి తీస్తుంది" –అని బాబూజీ చెప్పారు. ఆ తర్వాత నాకు 'వారి' సామీప్యతానుభవం కలిగింది. అనగా 'వారి' సామీప్యతానుభవం కలగటం లేదేమో అను తపన లేదా ఆలోచన ఆ కోరుకున్న స్థితి కలగటానికి సంకేతం లేదా సూచన వంటిది. ఆ స్థితి కలగబోయే ముందు దానిని గురించిన ఆలోచన మనలో తలెత్తుతుంది. కనుక అభ్యాసీ తాను ఏమీ పొందటం లేదనే నిరుత్సాహం అనవసరం. ప్రతి అభ్యాసీ పొందటం ఖాయం. సహజమార్గ సాధన అనేది అనుభూతితో కూడినది; హృదయంలో 'వారి' సామీప్యతను పొందటానికి సాధన చేయాలి.

అభ్యాసులు, బాబూజీకి నా (కస్తూరీగారు) పట్ల ప్రత్యేక అభిమానం ఉండటం మూలంగానే అన్ని స్థితులు కల్పించారని  అనుకుంటారేమో కాని, ఆ అభిప్రాయం తప్పు. బాబూజీ నన్ను ఒక్కరినే ఉద్ధరించటానికి లేదా ఉన్నత స్థితికి తీసుకు వెళ్ళటానికి రాలేదు. 'వారు' అందరినీ ప్రేమిస్తారని, అందరినీ ఆ స్థితికి తీసుకు వెళ్ళటానికే వచ్చారని గుర్తించాలి. అయితే అందుకు బాబూజీ యొక్క స్మరణలోనే ఉంటూ, అందులోనే అనగా దైవంలోనే మునిగి ఉండే ప్రయత్నం చేయాలి.

**ప్రశ్న: మేమంతా ఈ గ్రూపులో ఉన్నాం, కాని అందరమూ 'వారి'ని చూడలేదు. కాని 'వారి' ప్రజెన్స్ (ఉనికి) ఎలా అనుభూతి చెందగలం?**

**జవాబు:** మీరు శ్రీకృష్ణున్ని చూశారా? చూడలేదు. అయినా వారిని భక్తితో కొలుస్తున్నారు, వారి ఉనికి (ప్రజెన్స్) అనుభూతిని చెందుతున్నారు. ఇది కూడా అలాగే. 'వారి' స్మరణలో మునిగి 'వారి' ఉనికి యొక్క అనుభూతిని పొందుతూ ఉంటే అభ్యాసులు కానివారు కూడా మనలో ఉన్న ఆ దివ్యమూర్తి యొక్క అనుభూతిని పొందుతారు.

నేను మొదటిసారి షాజహాన్‌పూర్ వెళ్ళినప్పుడు కుర్చీలో ఆసీనులై ఉన్న బాబూజీని దర్శించాక, ఆ దివ్యపురుషుడు నా హృదయంలోనే సర్వదా నెలవై ఉండాలనీ, అలా లేకుండా నేను ఈ భూమిమీద జీవించలేననీ అనిపించింది. ఆ తర్వాత క్రమంగా 'వారు' ఎప్పుడూ నాలోనే ఉన్నట్లు అనుభూతి చెందాను. షాజహాన్‌పూర్‌లో బసంత పంచమి సందర్భంగా బాబూజీ, ఈశ్వర్ సహాయ్‌గారితో "అందరూ నన్ను చూడాలని ఇక్కడకు వచ్చారు. కాని ఎవ్వరూ నన్ను 'అసలు' చూడకుండానే తిరిగి వెళ్ళుతున్నారు" అని అన్నారు. 'వారు' సర్వత్రా ఉన్నట్లుగానే నాకు అనిపించేది.

**ప్రశ్న: బాబూజీలోని దివ్యత్వాన్ని మొట్టమొదటిగా గుర్తించిన వారెవరు?**

**జవాబు:** లాలాజీ గారే! ఎందుకంటే, దీక్షతో తపస్సుచేసి అంతిమం నుంచి బాబూజీని అవతరింపజేసినవారు వారే కనుక. ఆ దివ్య పురుషుడు బాబూజీయే అని 'వారు' గుర్తించారు.

నేను బాబూజీ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. నేను షాజహాన్‌పూర్ వెళ్ళినప్పుడు ఇంటి బయటకు వెళ్ళినా, లోపలకు వచ్చినా, గదిలో 'వారే' ఉన్నట్లుగా అనిపించేది. షాజహాన్‌పూర్ నుంచి మా ఊరికి తిరుగు ప్రయాణమైపోయినప్పుడు, ఇంకా రెండు మూడు రోజులు ఉండాలని నాకు అనిపించటమే

కాకుండా, 'వారు' కూడా నన్ను అలా అదేశించాలనిపించేది. అయితే, బాబూజీ మాత్రం– "వెళ్ళు, త్వరగా బయలుదేరు, నీ బస్సుకు టైమయ్యింది" అని తొందరపెట్టేవారు. అది నాకు చాలా నిస్పృహ కలిగించింది. తర్వాత ఇంకొకసారి షాజహాన్‌పూర్ వెళ్ళి తిరుగు ప్రయాణానికి సిద్ధమైనప్పుడు, వారు ఇంకా రెండు మూడు రోజులు ఉండి వెళ్ళమనటమే కాకుండా, మా తల్లిగారిని కూడా అలా నేను ఉండేట్లు ఆదేశించమని కోరారు. వారపుడు నాలోని తపనను అర్థం చేసుకున్నారు. నాలో ఉన్న ఆ సెపరేషన్ అనగా దూరంగా వెళ్ళుతున్నట్లు చెందుతున్న వ్యథ (తపన)ను గుర్తించి 'వారు' అలా స్పందించారని గ్రహించాను. నేను ఉక్రోషం పట్టలేక బాబూజీని –అప్పుడు అలా అన్నారు, ఇప్పుడు ఇలా అంటున్నారేమిటి – అని ప్రశ్నించాను కూడా. అంటే హృదయంలో 'వారు' ఉన్నట్లుగా అనుభూతి చెందటం, హృదయం 'వారి' కోసమే తపించిపోవటమూ ఈ మార్పు యొక్క ఆంతర్యం. ఆ విధంగా అభ్యాసులకు 'వారు' ఆధ్యాత్మిక ఉన్నతిని చేకూర్చుతారు. భౌతిక దేహానికి నశింపు ఉన్నది కాని, దివ్యత్వానికి నశింపులేదు. అది ఎల్లప్పుడూ సజీవంగా, అందరిలోనూ అంతటా విరాజిల్లుతూనే ఉంటుంది. బాబూజీ మనలోనే జీవిస్తున్నట్లుగా చెప్పేవారు. మనం కూడా అదే విధంగా వారిలోనే జీవించేట్లుగాను, 'వారి' దివ్యత్వంలోనే మునిగి ఉండేట్లుగాను సాధన చేయాలి.

**ప్రశ్న: బాబూజీ నిరంతరం మీ హృదయంలోనే ఉన్నట్లుగా అనుభూతి చెందటానికి ఎంతకాలం పట్టింది?**

**జవాబు:** షాజహాన్‌పూర్ వెళ్ళి మూడుసార్లుగా 'వారి'ని దర్శించుకున్నాను. ఒకటిన్నర నెల రోజుల్లో నేను ఆ స్థితికి వచ్చాను.

**ప్రశ్న: "మనస్సు విలపించినప్పుడు ఆత్మ ఆనందిస్తుంది" అనటం వాస్తవమేనా?**

**జవాబు:** ఆ అభిప్రాయం తప్పు. మనస్సు విలపించటమనేది భౌతికమైనది. ఆత్మ దైవం గురించి చెందుతున్న తపన మూలంగా మనస్సు అలా పరితపిస్తుంది. మనం శరీరంలో బందీగా ఉంటున్నామంటే ఆత్మ కూడా బందీగా ఉన్నట్లే. అనగా బంధనంతో జీవిస్తున్నట్లే. మనం అలా అనుభూతి చెందుతుంటే ఆత్మ కూడా అదే అనుభూతి చెందుతుంది. అభ్యాసీ యొక్క ఆధ్యాత్మిక స్థితిని కాపాడటానికి అతని ఆత్మపైన ప్రతికూల ప్రభావం పడకుండా బాబూజీ కాపాడతారు. వ్యక్తిగతంగా కష్టాలు ఎదురైనప్పుడు వాటిని గురించి అతిగా ఆలోచించకూడదు. అటువంటి సందర్భంలో బాబూజీ మన కళ్ళ ఎదురుగా ఉన్నట్లు భావించుకుంటూ 'వారి'నే ప్రేమిస్తూ 'వారి'కే అంకితమవ్వాలి. అప్పుడు మనం కష్టాల నుంచి ఉపశమనం లేదా విముక్తి పొందుతాం.

శరీరం అనేది ఒక బంధనం (బాండేజ్). అందువలన ఆ బంధనానికి కట్టుబడిపోకుండా 'నాలో జీవించండి' అని చెప్పారు బాబూజీ. అనగా దైవంలో, దివ్య సముద్రంలో మునిగి ఉండటమన్నమాట. బాబూజీ అభ్యాసీకి ఒక స్థితిని కల్పించటమే కాకుండా దానిని నిలబెట్టారు. కష్టాలవలన స్థితికి భంగపాటు జరగటం కాని, ప్రోగ్రెస్ నిలిచి పోవటంగాని జరగదు. నిరంతరం కష్టాల గురించే ఆలోచిస్తూ ఉంటే అవి ఇంకా ఎక్కువ అవుతాయి. ఎవరిని ప్రేమిస్తే అవి తగ్గుతాయో వారిని ప్రేమించాలి. ఎప్పుడూ మీ గురించో మీ కుటుంబం గురించో ఆలోచిస్తూ ఉంటే దైవం గురించిన ఆలోచన లేనివారై దైవానికి ఇంకా దూరంగా జరిగిపోతుంటారు. ఆ విధంగా వాటి ఊబిలోనే (బురదగోతిలోనే) కూరుకుపోతూ ఉంటారు. తపస్సు

ద్వారా సహనశక్తిని పొందాలి. మానవులు కొంతమంది ఇతరులకు కష్టాలు కలిగించే ఆలోచనలు చేస్తూ ఉంటారు. అది వారి స్వంత కష్టాలకూ మూలకారణ మవుతుంది. ఇటీవల సేవాభావం, ప్రేమభావం లోపించిపోయాయి. బాబూజీ అందుకే మామూలు మానవుడిని మంచి మానవుడిగా అంటే అభ్యాసీ యొక్క ప్రవృత్తిని మార్చటానికే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చేవారు. అలా మనో నైర్మల్యం ఏర్పడితేనే అతనిలో దివ్యత్వం చోటుచేసుకుంటుంది. అందుచేత కష్టాలను, కలతలను నెమరు వేసుకుంటూ ఉంటే సంస్కారాలకు కారణమవుతుంది. అలా కాకుండా దైవ స్మరణకే అర్పితమైపోతే సంస్కార రహితంగా ఉండటమే కాకుండా సుఖశాంతులు పొందటం కూడా జరుగుతుంది.

ఒక అభ్యాసీ బాబూజీతో "మీరు ఎప్పుడూ మంచి వారుగానే అనిపిస్తారు, ఎందుచేత?" అని అడిగాడు. దానికి సమాధానంగా బాబూజీ ఏమన్నారంటే – "నేను ఎప్పుడూ మంచి చేయాలనే ఆలోచిస్తాను కనుక మంచివానిగా అనిపిస్తాను. నీవు కూడా ఎల్లప్పుడూ మంచితనంతోనే ఆలోచించినట్లయితే నీవు కూడా మంచివానిగానే గుర్తించబడతావు" అని అన్నారు.

సహజమార్గ విధానం లేదా సాధనలో ఉన్న రహస్యం ఏమిటంటే, నిరంతర స్మరణను కలిగి ఉండటమే. దానివలన దైవంతో సంబంధం ఏర్పడి దైవంలోనే జీవించటం జరుగుతుంది. అభ్యాసీ మంచి ఆలోచనతో ఉండి 'వారి' స్మరణలోనే ఉంటే బాబూజీయే అభ్యాసీలో జీవిస్తారు. బాబూజీ అందరినీ ప్రేమించి అందరిచేత ప్రేమించబడటానికే భూతలానికి దిగి వచ్చారు. ఆ నిరంతర స్మరణవలన అభ్యాసీ యొక్క ఆలోచనలు, ఆచరణలు కూడా నిష్కల్మషమైనవిగా ఉండి స్వంత వ్యవహారాల్లోనూ, ప్రాపంచిక వ్యవహారాల్లోనూ పవిత్రత పొడసూపుతుంది. అది గుర్తించిన ఇతరులు కూడా అటువంటి వారికి హాని తలపెట్టరు. ఒక అభ్యాసీ బాబూజీని – మీరు ఎవరిని బాగా ప్రేమిస్తారు అని అడిగినపుడు – "నేను నన్ను ద్వేషించేవారిని బాగా ప్రేమిస్తాను" అని అన్నారు. అలా ఎందుకంటే అలాంటి వారిలో ప్రేమ బీజాలు దివ్యత్వం నాటటానికే, అని చెప్పారు. 'వారు' అందరినీ ప్రేమించటానికే వచ్చారు కాని ఎవరినీ ద్వేషించటానికి రాలేదు.

ఒక అభ్యాసీ రైలు ప్రయాణంలో తన ప్రవర్తన సరిగా లేకపోయినప్పటికీ బాబూజీ తనపై ఎంతో ప్రేమను వర్షింప జేసినట్లుగా తన అనుభూతిని గుర్తుచేసుకున్నాడు. ఆ తర్వాత బాబూజీ రూపం తన ముందు కనిపిస్తూ ఉండేదని, అతనికి ఎదురుగా ఉన్న సీటులో 'వారు' కూర్చొని ఉన్నట్లుగాను, 'వారి' దివ్యత్వాన్ని అనుభూతి చెందినట్లుగాను, అప్పటి నుంచి 'వారు' తన మదిలో నిలిచి పోయినట్లుగా వివరించాడు.

బాబూజీని నిరసించేవారు కొంతమంది 'వారి'కి దూరంగా ఉండటానికి ప్రయత్నించేవారు. వారిలో ఆ విముఖత్వాన్ని తొలగించి ప్రేమభావం ఉత్పన్నం చేయాలన్న తలంపుతో బాబూజీ వారి దరిజేరేవారు. కుటుంబంలో, ప్రపంచ జ్ఞానం తెలియని అతిపసివారిని గురించి తల్లి ఎలా శ్రద్ధ వహిస్తుందో, అదే విధంగా బాబూజీ వారిపట్ల శ్రద్ధ వహించేవారు.

**ప్రశ్న: నైనిటాల్‌కు చెందిన అభ్యాసీ ఒకరు "బాబూజీ ఒకానొక సందర్భంలో తన దివ్యశక్తి రెండు వేల సంవత్సరాలు ఆశ్రమంలో నిలిచి ఉంటుంది" అని చెప్పినట్లుగా విన్నాను; దయచేసి వివరిస్తారా?**

**జవాబు:** అభ్యాసుల్లో తపన ఉంటే ఆ దివ్యత్వం నిలిచి ఉంటుంది. తపన అంటే కేవలం వారిని తలచుకోవటం కాదు. అది హృదయ పూర్వకమైనదిగా ఉండాలి. ఆశ్రమంలో దివ్యత్వం 500 సంవత్సరాలు విరాజిల్లుతూ

ఉంటుందన్నారు. కాని అది ఎప్పుడు జరుగుతుందంటే– సహజమార్గాన్ని అనుసరించేవారు, ఆధ్యాత్మిక ప్రగతికి సాధన చేసేవారు అక్కడ ఉన్నప్పుడు మాత్రమే ఆ దివ్యత్వం అక్కడ నిలిచి ఉంటుంది. ఒకవేళ అటువంటి సాధన కొద్దికాలం నిలిచి పోయినప్పటికి, మళ్ళీ దానిని పునరుద్ధరించినప్పుడు ఆ దివ్యత్వం ప్రభావితమవుతుంది. మన సహజమార్గ విధానం, దివ్యత్వం ప్రకృతిలో శాశ్వతంగా సుస్థిరం చేయబడ్డాయి.

ఒక అభ్యాసీ "మేము అక్కడ బాబూజీతో ఉన్నంతసేపు వారు ఒక దివ్య పురుషునిలాగే అనిపిస్తున్నారు. కాని ఇంటికి వెళ్ళిన తరువాత అక్కడ ఆ అనుభూతి కలగటంలేదు, ఎందుకని?" అని అడిగాడు. నేను ఇలా చెప్పాను: అభ్యాసీ తన హృదయంలో బాబూజీని గాఢంగా ప్రేమిస్తూ వారికై తపిస్తూ ఉంటే ఆ అనుభూతి ఎప్పుడూ కలుగుతూ ఉంటుంది. అలా కాకుండా తాత్కాలికంగా బాబూజీ దివ్యపురుషుడు అని అనుకుంటూ ముఖస్తుతిలాగా చేస్తే ఆ అనుభూతి కలగదు.

రాముడు, కృష్ణుడు వంటి దివ్యపురుషులు ప్రకృతి యొక్క ప్రత్యేక అవసరం తీర్చటానికి ఈ భూమి మీద అవతరించి వారి బాధ్యత నెరవేరిన తరువాత దివ్యతలానికి తిరిగి వెళ్ళిపోయారు. ప్రాపంచిక వ్యవహారాల్లో, భోగభాగ్యాలలో మునిగిపోయిన మానవాళిలో దైవస్మరణ, దివ్యానందం కొరవడిన కారణంగా ఆ దివ్యత్వాన్ని తిరిగి మానవులలో చైతన్యపరచటానికే బాబూజీ ఈ అవని మీద అవతరించారు. ప్రకృతి ననుసరించి జీవించే విధంగాను, పరమాత్మునికై పరితపించేట్లు చేయటమే 'వారి' సంకల్పం. అందరిపట్ల సోదరభావం, ప్రేమభావం పెంపొందాలన్నదే 'వారి' ఆదేశం.

దైవం సర్వవ్యాపి, ప్రకృతి అవసరం నిమిత్తం వివిధ రూపాల్లో అవతరణ జరుగుతుంది. రాముడు, కృష్ణుడు అవతరించబోయే ముందు ఆ తల్లులకు విరాట్ రూపంలో దర్శనం కలిగింది. దివ్య తేజస్సు ప్రకృతిలో వ్యాపిస్తుంది. ప్రకృతి యొక్క వాతావరణంలో పవిత్రత, దివ్యత్వం సమకూరతాయి. బాబూజీ చెప్తూ ఉండేవారు – "దైవ క్షేత్రాలూ, తీర్థాలంటూ జనం ఎక్కడెక్కడికో తిరుగుతుంటారు. అందుకు ధనం, సమయం, శక్తి ఖర్చవుతాయి. మాట మాత్రంగా – "మనస్సనే మందిరంలో దేవుడు నెలకొని ఉన్నాడు" అని అంటారే కాని తనలోనే వ్యాపించి ఉన్న ఆ దైవాన్ని, దివ్యకాంతిని గుర్తించి ఆరాధించలేరు. దైవం పేరిట ఒక మూర్తి (విగ్రహం) తయారుచేసి అందులో దైవాన్ని నెలకొల్పి ఆరాధిస్తూ ఉంటారు. అంటే లోన ఉన్న దైవాన్ని వెలికి తీసి ఆ దైవాన్ని ఆరాధించే అజ్ఞానం అలుముకు పోయింది. మనలో ఉన్న ఈశ్వరాంశను గ్రహించి, హృదయంలో దాన్ని నిలుపుకొని ఆ ఈశ్వరత్వాన్ని పొందటానికి సాధన చేయాలి" అని.

ఒకసారి 'వారు' మా ఇంటిలో ఉన్న ఫోటోలను చూస్తూ ఎవరెవరివి అని అడిగారు. నేను రాముడు, కృష్ణుడు – ఇలా చెప్పాను. అపుడు – రాముడు ఈ ఫోటోలోనే ఉన్నాడా! అది లేకుండా స్మరించలేవా? అన్నట్లుగా అడిగారు. అపుడు నాకు అర్థమయ్యింది – మన హృదంలోనే మన ఇష్టదైవం కొలువై ఉన్నారు కాని, చిత్రాలు, విగ్రహాలలో కాదని. కనుక విరాట్ అనగా ఈశ్వరుడు సర్వవ్యాపి అని అర్థం చేసుకోవాలి.

**అభ్యాసీ: మన విధానంలో ధ్యానం చేసే సమయంలో బాబూజీ ఉన్నట్లుగాను, దివ్యకాంతి ఉన్నట్లుగాను లేదా శూన్యత్వం ఉన్నట్లుగాను భావించుకోవాలంటారు. ఇందులో ఏది సరైన విధానం?**

**జవాబు:** ధ్యాన సమయంలో మన హృదయంలో దివ్యజ్యోతి ఉందనిపించి, అది అలాగే కాంతివంతంగా నిలిచినట్లయితే దాని ద్వారా బాబూజీ దివ్యత్వం శరీరమంతటా వ్యాపించినట్లవుతుంది. దివ్యజ్యోతి అనేది

ఆధ్యాత్మిక సాధనలో ఒక తొలి అనుభవం. అది క్రమేణా బాబూజీ నుంచి వచ్చే ప్రాణాహుతిగా అనుభూతి నిస్తుంది. ఇందులో మొదటిది ఒక ఆలోచన లేదా సంకల్పంకాగా రెండవది అనుభూతిగా అవుతుంది. ఈ రెండూ ధ్యాన సమయంలో అనుభవమవుతాయి.

భౌతికరూపం మీద దృష్టి నిలపటం కాకుండా ఆ దివ్యత్వం మీదనే దృష్టిని కేంద్రీకరించాలి. బాబూజీ కుర్చీలో కూర్చుని ఉన్నట్లుగానో, మరో విధంగానో కాకుండా 'వారి' దివ్యత్వాన్ని గురించే ధ్యానంలో నిలుపుకోవాలి. అందుకే బాబూజీ "అభ్యాసులు నన్ను చూడటానికి వస్తారేకాని నా వాస్తవ దర్శనాన్ని పొందటంలేదు" అని వ్యాఖ్యానించేవారు. ధ్యానంలో గాఢంగా మునిగి ఉండటంవల్లనే ఆ దివ్యత్వం యొక్క అనుభూతి కలుగుతుంది. బాబూజీ యొక్క సామీప్యత మరియు 'వారి' యొక్క నిరంతర స్మరణ ద్వారా కూడా దివ్యానుభూతి కలుగుతుంది. బాబూజీ సర్వవ్యాపి, కేవలం రూపానికే పరిమితం కాదు. అలాగే దైవం మందిరాలలోని విగ్రహాలలో మాత్రమే ఉన్నాడని భావించటం కూడా అజ్ఞానమే. మానవాళి అంతా భగవంతుని సృష్టియే. అందరిలోనూ భగవదంశ ఉంది. మనలోని ఆ దైవాన్ని తరలించి దూరంగా ఉంచి, దైవానికి దూరం కావటం సరికాదు. అందుచేత మనమందరమూ భగవంతునిచేత సృష్టించబడిన వారమేనని, దైవం మనలోనే ఉన్నాడని, ఆయన మనల్ని ప్రేమిస్తున్నాడని, కాపాడుతున్నాడని భావనచేసి హృదయంలో ఆ అనుభూతిని నింపుకుంటే ఆ దైవ సాక్షాత్కారాన్ని పొందగల్గుతాం. ధ్యానంలో మొదట రూపం దర్శనం ఇచ్చినా ఆ తర్వాత రూపం తొలగిపోయి దివ్యత్వమే దాని స్థానంలో నిలుస్తుంది –అని బాబూజీయే చెప్పారు. కాని మనం దేనిని కోరుకుంటామో అదే దర్శనమవుతుంది, అయితే రూపం, లేదంటే దివ్యత్వం. అది మనంచేసే భావన మీద ఆధారపడి ఉంటుంది.

నేను మొదటిసారిగా షాజహాన్‌పూర్ వెళ్ళినప్పుడు వారిని (భౌతిక రూపం) చూడకుండా జీవించలేననిపించింది. అలా మరికొన్నిసార్లు వెళ్ళివచ్చాక, మూడు నాలుగు మాసాల్లోనే 'వారి'ని కళ్ళలో కాకుండా హృదయంలో నిలుపుకోవటం మూలంగా ఆ భౌతిక శరీరం మీద ధ్యాసపోయి 'వారి' దివ్యత్వం మీదనే నా స్మరణ నిలిచిపోయింది. అంటే భౌతికభావంపోయి హృదయానుభూతిగా పరివర్తనం చెందింది.

**ప్రశ్న: సంస్కారాలు శుద్ధి చేయబడటం లేదా సంస్కరించబడటం అంటే ఏమిటి?**

**జవాబు:** వాటిని నిరంతర స్మరణ ద్వారా సంస్కరించుకోవచ్చు. ఒక సమావేశంలో, ధ్యానంలో క్లీనింగ్ చేసుకోవటానికి ఉత్తమ విధానం ఏది– అని ఒకరు ప్రశ్నించారు. అపుడు బాబూజీ నన్నుద్దేశించి నా అభిప్రాయం చెప్పమన్నారు. అపుడు నేను ఇలా చెప్పాను: "ధ్యాన సమయంలో ప్రాణాహుతి శక్తి అభ్యాసులు అందరికీ ప్రసారమవుతుంది. ఆ సమయంలో ప్రాణాహుతి ప్రసారానికి ఏవైతే అడ్డుగా నిలుస్తాయో లేదా అవరోధంగా ఉంటాయో వాటిని తొలగించగా, ఆ క్లీనింగ్‌లో ఏమి జరిగింది అనేది అభ్యాసీ అనుభవానికి తెలియాలి. అదే ఉత్తమ విధానం" అని చెప్పాను. బాబూజీ భాషలో జడత్వం లేదా అనర్థమైనది ఏమిటో మనకు తెలియదు కనుక, బాబూజీయే దాని క్లీనింగ్ బాధ్యత వహిస్తారు.

**ప్రశ్న: ఆధ్యాత్మిక యాత్రలో ఎంత పురోగతిని సాధించామో తెలుసుకోవటం ఎలా?**

**జవాబు:** బాబూజీతో మనం ఎంత సామీప్యతను అనుభూతి చెందుతామో దానినిబట్టే మన పురోగతిని అంచనా వేయవచ్చు. మన పుస్తకాలలో వ్రాయబడిన పాయింట్స్ అనేవి అభ్యాసులకు కొంత తికమకగా

లేదా అయోమయంగా తోచవచ్చు. సహజమార్గ విధానంలో ఆ పాయింట్స్ అనేవి అభ్యాసీ యొక్క ఆధ్యాత్మికతకు చెంది ఎలా పనిచేస్తాయో తెలిపేటటువంటి బాబూజీ యొక్క పరిశోధనాంశాలు. వాటిని బాబూజీ వివరించారు.

అభ్యాసీ యొక్క ఆధ్యాత్మిక పురోగమనంలో భక్తి, ప్రేమ అనేవి రెండు ప్రధానాంశాలు. స్థితులు గురించి పుస్తకాలలో వివరించబడ్డాయి. వాటి ఆధారంగా మీరు ఒక స్థితిలో ఉన్నామని అనుకున్నా, వాస్తవంగా మీరు ఆ స్థితిలో ఉండకపోవచ్చు. అది కల్పితమవుతుంది.

**ప్రశ్న: ఉదయమే ఇంటి పనులు, వంటా వార్పులో నిమగ్నమయ్యే స్త్రీలు ధ్యానానికి సిద్ధమయ్యేముందు స్నానాదులను ఆచరించాల్సి ఉంటుందా?**

**జవాబు:** దానికి ఏమాత్రమూ ప్రాధాన్యత లేదు. ఎందుకంటే, స్నానం అనేది భౌతిక శరీర శుభ్రతకు సంబంధించినదేకాని ఆంతరిక దివ్య స్థితులకుగాని, దివ్య ప్రాణాహుతికిగాని చెందినది కాదు. దశ నియమాలలో చెప్పినట్లుగా ఆచరణ ఉంటే చాలు. విగ్రహారాధన చేసేవారికి అటువంటి నియమాలు ఆదేశించబడ్డాయి. మీరు సహజమార్గంలో పాదంమోపిన తర్వాత ఆంతరిక స్థితికి, ఆధ్యాత్మిక ప్రగతికి ఎక్కువ ప్రాధాన్యత నివ్వాలి.

ఒక అభ్యాసీ అనారోగ్యానికి గురైనప్పుడు ఇతర బాధ్యతలతో పాటు దివ్యత్వానికి చెందిన విధులు కూడా నిర్వహించలేక పోయినప్పుడు లేదా సమయపాలన పాటించలేనప్పుడు దానిని తప్పుగా భావించటంకాని, దివ్యత్వం దిగజారిపోతుందని దిగులు చెందటంకాని తగదు. అతడు నిరంతరణ స్మరణ, మాస్టర్‌పట్ల ప్రేమ కలిగి ఉన్నట్లయితే అవి అనగా ఆ లోపాలు లెక్కకు రావు.

**ప్రశ్న: మానవ జీవితానికి లక్ష్యం ఏమిటి? దానిని పొందటం ఎలా?**

**జవాబు:** సాక్షాత్కారం పొందటమనేది మన లక్ష్యం. దానిని తెలుసు కోవటమనేది కాకుండా వారిలో లయం, అంతర్లీనం కావాలి. అందువలన అభ్యాసీ సాక్షాత్కారం పొందటాన్ని తన జీవిత లక్ష్యంగా నిర్ణయించుకోవాలి. ఆ తర్వాత ఈశ్వరప్రాప్తి అనేది బాబూజీ చేతుల్లో ఉంటుంది.

మీరు మన ఈ సహజమార్గ విధానంలో ప్రవేశించారు కనుక 'ఎలా' అనే ప్రస్తావన వదిలేయండి. ఆ గమ్యం లేదా లక్ష్యం చేరటానికి ఇదే ఏకైక మార్గం.

**ప్రశ్న: కష్టాలు భగవంతుడు ఇచ్చిన వరాలు అన్నారు కదా! అది ఎలాగో వివరించండి. అందులో నిగూఢమైన రహస్యం ఉందని, వాటి ద్వారా అభ్యాసీకి చాలా అనుభవం వస్తుందని ట్రూత్ ఎటర్నల్ గ్రంథంలో చెప్పబడింది. అదేమిటి? దయచేసి వివరించండి.**

**జవాబు:** కష్టాలు లేదా బాధలు అనేవి క్రొత్తగా సహజమార్గంలో చేరిన వారికి మాత్రమే. అనగా వారికి శారీరకమైన నొప్పులు వంటివి అనుభవానికి వస్తూ ఉంటాయి. ఎందుకంటే, ఇంతకుముందు వారు మూర్తి పూజకు అలవాటుపడి ఉంటారు. కాని ఇక్కడ మౌనంగా దీక్షతో కూర్చోవటం మూలంగా కొన్ని బాధలు అనిపించవచ్చు. కాని మన విధానంలో ధ్యానంలో కూర్చుని బాబూజీని స్మరించుకొని మనల్ని మనం మరచిపోవటం వలన అనగా శరీరాన్ని గురించిన ఆలోచనే ఉండదు. కనుక దాని బాధలు అనుభవానికి రావు.

బిడ్డలు తమ సమస్యల్ని లేదా ఇబ్బందులు తల్లికి చెప్పుకున్నట్లే మనం బాబూజీకి నివేదించుకుంటే మనకు ఉపశమనం కలుగుతుంది. వారే మనకు మూలం లేదా సర్వస్వమనే అనుభూతితో ఉండాలి. అప్పుడు వారు వాటి బారి నుండి కాపాడి సాక్షాత్కారం కలిగిస్తారు. ధ్యానంలో ఆంతరికంగా మన అనుబంధం అంతా దైవంతోనే. అభ్యాసీ ఒంటరిగా ఉన్నప్పుడు దైవమే తోడుగా ఉంటాడు. సాధన నుంచి బయట ప్రపంచంలోకి వచ్చినప్పుడు తల్లి, తండ్రీ, భార్యా బిడ్డలు వంటి సంబంధాలు గుర్తుకువస్తాయి.

**ప్రశ్న: మోడరేషన్ అంటే ఏమిటి?**

**జవాబు:** ఇది సామ్యావస్థ లేదా సమతుల్యత. ఆంతరికంగా అన్నింటిపట్ల, అందరిపట్ల సమభావం. కష్టాలకు కుమిలిపోవటం, సుఖాలకు సంబరపడిపోవటం కాకుండా కష్టసుఖాలు కావడి కుండలు అన్న రీతిలో అవన్నీ మామూలే అని అనుభూతి చెందటం జరుగుతుంది. దాని వలన మన ఆధ్యాత్మికత స్థితి లేదా ఆంతరిక స్థితి చెక్కు చెదరదు. సమాజంలో బాహ్యంగా మన ప్రవర్తనలో కూడా ఇష్టాయిష్టాలు కాని, ప్రేమ ద్వేషాలు కాని ప్రత్యేకంగా వెల్లడి కాకుండా అన్నీ సమస్థాయిలో నిర్వర్తించబడతాయి.

**ప్రశ్న: మనమీద గ్రహాలు, నక్షత్రాలు ఎటువంటి ప్రభావాన్ని కలగజేస్తాయి?**

**జవాబు:** అవన్నీ భౌతికపరమైనవి. వాటి ప్రభావం మనమీద ఉందని ఊహించుకొంటారు. ఆ తర్వాత వాటివలన దుష్ప్రభావం ఉందని ఎవరైనా పండితులు చెప్పినప్పుడు ఆందోళన చెందుతారు. అందుచేత అవి కూడా ఈ సృష్టికి చెందినవే అనుకొని వాటిని గురించి భయపడకుండా గుండె నిబ్బరం చేసుకుంటే ఎటువంటి పరిణామాలు ఉండవు.

**ప్రశ్న: మన సహజమార్గం మీద జ్యోతిషశాస్త్రం యొక్క ప్రభావం ఉంటుందా?**

**జవాబు:** ఇవి రెండూ వేర్వేరు విద్యలు. ఎవరి నమ్మకం వారిది. సహజమార్గం మీద విశ్వాసం ఉంటే అంతా దైవమే చూస్తాడు. జ్యోతిషశాస్త్రంతో చేసే అంచనాలు ఉదాహరణకు గ్రహస్థితులను సరిచూసి వధూవరులను ఒకటిగా చేసినా విడిపోవటమూ తటస్థించుతూనే ఉంది గదా! అందుచేత ఇటువంటి వాటిని గురించి ఆలోచిస్తే మైండ్ కలగాపులగం అయిపోతుంది. సహజమార్గం దైవం మీద ఆధారపడి ఉంటుంది. మనం ఒక పిల్లవాని జాతకం తీసుకుని ఒక సిద్ధాంతిని కలిస్తే ఏదో సమస్య ఉండి వచ్చామనకుని, ఏవో కారణాలు, నివారణోపాయాలు చెప్పుతాడు. కాని మనం ఏ విధి విధానం మీద నమ్మకం ఉంచామో దానిని ఆశ్రయించాలి, అనుసరించాలి.

**ప్రశ్న: మానవుని మనస్తత్వాన్ని, ప్రవర్తనావళిని ఏ శక్తి నియంత్రిస్తోంది?**

**జవాబు:** దైవశక్తియే అన్నింటినీ నియంత్రిస్తుంది. అయితే మనస్సుకు ప్రాధాన్యత నిచ్చినప్పుడు అది సహజత్వాన్ని చెదరగొట్టోంది. అందుచేత మానసిక దౌర్బల్యాన్ని అరికట్టి ఆచరణలోను, అనగా ప్రవర్తనలోను, ఆలోచనలోను సమతుల్యతను సాధించిపెట్టగలిగేది మన సహజమార్గం మాత్రమే.

**ప్రశ్న: ఈశ్వరుడు, భూమా మరియు బాబూజీల పాత్ర ఏమిటి?**

**జవాబు:** ఈ ప్రశ్న మనకు ఉదయించాల్సినది కాదు.

భూమా సృష్టి శక్తి. ఈశ్వర్ అనగా ప్రకృతి. ప్రకృతి క్రమం దారితప్పి పెడదారిపట్టినప్పుడు దానిని సరిచేయటానికి లాలాజీ వంటి మహనీయులు ఆ సృష్టి శక్తిని రప్పించి దానిని సరిచేయవలసి వస్తుంది. అందుకొరకు ఆ భూమాశక్తి సహితంగా వచ్చినవారే బాబూజీ. ప్రకృతి కార్యం నిర్వహించటానికి ఏ శక్తి పనిచేస్తుందో అదే భగవంతుడు లేదా దైవం. ఆ దైవం ఒకే ఒక్కడు. అంతటాఉన్నాడు.

ధ్యానం చేసేప్పుడు దైవం అనే భావం పెట్టుకోవాలేకాని రూపం మీద కాదు. ఫొటో అనేది బాబూజీ ప్రతిరూపం. 'అసలు' బాబూజీయే కనుక వారినే మదిలో నిలుపుకొని ధ్యానం చేయాలి. బాబూజీతోనే అనుబంధం పెంచుకొని ఏ అనుభూతి (ఫీలింగ్) వస్తుందో దానిలోనే మునిగి ఉంటే ఆ పరమానందం కలుగుతుంది. ఫోటో అనేది శాశ్వతంగా నిలవదు. బాబూజీ యొక్క తలంపుయే మనకు ముఖ్యం.

**ప్రశ్న: పుస్తకాలలో భగవంతుని గురించి వర్ణన ఉంటుంది. కాని మన సహజమార్గ విధానంలో భగవంతుడు అంటే ఏమనుకోవాలి?**

**జవాబు:** భగవంతుడు అంటే భగవంతుడే. ఆయన ఒకే ఒక్కడు. సిస్టమ్ ఏదైనా కానివ్వండి భగవంతుడు అంటే ఒక్కడేకాని మార్పు లేదు. భగవంతుడు అంటే సృష్టికార్యాన్ని నిర్వహించేవాడుగా ఉంటాడు. సృష్టికి మూలం భూమా. సృష్టి ప్రారంభానికి ఎంత శక్తి అవసరమో అంత శక్తి ఆ పరమశక్తి భూమా నుంచి వీడివచ్చి అవసరమైన సృష్టి రచన జరపటం జరిగింది. ఆ భగవంతుడు లేదా దైవం ఆ భూమా శక్తికి అతిసమీపంలో ఉన్నవాడుగా ఉంటాడు. ప్రకృతి కార్యానికి ఎంత శక్తి అవసరమో అంతే శక్తి దైవం నుంచి వెలువడుతుంది. దేవుడే కాని, స్త్రీ దైవం అనేది లేదు. భగవంతుడు అనే పదానికి నిర్వచనంగా బాబూజీ– "ఉన్నదెవరో వారు ఉన్నారు" అని చెప్పారు.

**ప్రశ్న: మైండ్ (మనస్సు) చెదిరినప్పుడు ఆధ్యాత్మిక స్థితి మీద ప్రభావం చూపుతుందా?**

**జవాబు:** అటువంటిది ఏమీ జరగదు. మనస్సు చెదిరింది అంటే దానికి ఏదో కారణం ఉంటుంది. దాని మూలంగా మన దృష్టిని బాబూజీ మీద నుంచి మరల్చి దానివైపు ధ్యాస నిలుపుతాము. అప్పుడు మనకు ఆధ్యాత్మిక స్థితిని గురించిన ఆలోచన, అనుభూతి దృష్టికి రావు. అటువంటి సందర్భంలో మనం ఆ భంగం కలిగిన స్థితి నుండి మళ్ళీ పూర్తిగా ఆధ్యాత్మిక స్థితిలోకి రావాలంటే, ఒక్కసారి కళ్ళు తెరచి, ప్రేమతో బాబూజీని స్మరించుకొని, భంగపాటు కలిగించిన ఆ కారణాన్ని నివేదించుకుంటే అది తొలగిపోయి మనకు ప్రశాంతత చేకూరుతుంది. మన దృష్టి మళ్ళీ ధ్యానంలో లగ్న మవుతుంది.

**ప్రశ్న: పాయింట్స్ లేదా చక్రాలను గురించి వివరించండి.**

**జవాబు:** వాటిని గురించి మనం ఆలోచించాల్సిన అవసరం లేదు. చక్రాలు ఆరు. మనం షట్చక్రాలు అంటాము. అలాగే పాయింట్స్ అనేవి చాలా సూక్ష్మం. లెక్కలేనన్నివిగా ఉంటాయి. వీటి నన్నింటినీ దాటుకుంటూ అందరూ గమ్యం చేరుకుంటారు. సహజమార్గ విధానంలో ఆగిపోవటమంటూ ఉండదు. చక్రాలు అనగా శక్తి కేంద్రాలు. అవన్నీ తెరచుకోబడతాయి. అది సాధన మీద ఆధారపడి ఉంటుంది. అందుకే బాబూజీ "ఓపెన్ యువర్ సెల్ఫ్" అని అన్నారు. అనంతయాత్ర యొక్క ఐదు సంపుటాల్లో వాటిని వివరించటం జరిగింది. పుస్తకాలు చదివినంతమాత్రాన అవి అర్థం కావు. మనం ఆ స్థితులు పొందినప్పుడే

అర్థమవుతుంది. అనుభవం ద్వారా మాత్రమే వాటిని గ్రహించగలం. అనుభూతికి శబ్దం లేదు కనుక దాన్ని మాటల్లో వ్రాయటం కూడా కష్టమే.

బాబూజీ అనుగ్రహం వలన 'వారు' మనల్ని ప్రేరేపించటం వల్లనే వాటిని గురించి వ్రాయగల్గుతాం. మనకు బాబూజీ దర్శనం కలిగినప్పుడు కూడా ఆ అనుభూతిని గురించి వ్రాయటం సులభసాధ్యం కాదు. అందుచేత బాబూజీతో అనురాగబంధం (ఎటాచ్‌మెంట్) ఎంత ఎక్కువగా ఉంటే అంత మంచిది. ఉదాహరణకు – షాజహాన్‌పూర్ వెళ్ళటానికని అభ్యాసులు రైలులో ఎక్కుతారు. కొంతమంది ఏయే స్టేషన్లు వస్తున్నాయి, రైలు ఎంత వేగంగా ప్రయాణిస్తోంది, ఆయా ప్రాంతాలు ఎలా ఉన్నాయి – అని పరిశీలిస్తూ ఉంటారు. మరికొందరు ప్రశాంతంగా ఏ ధ్యాస లేకుండా విశ్రాంతి పొందుతారు. చివరకు అందరూ గమ్యం చేరుకుంటారు. ఇక్కడ రైలు ఎక్కడమే ప్రధానమెలా అయ్యిందో, సహజమార్గంలో చేరటమనేది కూడా ప్రధానాంశమే. ఆధ్యాత్మిక ప్రయాణం కొనసాగి, గమ్యం చేరతాము. అందుచేత పాయింట్స్, చక్రాలను గురించిన ఆలోచన అనవసరం.

సహజమార్గ చిహ్నంలో స్వస్తిక్ మార్క్, మిట్టపల్లాలు, మెలికలూ, వెలుగు చీకట్లూ ఎన్నో దాటుకుంటూ వెళ్ళాక సత్యపథ్ కనిపిస్తుంది. బాబూజీతో ఎటాచ్‌మెంట్ అనగా ఏ పనిలో ఉన్నప్పటికి నిరంతరం 'వారి' ఆలోచన, వారిపట్ల భక్తి, ప్రేమ, వినమ్రత ఎంత ఎక్కువగా అభివృద్ధి చేసుకుంటే అంత త్వరగా సత్యపథ్ చేరుకుంటాం. శ్రీరామచంద్ర మిషన్‌లో చేరాము అంటే ఆ సహజమార్గ విధానం మనల్ని ఆ దైవం అనగా బాబూజీతో సంధానపరుస్తుంది. మనం భక్తి శ్రద్ధలు పెంచుకుంటే మనల్ని దరిచేర్చటం – గమ్యం చేర్చటం బాబూజీ యొక్క బాధ్యతగా ఉంటుంది. బాబూజీ మహరాజ్ నావారు, అనుకుంటూ బాబూజీ మహరాజ్‌తో నేను మీవాడిని అంటూ బాంధవ్యం నెరపుకుంటే మనం వారికి అత్యంత సన్నిహితులమై వారి అనుగ్రహం పొందుతాం. మనం మిషన్‌లో చేరటంలో ఉద్దేశ్యం మనం బాబూజీ సాన్నిధ్యం పొందటానికే.

ఇనీషియేషన్ అంటే అభ్యాసీని దివ్యత్వంతో సంధాన పరచటం, సాధన ద్వారా సమీపింపచేయటం.

ఈశ్వరుడు అందరిలో ఉన్నాడు, అంటే మనలోనూ ఉన్నాడు. మనస్సనే మందిరంలో దైవం ఉన్నాడు అని అంటాము. ధ్యానంలో కూర్చోవటం అంటే వారిని ధ్యానంలో నిలుపుకోవటం. అలాగే ఏ పని చేస్తున్నా ఎల్లవేళలా వారినే జ్ఞాపకం ఉంచుకోవటం. కాని మనం దైవం సర్వశక్తియుతుడు అని తెలిసికూడా దైవాన్ని మర్చిపోయాం. జీవునికి పరమాత్మతో సంబంధం ఉంది – అనే విషయాన్ని కూడా గ్రహించాలి. కనుక ధ్యానం ద్వారా వారికి సన్నిహితమవుతూ ఉంటే మనకు ఆ పరమానందం కలుగుతుంది.

భారతదేశంలో ఎంతమంది జనాభా ఉన్నారో వాళ్ళందరూ సాధువులే అని ఒకరు వ్యాఖ్యానించారు. అంటే పైకి కనిపించేదేకాని ఆంతరికంగా సాధుగుణాలు లేవు. రామాయణ, భాగవతాది గ్రంథాలు పారాయణం చేస్తుంటారు, పురాణ కాలక్షేపం చేస్తుంటారు. కాని వాటిల్లోని ఆంతరార్థం గ్రహించటంకాని, జనానికి గ్రహింపజేయటం కాని చేయరు. మర్మగర్భితమైన భక్తిభావాన్నిగాని, సహనశీలతనుగాని, త్యాగాన్నిగాని, నీతినిగాని విడమర్చి బోధించే ప్రయత్నం చేయరు. అలాగే శ్రీరామునిపట్ల హనుమంతుడు కలిగి ఉన్న భక్తి విశ్వాసాలు, త్యాగాన్ని గురించి బోధించరు. కేవలం కథా శ్రవణంలాగా జరిపేస్తుంటారు. మనం పూర్తిగా ధ్యానంలో నిమగ్నమైపోగా అనగా దైవంతో గాఢమైన సంబంధం కలిగి ఉన్నప్పుడు ఏవైనా ఆలోచనలు,

అనుభూతులు వంటివి వచ్చినా మనం వాటికి స్పందించకుండా, సహించలేనంతగా అయిపోతాము. దీక్షగా 'వారి' దర్శనభాగ్యం కొరకే ఎదురుచూస్తూ ఉంటాము.

ప్రిసెప్టర్ సిట్టింగ్ ఇచ్చేప్పుడు అభ్యాసీకి ఉన్నతస్థితి కలగాలనే సంకల్పంతో ఉండాలి. అదే విధంగా అభ్యాసీ కూడా మనస్సు లగ్నంచేసి తానూ ఉన్నత స్థితులు పొందాలనే తలంపుతో ఉండాలి. అయితే ఆ ప్రాణాహుతిని, ఆ స్థితులను కల్పించేది బాబూజీయేగాని ప్రిసెప్టర్ కాదు. బాబూజీ అందరినీ అంతిమంకు తీసుకు వెళ్ళాలనే తలంపుతోనే వచ్చారు కనుక అందరికీ వారే ఆ స్థితులను ఇస్తారు. కనుక ప్రిసెప్టర్ అభ్యాసీ యొక్క ఉన్నతిని కోరుతూ బాబూజీకి కనెక్ట్ చేస్తారు. అభ్యాసీ కూడా అదే సంకల్పంతో ఉండాలి. దానినిబట్టి బాబూజీ కృప వర్షిస్తుంది. అంతేకాని ప్రిసెప్టర్ నుంచి కాదు.

నాలో ఒక ప్రశ్న ఉదయించింది. ఎంతోమంది ప్రిసెప్టర్లు ఉన్నారు. వారు తమ ఉన్నతితో సంతృప్తి చెందలేకపోయినప్పుడు అభ్యాసీని ఉన్నత స్థితికి ఎలా తీసుకుపోగలరు అని. అందుచేత ప్రిసెప్టరు తాను పొందలేని స్థితులను లేదా తాను పొందకపోయిన ఉన్నత స్థితులను కూడా అభ్యాసులు పొందాలనే సత్‌సంకల్పం కలిగినవారై ఉంటే అభ్యాసులకు ఎక్కువ లబ్ధి చేకూరుతుంది. అభ్యాసులు ఉన్నతి పొందాలనే సంకల్పం, కృషి డాక్టర్‌గారిలో ఉన్నాయి.

ప్రతిరోజు ఉదయం ఒక గంట ధ్యానం, సాయంత్రం నిర్మలీకరణ, అలాగే రాత్రి నిద్రించేముందు ప్రార్థన ఆచరించినంత మాత్రాన అభ్యాసీకి ప్రతిఫలం లభించదు. వాటిలో, వాటికితోడుగా తపన ఉన్నప్పుడే మంచి ప్రతిఫలం దక్కుతుంది. అదే విధంగా ప్రిసెప్టర్ కూడా 'విధి' అన్నట్లు అభ్యాసులకు సిట్టింగ్ ఇచ్చినంతమాత్రాన బాబూజీ నుంచి మంచి ప్రతిఫలం అందుకోలేరు. వారి హృదయంలో కూడా అభ్యాసులు పురోగతి చెందాలనే తపన, కృషి ఉంటే బాబూజీ నుంచి ఆ ప్రిసెప్టర్లకు కూడా మంచి ప్రతిఫలం లభిస్తుంది. కనుక ఇరువురూ కూడా యాంత్రికంగా కాకుండా హృదయపూర్వకంగా తపనతో కృషి చేయాలి.

బాబూజీ చెప్పారు– అభ్యాసీ తనలో తపన పెంచుకోవాలి, అని. అది ఎలా సాధ్యమవుతుంది అంటే– ఉదయం ధ్యానం చేస్తాం. ఆ ధ్యానంలో ఏదైతే అనుభూతి, ఆనందం కలుగుతాయో వాటిని ధ్యానం పూర్తయ్యాక – నిరాలోచనగా ఉండకుండా పగలంతా కూడా వాటిని స్మరించుకుంటూ ఉండాలి. జ్ఞాపకం చేసుకుంటూ ఉండాలి. అప్పుడు మన మనస్సంతా దివ్య భావంతోనే నిండిపోయి, అందులోనే మునిగి ఉంటుంది. అంటే మనకు కలిగిన అనుభూతుల్లో –బాబూజీ దేనినైతే ప్రసాదిస్తారో అందులోనే మునిగి ఉండాలి. భౌతికంగా మనకు దాహం వేస్తే నీరు త్రాగుతాము. దాహం తీరుతుంది. కాని హృదయంలో కలిగిన ఆనందానుభూతిని ఎంత తరచి తరచి స్మరించినా ఇంకా తనివితీరనిదిగా ఉండి, ఇంకా ఎక్కువ ఆనందానుభూతుల కోసం అన్వేషణ జరుగుతూ ఉంటుంది. ఈ దాహం తీరనిదిగా ఉండాలి. అంటే, అదే తపన; నిరంతరం దైవాన్ని గురించే ఆలోచించేటట్లు చేస్తుంది. బాహ్య ఆలోచనలు దరిచేరవు.

సిట్టింగ్ అయిన తర్వాత ప్రిసెప్టర్ అభ్యాసీతో అతని కండిషన్ బాగుంది అనిగాని, మంచి అనుభూతి వచ్చింది అనిగాని ప్రశంస చేసినట్లయితే అభ్యాసీ దానికి లోబడిన కారణంగా ఇంకా ముందుకు వెళ్ళి మంచి స్థితులు, అనుభూతులు చెందాలనే తపన కొరవడుతుంది. అప్పుడు ప్రిసెప్టర్ మరియు అభ్యాసీ కూడా అసంతృప్తితో నిలకడ చెందుతారు. అలా కాకుండా పురోగతికోసం తపన చెందుతూ ఉండాలి.

మునులు తపస్సు చేసి శక్తిని సాధించినప్పుడు వారిలో అహం ఉంటుంది. కాని సహజమార్గ విధానంలో ఇంకా 'పూర్తిగా పొందలేదు' అనే తపనతో ఉండటం వలన అహం జనించదు. సహజమార్గం అనేది దైవ సాక్షాత్కారానికైన ఒక విధానం. పరిపూర్ణత సాధించాలంటే తపన చెందుతూ బాబూజీ దర్శనం, అనుగ్రహం ఎప్పుడు కలుగుతాయోనని ఎదురుతెన్నులు చూస్తూ ఉండేట్లుగా ఉండాలి.

ప్రకృతి యొక్క తపన మూలంగానే దివ్యావతరణ జరుగుతుందని ఎప్పుడో చెప్పారు లాలాజీ. దానికి తగినట్లుగా స్పందించి బాబూజీని అవతరింపజేశారు వారు. మానవమాత్రుల్లో దైవాన్ని గురించిన ఆలోచన, భక్తి లోపించాయి కనుక వాటిని పునరుద్ధరించటం కోసమే బాబూజీ అవతరణ జరిగింది. సహజమార్గ విధానం అనేది భగవంతునిపట్ల భక్తిని పెంచి ఆ దైవాన్ని చేరే దిశగా ప్రయాణింపచేసేదిగా గ్రహించాలి.

లౌకిక జీవనంలో మనకు ఎన్నో కోరికలు ఉంటాయి. కాని అన్నింటినీ పొందటం అసాధ్యం. అందుచేత కలిగినంతలో తృప్తి చెందాలి. కాని ఆధ్యాత్మిక జీవనంలో లక్ష్యం సాధించేంతవరకు తృప్తి చెందకుండా తపించాలి. మనలోని లోపాలను, అశక్తతను గురించి ఆలోచించకుండా మనం బాబూజీకే సమర్పితమయ్యాం కనుక వారి అనుగ్రహం కోసమే పరితపించాలి.

మీ సెంటర్‌లో అభ్యాసీ ఎవ్వరైనా అస్వస్థులైనా, ఏదైనా ఆపరేషన్‌కు గురి అయినా డాక్టర్‌గారు వెంటనే వారి కష్టానికి స్పందించి నాకు ఫోన్ చేస్తారు. వారికి అభ్యాసులపట్ల అంత ప్రేమ. వారి యోగక్షేమంపట్ల అంత శ్రద్ధ ఉన్నాయి. అటువంటి హృదయపూర్వకమైన ప్రేమ అక్కడ వర్ధిల్లుతున్నది కనుకనే బాబూజీకి మీ (విజయవాడ) సెంటర్ మీద ప్రత్యేక అభిమానం ఉంది.

ఒకసారి నేను షాజహాన్‌పూర్ వెళ్ళినప్పుడు బాబూజీకి ఒక అభ్యాసీ నుంచి ఉత్తరం వచ్చింది. అందులో అతను తన కష్టాల గురించి బాధపడుతూ వ్రాశాడు. దానిని చదువుతూ శ్రీ కాశీరామ్ –బాబూజీకి ఇటువంటి విషయాలేనా వ్రాసేది, అంటూ ఆగ్రహం చెందారు. అపుడు బాబూజీ కాశీరామ్‌గారిని వారిస్తూ– అభ్యాసీ తన బాధల నుంచి ఉపశమనం పొందటానికో లేదా బాధలు తీరతాయి అనో నాకు తెలుపుకున్నాడు. తల్లి తీరుస్తుందని పిల్లవాడు తన బాధలు చెప్పుకుంటాడు. అందులో అతనికి తృప్తి కలుగుతుంది. అలాగే అభ్యాసీ కూడా. అందుచేత అసహనం చెందవద్దని చెప్పారు. కనుక ఆ విధంగా అభ్యాసులపట్ల ప్రేమభావం ఉంటుంది 'వారి'కి.

ఒకసారి వరదాచారిగారు "ఈ సిస్టమ్‌లో బ్రదర్‌హుడ్ (సోదర భావం) బాగా ఉంది" అని బాబూజీతో అన్నారు. అపుడు మాస్టర్జీ (బాబూజీ) ఇందులో 'హుడ్' లేదు – అందరూ బ్రదర్స్, సిస్టర్స్ మాత్రమే –అనగా అందరూ సోదరలు, సోదరీలే. బ్రదర్‌హుడ్ అనగా సోదరభావం అని స్ఫురిస్తుంది. కాని అందరూ సోదర సోదరీలే అన్నప్పుడు సాన్నిహిత్యం ఉంటుంది. మొదటి దానిలో కొంచెం ఎడం (దూరం) ఉంటే రెండవ దానిలో ఆత్మీయత ఉంటుంది.

సహజమార్గంలో బాబూజీ చెప్పింది ధ్యానం చేయమని కాదు, ధ్యానంలో ఉండమని. అనగా దైవం నీలో ఉన్నాడని భావించి ఆ దైవాన్ని కలవటానికి, చూడటానికి మరీ మరీ ప్రయత్నించటం. అలా చేసినప్పుడు దైవ సామీప్యత కలిగి దివ్యానుభూతి కలుగుతుంది. ఆ దివ్యానుభూతి ఎప్పుడు కలుగుతుందంటే మనం మనలోని ఆ బాబూజీ మీదే దృష్టి నిలిపి వారిని పొందే ప్రయత్నంలో ఉండగా వారితో కలయిక (స్పర్శ)

కలుగుతుంది. అపుడు మనకు ఫీలింగ్ అనగా అనుభూతి కలుగుతుంది. అంటే ఆలోచన, వారు మనలోనే ఉన్నారన్న ఆలోచన స్థానంలో వారితో సామీప్యత, అనుబంధం కలుగుతాయి. ధ్యానంలో ఆలోచనలు రాలేదు కనుక బాగుందని మనం అనుకుంటాం. ఆలోచనలు రాకపోవటం ముఖ్యం కాదు. అనుభూతిని చెందటమే ముఖ్యం. అది కలగాలంటే మన దృష్టి అంతా 'వారి' మీదనే లగ్నం కావాలి. కేంద్రం వారే కావాలి. మనం వారికి ఎంతగా సామీప్యత చెందితే అంతగా వారిని మనవైపు ఆకర్షితులను చేసుకుంటాం. నిరంతర స్మరణ వారిపై నిలిపితే 'వారు' మనల్ని ఆకర్షించటం, శక్తి నివ్వటంతోపాటు నిద్రలో ఉన్నా కూడా స్థితులు కల్పిస్తారు. అనగా మనం పగలనక, రేయనక 'వారి'తో విడదీయరాని బంధం ఏర్పరచుకోవాలి.

నా అనుభవరీత్యా చెప్పాలంటే, మనల్ని మనం బాబూజీకి  అర్పించుకోవాలి. అనగా శరణాగతి పొందాలి. "మీరు నా వారు, నేను మీ వాడిని" అని బాబూజీకి నివేదించుకోవాలి. అది మన అంతఃకరణలో సంపూర్ణ సమర్పణ జరగాలి. అపుడు నిదానంగా మనలో ఉన్న 'నేను' అను తత్వం తరిగిపోతూ, అంతా 'వారే' అను అనుభూతి  కలుగుతుంది. లౌకికంగా మనకు మనం ధరించే వస్త్రాలు నచ్చినట్లుగా అనిపించినా, ఆహార పదార్థాలు రుచికరంగా తోచినా కూడా అది 'వారి' పరంగానే లభించినట్లు అనుభూతి చెందుతాము. ఆ విధంగా మనం వారితో సంబంధం పెంచుకుంటూ పోవాలేకాని, ఆ అనుబంధం, 'వారి' దివ్యాకర్షణ నుంచి వైదొలగకూడదు. అపుడు మనకు అంతా బాబూజీమయంగానే అనుభూతి కలుగుతుంది. 'నేను' అను అహం కరిగిపోతుంది.

నేను క్రొత్తగా వ్రాసిన పుస్తకం ఒకటి ప్రింట్ అవుతోంది. అందులో రీజియన్స్ గురించి వివరించటం జరిగింది. ఈ విధంగా రీజియన్స్ గురించి వ్రాసిన వారిలో నీవే ప్రథమ వ్యక్తివి అవుతావు అన్నారు బాబూజీ. ఇదివరకు సాధారణంగా అందరిలాగే శ్రమపడిన తర్వాత నాకు నిద్ర వచ్చేది. కాని ఇప్పుడు అభ్యాసుల ఆత్మోన్నతి కోసం పాటుపడుతున్నందున నిద్ర యొక్క ధ్యాసే ఉండటంలేదు. **అభ్యాసులు తమ ఉన్నతి కోసం నేను ప్రాణాహుతిని, స్థితులను ఇస్తున్నానని అనుకుంటారు. అంతా బాబూజీయే ఇస్తారు, నేను కాదన్నా జనం విశ్వసించరు. వాస్తవానికి ఇచ్చేవారు బాబూజీయే. ఆ కృషి వారిదే.**

హృదయ మండలంలో ఐదు వలయాలు ఉంటాయి. వాటిని దాటినట్లయితే మాయను దాటి వెళ్ళినట్లు అనుకుంటారు. పంచభూతాలైన నేల, నీరు, నింగి, నిప్పు, వాయువు ఎలాగో అవీ అలాగేనని అనుకుంటారు. ధ్యానంలో లోతుగా మునిగి విస్మృతావస్థలోకి వెళ్ళినట్లయితే ఆ విశాలమైన హృదయ మండలాన్ని దాటినట్లవుతుంది. కాని దానిని గురించిన ధ్యాస అనవసరం. మీరా, కబీరు వంటి భక్త శిఖామణులు, వారు అనుభూతి చెందినా కూడా వాటిని గురించి వివరించలేదు. అది ఎవరికి వారు అనుభూతి చెందగలిగినదే కాని ఇతరులచేత చూడబడేది, చదవబడేది కాదు; అనుభూతికి మాత్రమే అందుతుంది. మామూలుగా మనం మన హృదయంలో బాబూజీ ఉన్నారనుకుని ధ్యానం చేస్తాం. కాని ఎప్పుడైతే మనం ధ్యానంలో గాఢంగా, లోతుగా మునిగి ఆ విస్మృతి స్థితి లేదా మరపు స్థితిలోకి వెళ్ళిపోతామో అప్పుడు మనమే బాబూజీ హృదయంలో నివసిస్తున్నట్లు అనిపిస్తుంది. ధ్యాన మగ్నతలోని పరివర్తన ఇలా ఉంటుంది. మనలో ఎంతగా సబ్‌మిషన్ (నివేదన) ఉంటే అంతగా గాఢమైన అనుభూతి కలుగుతుంది.

మైండ్ రీజియన్ అనగా హిరణ్యగర్భ మండలాన్ని దాటటం చాలా కష్టమైనది. ఎందరో మహానుభావులు దాటినప్పటికి దానిని గురించి చెప్పలేకపోయారు. ఈ మండలపు శక్తి కేంద్రం ఉంటుంది. అందులో కూడా ఒక బిందువు ఉంటుంది. దాని నుంచి సృష్టి నిర్మాణానికి అవరసమైన శక్తిధార దిగివస్తూ ఉంటుంది. దాని తీవ్రత నుంచి తప్పించుకుని వెళ్ళటం చాలా కష్టమైన పని. అటువంటి దానిని బాబూజీ తమ సంకల్పంతో ఆ బిందువును తెరచి దాటిస్తారు. ఒకసారి మనలో ఆ బిందువును తెరచాక అది మళ్ళీ మూసుకు పోవటం అంటూ ఉండదు. దీనిని నేను ఎలా వ్రాయగల్గానంటే, బాబూజీ నా మీద పరిశోధన చేసి, ఈ విషయాన్ని సమస్త మావనాళికి చాటి చెప్పదలచుకున్నారు కనుక, అందరినీ ఆ విధంగా పైకి తీసుకు వెళ్ళదలచారు కనుక నాచేత వారే వ్రాయించారు. వారివల్లనే నాకు అది సాధ్యమైంది. అటువంటి స్థితిలో బాండేజి (బంధం) ఏమీ ఉండదు.

ఒకసారి చారిగారు తన తల్లిదండ్రుల ఆత్మస్థాయిని గురించి అడిగినపుడు బాబూజీ ఇలా చెప్పారు: గాడ్లీ రీజియన్ –16 వలయాలు – ఇవన్నీ దాటాక ఆత్మకు ఇంక ప్రాపంచిక బంధనం ఉండదు. కేవలం ఐడెంటిటీ మాత్రమే ఉంటుంది. కృష్ణుడు, వివేకానందుడు, రామకృష్ణ పరమహంస వంటి మహానుభావు లందరూ ఇవన్నీ దాటాక బ్రైటర్ వరల్డ్ చేరుకుని అక్కడ ఉంటారు. వారంతా లిబరేటెడ్ సోల్స్ అనగా విముక్తాత్మలు. వారు ఇంకా పైకి వెళ్ళి భూమాను చేరవచ్చు. కాని ఆ బ్రైటర్‌వరల్డ్‌లో వారు పొందుతున్న ఆనందాన్ని అనుభవిస్తూ ఉంటారేకాని విడిచి వెళ్ళరు. ఎవ్వరైనా దివ్య పురుషుడు ఈ భూమి మీదకు దిగి వచ్చినప్పుడు అటువంటి విముక్తాత్మలు 'వారి' పనిలో సహాయపడుతూ ఉంటారు. అంతర్వాణి ద్వారా వారు సందేశాలు పంపుతూ ఉంటారు. బాబూజీకి లాలాజీ చేసిన హెచ్చరికలు –ఇంటి వెనుక దొంగలు ఉన్నారు, ఆ గదిని వదలిపెట్టు, ఆ ప్రదేశానికి వెళ్ళవద్దు అని చెప్పినటువంటివి ఇటువంటి ఆదేశాలే. వారికి బాండేజి (బంధనం) ఉండదు. వారు ఆ తోజో మండలాన్ని వదలిపెట్టరు. బాబూజీ కుమారుడు తమ తల్లిగారి గురించి బాబూజీని అడిగినప్పుడు, ఆమె లిబరేటెడ్ సోల్ కనుక ఇంక ప్రాపంచిక బంధనం అనగా తల్లి అని భావించబడదు అని చెప్పారు. అటువంటి విముక్తాత్మలను మన ప్రాపంచిక బాంధవ్యంతో ముడిపెట్టకూడదు. వారి దివ్యత్వాన్ని గురించే తలంచాలి. (దీనిని గురించి విడుదల కాబోతున్న క్రొత్త పుస్తకంలో వివరించాను.)

దైవానికి మైండ్ లేదు, చెవులు లేవు, అని బాబూజీ చెప్పిన మాటను పట్టుకుని మన పెద్దభయ్యా ఆ అవసరాన్ని తీర్చటానికి ఒక జీవించి ఉన్న వ్యక్తి అనగా వినటానికి చెవులు, చూడటానికి కళ్ళు, చెప్పటానికి నోరు ఉన్నటువంటి వ్యక్తి సజీవ మాస్టర్‌గా ఉండాలనే అభిప్రాయాన్ని ఆచరణలో పెట్టున్నారు. సూపర్ కాన్షస్ మైండ్ (అధిచేతనా మనస్సు) అనేది దైవానికి చెందినది. కాన్షస్ మైండ్ మానవునిది. మనకు ఉన్న కాన్షస్ మైండ్‌తో ప్రశ్నలకు మనకు తోచిన సమాధానం చెప్తూ ఉంటాము. కాని దివ్యపురుషుల విషయంలో మనం ఏదైనా ప్రశ్నించినప్పుడు అది ఆ సూపర్ కాన్షస్ మైండ్‌ను (మన మైండ్ పరిమితమైనది కాని అది అపరిమితమైనది, దాని శక్తి అనంతమైనది) తాకి సత్యవంతమైన సమాధానం వస్తుంది. దానికింక మార్పుగాని, దానికి అతీతమైనదిగాని ఏమీ ఉండదు. అటువంటి సత్యశక్తి ముందు సజీవ మాస్టర్ సామర్థ్యం ఎంతటిదో మనం ఊహించుకోవచ్చు. అవునన్నా, కాదన్నా ఇది యదార్థం.

శ్రీరామచంద్ర మిషన్ అనేది ఒక సామాన్య సంస్థగా కాకుండా ఆధ్యాత్మిక లక్ష్యంతో అనగా ఒక మహా సంకల్పంతో, అది కూడా – అందరినీ అనంతం చేర్చాలనే సంకల్పంతో స్థాపించబడింది. బాబూజీచేత స్థాపించబడింది కనుక ఆ సంస్థకు బాబూజీ మాత్రమే ప్రెసిడెంట్. 'వారు' స్థాపించిన ఈ మిషన్ నిర్వహించబడుతూ ఉండాలి. అనేకానేక మందిని అభ్యాసులుగా చేర్చి లక్ష్యాన్ని పొందేట్లుగా అభ్యసింప చేయాల్సి ఉంది కనుక దానికి ఒక నిర్వాహకుడు అనగా అధ్యక్షుడు ఉండటం అవసరమే. అటువంటి బాధ్యతను వహించే వారిని మనం గౌరవించాలి, గౌరవిస్తాము కూడా. అంతేకాని పరమపిత, పరమాత్మ స్వరూపుడు అయిన బాబూజీ స్థానాన్ని ఎవ్వరూ ఆక్రమించలేరు. కనుక ఆర్గనైజేషన్‌గా వ్యవహరించే దానికి ప్రెసిడెంట్‌గా ఉన్నవారికి, సంకల్పం లేదా ఆశయానికి మూలవిరాట్‌గా వ్యవహరించిన ప్రెసిడెంట్ బాబూజీకి అనగా ఆ పదానికి వ్యత్యాసం ఉంది. దీనిని గమనించకపోతే భవిష్యత్ తరాలవారు అపోహపడే అవకాశం ఉంది. కనుక ఈ విషయాన్ని పదే పదే ప్రస్తావించవలసి వస్తోంది. వ్రాయవలసి వస్తోంది. సమస్త మానవాళిని సహజమార్గంలో నడిపించి అందరికీ సాక్షాత్కారం కల్పించాలనేటటువంటి మహదాశయం బాబూజీ మిషన్‌ది. అంతేకాని ఏ ఒక్కరి ప్రయోజనమో లేక బహుకొద్ది మంది ప్రయోజనం కొరకో కాదు. కళ్ళు తెరిస్తే కనిపించేది బాహ్య ప్రపంచం, బాంధవ్యమూ; కళ్ళు మూస్తే కనిపించేది ఏ దేశంలో నయితే బాబూజీ ఉంటారో ఆ దేశం. ఈ విషయం బాబూజీ చెప్పారు. వారు చెప్పారు కనుకనే, అందరికీ ఆమోదయోగ్యంగాను, జ్ఞానం కలిగించేదిగాను ఉంటుంది.

ఒకసారి బాబూజీతో మీ రూపంపైన ధ్యానం చేయవచ్చా అని అడిగాను. మారుతూ ఉండే రూపంమీద కాదు. శాశ్వతమైన దానిపై ధ్యానం చేయి. అలా ఎందుకంటే మనం పదేళ్ళుగా, 20 ఏళ్ళుగా, 30 ఏళ్ళుగా ధ్యానం చేస్తూ ఉంటాము. శరీరంలో మార్పులు వస్తూ ఉంటాయి. కాని ధ్యానించే దానిలో మార్పు ఉండదు. శరీరం అశాశ్వతమైనది, దివ్యత్వం శాశ్వతమైనది, సత్యమైనది. అందుచేత మార్పులు చెందే రూపాలు, మూర్తులమీద కంటే శాశ్వతమైన సత్యత్వం మీదనే ధ్యానం చేసినట్లయితే మనకు పరమానందం, శాశ్వతానందం దక్కుతాయి.

గోపికలు కృష్ణునికి ఎన్నో తినుబండారాలు తీసుకువచ్చి అర్పించారు. అప్పుడు కృష్ణుడు "వాటినన్నీ నేను తిన్నాను. చాలా రుచిగా ఉన్నాయి" అన్నాడు. గోపికలకు ఆశ్చర్యం వేసింది. తాము ఇంకా ఆయనకు అర్పించకుండానే ఎలా తిన్నాడా అని. వారు ఈ పదార్థాలను తయారు చేస్తున్నప్పుడు కృష్ణుణ్నే తలచుకుంటూ, కృష్ణుడికి ఈ పదార్థాలు, ఈ రుచి ఇష్టం అనుకుంటూ అర్పణభావంతో వండటం వలన వాటి రుచి ఆయనకు ముందుగానే తెలిసింది. మనలో అర్పణభావం అనేది చాలా ముఖ్యం.

జీవన ముక్తావస్థలో చేతులతో ఏదైనా తాకినా ఆ స్పర్శ తెలియదు. నేలపై నడుస్తున్నా, నేలపై కాలు ఆనదు.

**ప్రశ్న: గుణములు గుణములందే వర్తించును అని అన్నారు, దీని అర్థం ఏమిటి?**

**జవాబు:** ఈశ్వరునిలో గుణములు లేవు. మనం బాబూజీలో లయావస్థ పొందినప్పుడు చెవులు వింటాయి, చేతులు పని చేస్తాయి కాని అది మన ఆంతర్యాన్ని తాకదు. ఎవరైనా మనల్ని ప్రశ్నించినప్పుడు సరియైన జవాబు దానికదే వస్తుంది.

ఒకసారి నేను (సోదరి కస్తూరీజీ), బాబూజీ, మేము ఇద్దరిమే ఉన్నప్పుడు 'వారు' నాతో ఇలా అన్నారు: "బిటియా! ప్రశ్నలు ఏమైనా ఉంటే అడుగు. అవి ఏవైనా –నాకూ తెలియదు, నీకూ తెలియదు కనుక మంచి జవాబులే వస్తాయి. తెలివిగలవాళ్ళు ఉంటే రకరకాల ప్రశ్నలు వేస్తారు. కాని ఇక్కడ మనం ఇద్దరిమే ఉన్నాం కదా, ఆ సమస్య లేదు" అని అన్నారు.

ఒక అభ్యాసీ బాబూజీతో "నేను ఎప్పుడూ జపమాల త్రిప్పుతూ మీ నామమే జపిస్తూ ఉంటాను" అని అన్నాడు. అప్పుడు బాబూజీ "నీవు జపమాల త్రిప్పుతూ ఉంటే మాలలోని పూసలు జపిస్తూ ఉన్నాయి. మీరు ఉచ్ఛరిస్తూ ఉన్నారు అంతే. హృదయంలో నుండి భగవంతుణ్ణి పిలిచినప్పుడే అది జపం అవుతుంది" అని అన్నారు. ఏ గుణములతో ప్రశ్న అడిగితే అదే గుణములతో మనస్సు సమాధానం ఇస్తుంది. మానవమాత్రులు అడిగిన ప్రశ్నకు మానవమాత్రుల స్థాయిలోనే సమాధానం వస్తుంది. నేను బాబూజీకి ఉత్తరంలో ఇలా వ్రాసాను: "బాబూజీ! అమ్మ ఆకుపచ్చ చీర తెమ్మంటే మనస్సు మీద ఏ విధమైన ప్రభావం లేకుండానే చేతులు అదే రంగు చీరను తీసుకువచ్చి ఇచ్చాయి. ఏదైనా వస్తువు ఎక్కడైనా పెట్టాలి అంటే చేతులు ఆ పని చేసేస్తాయి. ఎప్పుడూ తప్పు జరగదు. ఇది ఎలా జరిగింది?" అని వ్రాశాను. దానికి బాబూజీ జవాబుగా "బిటియా! మాయ దాటిన తర్వాత రంగులు ఏమీ లేవు. మాయ దాటిన తర్వాత ఏ మనస్సు అయితే ఉంటుందో అది స్పందించి ప్రాపంచిక పనులను చేస్తుంది. కాని హృదయం మాత్రం ఎప్పుడు 'అతని'తోనే కలిసి ఉంటుంది" అని చెప్పారు.

ఈశ్వర్ సహాయ్‌గారు ఒకసారి బాబూజీని ఇలా అడిగారు: "బాబూజీ! మాయ దాటిన తర్వాత రంగులు ఏమీ ఉండవు అని అన్నారు కదా! మరి రాముడు, కృష్ణుడు భగవద్‌రాజ్యపు మహామాయ నుండి వచ్చారు కనుక వారు నీలిరంగు పొంది ఉన్నారని మీరు చెప్పారు. ఈ నీలం రంగు ఎలా వచ్చింది?" అని.

అప్పుడు బాబూజీ సమాధానంగా, "ఇక్కడ ప్రపంచంలో ఏదైతే రంగు ఉందో అది బాహ్యమైనది అని చెప్పవచ్చు. భగవత్ రాజ్యంలో రంగు, బంధం, సుఖం, దుఃఖం ఏమీ లేవు. మహామాయ యొక్క నీలపు రంగుకి, సాధారణమైన నీలం రంగుకి తేడా ఉంటుంది. ఆ నీలం రంగులో ఆకర్షణ, తేజస్సు ఉన్నాయి. సాధారణ నీలిరంగులో ఏ ఆకర్షణ, తేజస్సు ఉండవు. జనాన్ని ఆకర్షించటం కోసం రాముడికి, కృష్ణుడికి నీలం రంగు ఇవ్వబడింది" అని అన్నారు. ఋషులు, మునులు ప్రార్థించటం వలన రాముడు, కృష్ణుడు మహామాయ స్థానం నుండి అవతరించారు. సృష్టి రచన కేంద్రం యొక్క కేంద్రం నుండి బాబూజీ అవతరించారు. కబీర్ మొదలైనవారు కూడా ఆ పదహారో వలయం వరకు మాత్రమే వెళ్ళగలిగారు. కాని బాబూజీ మనల్ని అంతకన్నా పైకి తీసుకు వెళ్ళతారు. ఇప్పుడు బాబూజీ అవతరించిన తర్వాత కబీరులాగ "హద్, అనహద్ కె బీచ్ మే రహ కబీరా" అనే అవసరమే లేకుండా బాబూజీ అందరికీ దారి ఏర్పరిచారు. బాబూజీ ఒక్కరే మనల్ని భూమా (అల్టిమేట్) లేదా అంతిమ సత్యంకు తీసుకువెళ్ళతారు. బాబూజీ నాచేత యాత్ర చేయించినప్పుడు ప్రతి రీజియన్‌లోగల కేంద్రంలో మునక వేయించి, బయటకు తీసారు. అంటే ఆ శక్తిలో నన్ను ముంచారు. బాబూజీ నన్ను రీజియన్‌లోకి తీసుకుని వెళ్ళినప్పుడు ఒక నవశిశువును జాగ్రత్తగా తీసుకుని వెళ్ళినట్లు తీసుకుని వెళ్ళి ఆ శక్తిలో ముంచి తరువాత సెంట్రల్ రీజియన్ యొక్క మొదటి వలయంలో ఉంచారు. భూమా శక్తి ఒక వెలుగురేఖలాగా ప్రవహిస్తుంది. ఆ శక్తి నాకు ప్రసాదించారు.

బాబూజీ భూమా నుండి భువికి అవతరించిన దారే సహజమార్గం. ఈ భూమిపైనగల ఈ సహజమార్గమే బాబూజీ చరణాలు. 'వారి' చరణాలను పట్టుకొని ఉంటే మనం పైకి చేరుకుంటాము. ప్రతి రీజియన్ యొక్క కేంద్రంలో బాబూజీ యొక్క సంకల్పం ఉంది. ఆ సంకల్పంలో మనం లయ చెందినప్పుడు ఉన్నత స్థితులను పొందగలుగుతాము.

ఇంతమంది దేవతలు ఉండగా గంగను శివుడే ఎందుకు ధరించవలసి వచ్చింది అని నేను బాబూజీని అడిగినప్పుడు వారు నాకు జవాబు వ్రాసారు. దాని అర్థం ఇప్పుడు తెలుస్తోంది. ప్రతి వ్యక్తి యొక్క సహస్రారంలో ఒక బీజం ఉంటుంది. అది తెరుచుకుని ఉన్నప్పుడు భగవంతునికి, వ్యక్తికి మధ్య వార్తాహరునిగా పని చేస్తుంది. ఏదైనా సమాచారం భగవంతునికి చేర్చటానికి, భగవంతుని నుండి వచ్చే సందేశాన్ని రిసీవ్ చేసుకోవటానికి ఇది తోడ్పడుతుంది. దేవతలు ఎవ్వరికీ ఈ బీజం తెరిచి లేనందువలన, శివుడికి ఒక్కడికే ఇది తెరచి ఉండటంవలన గంగ ఉద్భవం యొక్క సమాచారం తెలిసి ఆయనే దీనిని (గంగను) జటాజూటంలో బంధించటం జరిగింది. ఆ స్థితిలో గంగ అనేది ఒక శక్తి. అది భూమిపైకి వచ్చినప్పుడు ఒక ప్రవాహంగా మారింది.

ఒకసారి శ్రీ బాబూజీ నాకు ఉత్తరం వ్రాస్తూ, "నా అస్తిత్వం ఏమిటి?" అని ప్రశ్నించారు. మరల వారే జవాబు వ్రాస్తూ, "నేను ఒక చీమ లాంటి వాడిని. ఎవరు తొక్కినా, తొక్కి చంపినా నేను ఏమీ అనను" అని అన్నారు. ఒక పర్యాయం కొంతమంది సాధువులు బాబూజీని చూడటానికి రాగా, 'వారు' అందరితో సాధారణంగా ఆ మాట్లాడటం చూసి "నీకు భాషా పరిజ్ఞానం కూడా లేదు. సన్యాసి వేషం వేసి మోసం చేస్తున్నావు. డబ్బు కోసం ఇదంతా చేస్తున్నావు" అని అవమానించారు. అప్పుడు అక్కడ ఉన్న ఈశ్వర్ సహాయ్‌గారికి చాలా ఆవేశం వచ్చింది. అయినా బాబూజీ వారిని వారించారు. సాధువులు వెళ్ళిన తరువాత ఈశ్వర్ సహాయ్‌గారితో "నేను ఒక చీమలాంటి వాడిని" అని అన్నారు.

భగవత్ రాజ్యం నుండి సృష్టి రచనకు ఎంత శక్తి అవసరమో అంతే శక్తి అక్కడికి వస్తుంది. తపన అనేది హృదయంలో ఏర్పడుతుంది. తపన దైవం ఇవ్వనిదే ఏర్పడదు. ఈశ్వరుడు అందరినీ ప్రేమిస్తాడు. మనం 'అతని' కోసం తపించినప్పుడు ప్రేమ మనకు లభిస్తుంది. ఈ ప్రపంచం కేవలం అనురాగబంధం (ఎటాచ్‌మెంట్)తో నడుస్తుంది. బాబూజీ మహరాజ్ లాలాజీతో "నా కళ్ళు మిమ్మల్నితప్ప ఇంకెవరిని చూడవు" అని అన్నారు. మన ప్రేమతో 'వారి'పట్ల హృదయంలో అనురాగబంధాన్ని పెంచుకోవాలి. ఇక్కడ ముఖ్య విషయం ఏమిటంటే, ఆత్మ నివేదన జరగాలి. నేను మైండ్ రీజియన్‌లో ఉన్నానా, బ్రహ్మాండ మండలంలో ఉన్నానా, పరబ్రహ్మాండ మండలంలో ఉన్నానా, ఏ రీజియన్ (మండలం)లో ఉన్నాను, అని అలోచిస్తే ప్రోగ్రెస్ లేదు. ప్రోగ్రెస్ అనేది భక్తి, ప్రేమతో ఏర్పడుతుంది. ఈ రీజియన్స్ (మండలాలు) అనేవి బాబూజీ చేసిన పరిశోధనే! ఉండవలసినది కేవలం 'వారి'పట్ల భక్తి మాత్రమే.

నేను ఇది చేశాను, నేను అది చేశాను అని చెప్పుకుంటే 'నేను' అనేది ఉంటుంది. కాని ఏ పని చేస్తున్నా కళ్ళు వారినే అంటిపెట్టుకుని ఉన్నప్పుడే ప్రోగ్రెస్ ఉంటుంది.

బాబూజీ "ధ్యానంలో ఉండండి" అన్నారు. ధ్యానంలో ఉండటం వలన పేరు, రూపం తొలగిపోయి కళ్ళు పూర్తిగా వారిపై లగ్నం అవుతాయి. బాబూజీ కళ్ళు మనలను చూస్తున్నట్లు అనుభూతి కలుగుతుంది. బ్లెస్సింగ్స్ – కృపావర్షం లభిస్తుంది.

**ప్రశ్న: సాధన అంటే ఏమిటి?**

**జవాబు:** ఇక్కడ రెండు విషయాలు ఉన్నాయి. ఒకటి సృష్టి రచన 'You' (నీవు– దైవం) నుండి ఏర్పడింది. అంటే 'You' నుండి 'I' (నేను) ఏర్పడింది. 'I'ని 'You'తో కలిపినప్పుడు 'వారి'తో బంధం ఏర్పడి క్రమేణా 'I' తొలగిపోయి 'You' మాత్రమే ఉంటుంది.

ఒకసారి బాబూజీని ఒక సీనియర్ అభ్యాసీ– నేను ఏ రీజియన్‌లో ఉన్నాను, అని అడిగారు. బాబూజీ దానికి చమత్కారంగా జవాబు ఇలా ఇచ్చారు: "మీరు ఏ స్టేషన్‌కి టికెట్ కొనుక్కున్నారో నాకు ఎలా తెలుస్తుంది" అని. అప్పుడు ఆ సీనియర్ మాట్లాడకుండా వెళ్ళిపోయారు. తరువాత బాబూజీ "ఈయనకు ఆధ్యాత్మికతలో అ, ఆ లు తెలియదు– రీజియన్ గురించి మాట్లాడుతున్నారు" అని అన్నారు. ఒక నిజమైన అభ్యాసీ బాబూజీని ధ్యానిస్తుంటే వారికి ప్రోగ్రెస్ (అభివృద్ధి) ఉండదా? ప్రోగ్రెస్ ఉంటుంది, ఎంత సామీప్యతా స్థితి ఉంటుందో అంత అభివృద్ధి ఉంటుంది. అనుభూతి కలిగినప్పుడు మనం అభివృద్ధి చెందుతూ ఉన్నామని తెలుస్తుంది.

ఇప్పుడు పాడిన పాటలో చివరి రెండు చరణాల గురించి వివరిస్తాను. బాబూజీ తన సామ్రాజ్యంలో ఒక తల్లి ప్రేమతో తన బిడ్డలకై చేతుల చాచి ఉంచినట్లుగా 'వారు' తమ చేతులు చాచి ఉంచినట్లు కనిపించారు. 'వారి' దేశంలో ప్రతి శబ్దం "నీవు నా బిడ్డవు" అని బాబూజీ అంటున్నట్లు విన్నాను. నేను సాధన ప్రారంభించాక మనస్సులో, హృదయంలో, చెవులలో అంతటా బాబూజీ, బాబూజీ అని మాత్రమే వినిపిస్తుంది. అది బాబూజీకి వ్రాసినప్పుడు బాబూజీ ఇదే "అన్‌హద్" స్వరం అని జవాబిచ్చారు. స్వరం అంతటా కూడా వినిపిస్తుంది. కబీర్‌కి కూడా అంతటా 'రామ్' అనే శబ్దమే వినిపించింది.

**ప్రశ్న: లాలాజీగారి భార్య మరణించినప్పుడు యమధర్మరాజు స్వయంగా వచ్చాడు, అని అన్నారు. ఇది నిజమా?**

**జవాబు:** ఇది సరియైన ప్రశ్న కాదు. మనం పెద్దవాళ్ళ గురించి ఈ విధంగా మాట్లాడకూడదు. మనం మన ప్రాణాన్ని బాబూజీకి అర్పించుకున్న తరువాత ఇంక యమధర్మరాజు ప్రసక్తే రాదు.

రాముడు, కృష్ణుడు, శివుడు, హనుమాన్ వీరంతా ఎవరు? ఒక సంస్థను నడపటానికి ప్రెసిడెంట్, సెక్రటరీ మొదలైన వారు ఎలా ఉంటారో, అదే విధంగా సృష్టికార్యం కోసం బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఉన్నారు. హనుమంతుడు కేవలం రామభక్తుడు. రావణ సంహారంలో రామునికి సహాయం చేశాడు. ఈ లౌకిక ప్రపంచంలో సృష్టిలో చెడు ఆవరించినప్పుడు మునులు, ఋషులు ప్రార్థన చేస్తే సృష్టిని సవరించటానికి ఏర్పడిన అవతారాలు రాముడు, కృష్ణుడు.

ఒక అభ్యాసీ బాబూజీతో, "బాబూజీ! మిషన్‌కు చాలా సేవ చేయాలని నాకు అనిపిస్తుంది" అన్నారు. అంటే ఆ అభ్యాసీ ఉద్దేశ్యం ఆయనను ప్రిసెప్టర్ చేయాలని. దానికి జవాబుగా బాబూజీ ఏమన్నారంటే, "ప్రతి అభ్యాసీ ఒక ఉదాహరణగా తయారైతే, రామచంద్ర మిషన్ ఒక ఉన్నత సంస్థగా మారుతుంది."

దానికి మనం నిదర్శనంగా (ఉదాహరణగా) తయారు కావాలంటే చాలా ధైర్యం కావాలి. చెడుగా మారటం కష్టం. మంచిగా మారటం సులభం. ఒక దొంగ దొంగతనానికై ఎలా చేయాలి, ఎప్పుడు చేయాలి,

ఎవరూ చూడకుండా చేసుకోవటం ఎలా? అని ఎన్నో విషయాల గురించి ఆలోచించాలి. కాని మంచిగా మారాలంటే హృదయంలో సంకల్పం ఏర్పరచుకుంటే చాలు.

**ప్రశ్న: ఈ సృష్టి చాలా విశాలమైనది. చాలా గ్రహాలు ఉన్నాయి. భూమి మీద మాత్రమే ప్రాణులు ఉన్నారా? ఇతర గ్రహాలపైన కూడా ఉన్నారా?**

**జవాబు:** ఈ ప్రశ్నకు జవాబు ఒక శాస్త్రజ్ఞుడిని అడగాలి. అతడు మాత్రమే దీనికి సమాధానం చెప్పగలడు. నాకు బాబూజీ మాత్రమే తెలుసు. లాలాజీ భూమా అనే అనంతాన్ని వెతికి బాబూజీని క్రిందకు తెచ్చారు. కాలం చాలా విలువైనది. ఇలాంటివన్నీ ఆలోచించకుండా మన కాలాన్ని కేవలం దైవాన్ని ధ్యానించటం కోసం వినియోగించాలి.

**ప్రశ్న: మార్పు ఎలా వస్తుంది?**

**జవాబు:** ఈ భూమిపై ఎవరో ఒకరు అవతరించాలని సంకల్పం ఏర్పడినప్పుడు ఈ మార్పు వస్తుంది. బాబూజీ సంకల్పం వలన మార్పు తప్పకుండా వస్తుంది. బాబూజీ మహరాజ్ తన సంకల్పంతో అందరిని అనంతానికి చేర్చాలని అనుకున్నారు. కాబట్టి మార్పు తప్పక వస్తుంది.

రేపు మీరంతా రైలుబండిలో వెళ్తున్నారు. సహజమార్గం అనే రైలు గురించి చెప్తాను. ఈ సిస్టమ్‌లో టిక్కెట్ కొని ఏ బోగీలో కూర్చున్నా గమ్యాన్ని చేరుకుంటాము. వివిధ స్టేషన్‌ల గురించి పట్టించుకోని వారు ఉంటారు; స్టేషన్ గురించి పట్టించుకునే వారు ఉంటారు. రెండు రకాల వారు గమ్యాన్ని చేరుకుంటారు. అలాగే సహజమార్గంలో బాబూజీ సంకల్పం వలన మనం తప్పక గమ్యాన్ని చేరుకుంటాము. ఎవరికీ ఎటువంటి అనుమానం అవసరం లేదు. బాబూజీ ధ్యానంలో ఉంటే గమ్యం తప్పక లభిస్తుంది.

లక్నోలో ఒక మాతాజీ "కుండలినీ శక్తిని జాగృతం చేస్తారని చెప్తుంటారు. కాని కుండలిని జాగృతం అయ్యాక దాని శక్తిని సక్రమంగా ఉపయోగించకపోతే రావణాసురుడు, కుంభకర్ణులు తయారవుతారు కదా" అని అన్నారు. దానికి సమాధానంగా నేను ఇలా చెప్పాను: మన అభ్యాసీ లందరికి ప్రోగ్రెస్ లభించినప్పుడు శక్తి లభిస్తుంది. అది బాబూజీ శక్తి; అన్నీ మంచి పనులే చేస్తుంది. శ్రీ బాబూజీపట్ల పూర్తిగా నమ్మకం ఉన్నప్పుడే, మనం వారిలో ఉన్నప్పుడే వారి శక్తిని మనం అనుభూతి చెందుతాము. కుండలినీ శక్తి జాగృతమైన కూడా దాని శక్తి సక్రమంగా ఉపయోగపడే విధంగా బాబూజీ శక్తి పని చేస్తుంది.

ఒకసారి ఈశ్వర్ సహాయ్‌జీ "బాబూజీ! అభ్యాసీలు ఎన్నో ప్రశ్నలు అడుగుతూ ఉంటే మీరు కొన్ని మరచిపోతారు. ఎందుకు?" అని అడిగారు. అడగాటాన్ని హిందీలో 'పూచ్‌నా' అంటారు. 'న' అనే దాని అర్థం వద్దు అని, 'న' అని అన్నారు కదా! అందుకే నేను మర్చిపోతాను. ఏదైనా మాటలలో చెప్పటం కాదు, చేసి చూపించాలి– అని అన్నారు.

బాబూజీ ఒకసారి ఏమన్నారంటే, మనిషి రూపాయిలను తయారు చేస్తాడు కాని తానే రూపాయిలకు లోబడిపోయాడు. సృష్టికర్తకు తాను చేసిన సృష్టిపై ఎంతో ప్రేమ ఉంటుంది. తల్లి తన పిల్లలను చేరదీసినట్లు సృష్టికర్తకు అందరినీ తన వద్దకు తీసుకోవాలని కోరిక ఉంటుంది, అని. అనంతం నుండి వచ్చిన బాబూజీ ప్రేమను మనం పొందగల్గినప్పుడు ఇంత కంటే ఈ ప్రపంచంలో ఇంక ఏదీ అవసరం లేదు.

తల్లిప్రేమకన్నా బాబూజీకి మనపైగల ప్రేమ చాలా గొప్పది.

"లక్నో రావటానికి రైలు 4 గంటలు ఆలస్యంగా బయలు దేరింది" అని అనగానే, నేను ఇలా అన్నాను: రైలు 4 గంటలు ఆలస్యంగా వచ్చింది. కాని బాబూజీ మహరాజ్ మీ అందరి కొరకు ఎదురుచూస్తూనే ఉన్నారు. దీనికి కారణం ఏమిటి? "నా వద్ద ఉన్న ఆధ్యాత్మిక సంపద అంతా మీ అందరికీ ఇవ్వాలని తీవ్రమైన ఆకాంక్షతో ఉన్నాను" అని బాబూజీ, షాజహాన్‌పూర్‌కు వచ్చిన అభ్యాసులతో చాలాసార్లు అనేవారు. ఇప్పుడు ఆ శుభ సమయం వచ్చిందని నేను భావిస్తున్నాను. "నావద్ద ఉన్న ఆధ్యాత్మిక నిధిని, తీసుకోవటానికి అభ్యాసీ సిద్ధంగా ఉండాలి" అని బాబూజీ కోరేవారు.

భగవంతుడు మానవుని తన స్థితికి తీసుకొని వెళ్ళటానికి ఈ మానవుని కొరకు ఎదురు చూస్తున్నాడని నేను ఎక్కడా ఎప్పుడూ వినలేదు. కాని ఆశ్చర్యకరమైన, అద్భుతమైన విషయం ఏమిటంటే, నేను బాబూజీ మహరాజ్ సమస్త మావనాళికి అత్యున్నతమైన దివ్య ఆశీస్సులు ప్రసాదించటానికి 'వారు' ఎంతో ఆతృతతో అభ్యాసులందరి కొరకు ఎదురు చూస్తున్నారని నేను ఈ రోజు చెప్పగలను. 'వారు' ప్రసాదించే దివ్యత్వాన్ని, ఆశీస్సులను, దివ్యకృపను స్వీకరించటానికి అభ్యాసులందరూ సిద్ధంగా ఉన్నారా! అనే దాన్ని గురించి నేను ఏమీ చెప్పలేను. 'వారు' మనందరికి బ్లెస్సింగ్స్ (ఆశీస్సులు) ఇవ్వాలని అనుకుంటున్నారు కనుక వాటిలోనే అన్నీ ఉన్నాయి. అనగా ఆ దివ్యత్వాన్ని తీసుకోవటం, గ్రహించటం, అనుభూతి చెందటం, దానిని కాపాడుకొనడం మొదలైనవి అన్నీ కూడా వారి బ్లెస్సింగ్స్‌లో (దివ్య ఆశీస్సులలో) ఉన్నాయి. కాబట్టి అభ్యాసీలు, మరల లక్నో వచ్చినప్పుడు బాబూజీ మహరాజ్ ప్రసాదించే దివ్య ఆశీస్సులను పొందటానికిగాను, తగిన విధంగా తయారై ఉండాలని నేను కోరుతున్నాను. అభ్యాసీ లందరు ఆ విధంగా సిద్ధంగా ఉండటానికి నేను నా శాయశక్తుల కృషి చేస్తాను.

**ప్రశ్న: సూపర్ కాన్షస్ మరియు డివైన్ కాన్షస్‌కు గల భేదం ఏమిటి?**

**జవాబు:** చాలా భేదం ఉంది. ఒకసారి నేను "బాబూజీ! ఎవరైనా, ఏదైనా ప్రశ్న అడిగితే, ఆ ప్రశ్న నా మైండ్ (మనస్సు)ను స్పర్శించటం లేదు. ఆ ప్రశ్న ఎక్కడికి వెళ్ళుతుందో నాకు తెలియదు. కాని జవాబు మాత్రం, అప్రయత్నంగా దానంతట అదే వస్తుంది. నా నోరు మాట్లాడుతుంది, నా చెవులు వింటాయి. అప్పుడు, ఆ జవాబు పైనుండి వచ్చింది అని నాకు తెలుస్తుంది" అని వారికి వ్రాశాను. "బిటియా! నాకు చాలా ఆనందంగా ఉంది. లాలాజీ సాహెబ్‌కు కృతజ్ఞతలు, నీవు సూపర్ కాన్షస్ (అధిచేతన) స్థితికి చేరుకున్నావు. అందువల్లనే ప్రశ్నలకు జవాబులు, వాటంతట అవే, ఆ సూపర్ కాన్షస్ స్థితి నుండి వెలువడుతున్నాయి. సూపర్ కాన్షస్ అనేది గాడ్లీ రీజియన్ (ఈశ్వరీయ దేశం)లోని స్థితి" అని వ్రాశారు.

అభ్యాసీ సెంట్రల్ రీజియన్‌ను దాటి, అల్టిమేట్ (భూమా) లోని ఒకటవ వలయం దాటి, రెండవ వలయం (రింగ్)లోకి ప్రవేశించి నపుడు డివైన్ కాన్షస్ అనేది ప్రారంభమవుతుంది, అనగా దివ్య సందేశాన్ని ఇస్తుంది. ఈ స్థితిలో అభ్యాసీ పూర్తిగా మరచిన స్థితిలోనే ఉంటాడు కాబట్టి భూమాలోని రెండవ వలయం దాటినప్పుడు డివైన్ ఇచ్చే ఆ దివ్య సందేశాన్ని వినటానికి అవసరమైన కాన్షస్ (ఎరుక)ను దైవం ఆ అభ్యాసీకి ప్రసాదిస్తుంది. సూపర్ కాన్షస్ అనేది గాడ్లీ రీజియన్ (ఈశ్వరీయ దేశం)కు చెందినది. కాని డివైన్ కాన్షస్ అనేది అల్టిమేట్ రీజియన్ (భూమా)కు చెందినది.

బాబూజీని మరచిపోయాను అనే తలంపే రాకూడదు. ఆఫీస్ పని లేదా ఇంటిపనిలో మునిగిపోయి, 2,3 గంటల తరువాత బాబూజీ జ్ఞాపకం రాగానే, ఇప్పటివరకు ఆ సమయంలో బాబూజీని మర్చిపోయాను అని అనుకోకూడదు. "బాబూజీ! నేను మీ వాడిని. ఇప్పటివరకు నా హృదయం మీ చరణాలవద్దనే ఉంది" అని అనుకోవాలి. బాబూజీని మరచిపోయాను అనే ఆలోచన రాకూడదు. వారిని మరచిపోయాను అనే ఆలోచన రాగానే, నిరంతర స్మరణ అనేది అక్కడితో ఆగిపోతుంది. అందువలన 'వారి'ని మరచిపోయినా కూడ, 'వారు' గుర్తుకు రాగానే, "బాబూజీ! నేను మీ వాడిని" అనే ఫీలింగ్‌లో మునిగిపోవాలి. స్త్రీలు వంట చేస్తున్నప్పుడు, "బాబూజీ! నా వారు, నా ఎదుటనే ఉన్నారు, నేను వారినే చూస్తున్నాను"అని భావించాలి. మీరు రాత్రి నిద్రపోయేముందు, రోజంతా పనిచేసి అలసిపోయాను, ఇంక నిద్రపోవాలి అని అనుకోకుండా, "బాబూజీ! నా వారు. 'వారి' చరణాలవద్దనే నా శిరస్సు ఒదిగిపోయింది" అనే ఫీలింగ్‌లో మునిగిపోవాలి.

దివ్య పురుషుడు శ్రీ బాబూజీ మహరాజ్ అవతరించిన యుగం ఇది. ఇప్పుడు మీరు బాబూజీని స్మరిస్తే 'వారి'తో ఎటాచ్‌మెంట్‌ను అనుభూతి చెందుతారు. రాముడిని, కృష్ణుడిని మరచిపోతారు. రాముడిని, కృష్ణుడిని మీరు స్మరించినా మీ హృదయం వాళ్ళతో ఎటువంటి ఎటాచ్‌మెంట్‌ను పొందదు.

**ప్రశ్న: ధ్యానంలో పురోగతి చెందుతున్నామని తెలుసుకోవటం ఎలా?**

**జవాబు:** "భగవంతునితో సామీప్యతను అనుభూతి చెందటమే ప్రోగ్రెస్‌కు గుర్తు" అని బాబూజీ అనేవారు. బాబూజీ యొక్క సామీప్యతను మొదట మీ హృదయంలో అనుభూతి చెందుతారు. తరువాత బాబూజీ మీ ఎదుటనే, మీలోనే, మీతోనే ఉన్నట్లుగా అనుభూతి చెందుతారు. దివ్యత్వం అనే సముద్రంలో లోతుగా మునిగిపోవటమే డివోషన్. ధ్యానంలో లోతుగా వెళ్ళండి, అని బాబూజీ అనేవారు. ధ్యానంలో లోతుగా వెళ్ళటం అంటే, బాబూజీతో ఎక్కువగా సామీప్యత అనుభూతి చెందటం.

"నేను అందరిని ప్రేమిస్తాను" అని బాబూజీ అనేవారు. ఈ దివ్య వాక్యం అర్థం కావటానికి నాకు 60 సంవత్సరాలు పట్టింది. ఒక వ్యక్తి అందరిని ప్రేమిస్తాడు అని నేను ఎప్పుడు కూడా ఊహించ లేదు. ఎప్పుడైతే ఈ హృదయమే నేత్రంగా మారుతుందో, అనగా హృదయ నేత్రాలు కేవలం బాబూజీనే దర్శించినప్పుడు, ఈ భౌతిక నేత్రాల ఎదుట ఎల్లవేళలా బాబూజీయే ఉంటారు. మీరు ఎవరిని చూసినా మీకు ఆ వ్యక్తి కనబడదు. మొదట బాబూజీయే కనబడతారు. బాబూజీ వెనుక ఆ వ్యక్తి ఉంటాడు. ఈ స్థితిని పొందిన తరువాతనే "నేను అందరిని ప్రేమిస్తాను" అనే బాబూజీ అన్నటువంటి ఈ వాక్యం అర్థమయింది.

ఆత్మ అంటే ఏమిటో అనేది నాకు తెలియదు. నాకు కేవలం బాబూజీయే తెలుసు. మీకు ఒకవేళ ఈశ్వరప్రాప్తి గురించి క్రేవింగ్ ఉంటే, అన్ని విషయాలు సహజంగానే, వాటంతట అవే మీకు తెలుస్తాయి. ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! నా కుటుంబ సభ్యులు అందరూ మన మిషన్‌లో చేరాలని నాకు కోరికగా ఉంది" అని అన్నాడు. అప్పుడు వారు "నీవు ఈశ్వర సాక్షాత్కారం పొందటానికి ఈ మిషన్‌లో చేరావు. మొదట నీ గురించి ఆలోచన చేయి" అని అన్నారు.

అభ్యాసీ మూడు సిట్టింగ్స్ తీసుకొని మెడిటేషన్, క్లీనింగ్, ప్రార్థన చేస్తాడు. ఎప్పుడైతే మీ హృదయం తపనతో 'వారి'ని కలుసుకోవాలని, 'వారి'తోనే కలిసి జీవించాలని అనుభూతి చెందు తుందో, అప్పుడు మీరు "బాబూజీ! నేను మీ వాడిని" అని హృదయ పూర్వకంగా చెప్పగలరు. అప్పుడే నేను మిషన్‌లో చేరాను

అని మీరు చెప్పగలరు. సమస్త మావనాళిని అర్హులుగా తయారుచేసి, అల్టిమేట్ వద్దకు తీసుకొని వెళ్ళటానికే శ్రీరామచంద్ర మిషన్ ఏర్పడినది. ఎప్పుడైతే మీలో కూడా ఈ స్థితి ఏర్పడుతుందో, అప్పుడే మీరు నిజానికి శ్రీరామచంద్ర మిషన్‌లో చేరినట్లు గుర్తు. 'వారు' మనలను అందరిని అల్టిమేట్ వద్దకు తీసుకొని వెళ్ళటానికి తయారుగా ఉన్నారు. మన కోసం ఎదురు చూస్తున్నారు. 'వారి'తో కలిసి వెళ్ళటానికి మీరందరు కూడా తయారుగా ఉండాలి. కో–ఆపరేషన్ (సహకారం) అంటే ఇదే.

ఒక ప్రిసెప్టర్, "బాబూజీ! నేను ప్రతిరోజు 20, 22 సిట్టింగ్స్ ఇస్తున్నాను" అని అన్నాడు. అప్పుడు వారు "భాయీ! నీవు చాలా కష్టపడి పని చేస్తున్నావు" అని అనగానే ఆ ప్రిసెప్టర్ చాలా సంతోషపడ్డాడు. తరువాత రోజు మేమందరం బాబూజీతో కలిసి వరండాలో కూర్చొని ఉన్నప్పుడు, వారు "ఎవరైతే అభ్యాసీని మాస్టర్ పాదాలకు అర్పించి సేవ చేస్తారో, అటువంటి ప్రిసెప్టర్ నాకు చాలా ఇష్టం. ఈ ఫీలింగ్ లేకుండా, అభ్యాసీని 'వారి' చరణాలకు సమర్పించ కుండా నేను రోజుకు 20, 22 సిట్టింగ్స్ ఇస్తున్నాను అంటే, అతడు ఒక కూలీ పనివాడు మాత్రమే" అని అన్నారు.

బాబూజీ కృపకు పరిమితి లేదు. 'వారి' దివ్య కృప అనంతం. మనం పనిలో మునిగిపోయినప్పుడు 'వారి'ని మరచిపోతాము. కాని 'వారు' మనలను ఎల్లవేళలా గుర్తుపెట్టుకుంటారు.

"నేను బాబూజీతోనే ఉన్నాను. 'వారి' పావన చరణాలవద్దనే ఉన్నాను" అని అభ్యాసీ ఎల్లప్పుడు భావించాలి. అంతేకాని, నేను ఏ కండీషన్‌లో ఉన్నాను? ఏ రీజియన్‌లో ఉన్నాను? అని అలోచిస్తే మీరు, ఆ స్థితికే పరిమితమైపోవటం జరుగుతుంది. ప్రేమతో బాబూజీ స్మరణలో మునిగిపోయి, వారిలో లయావస్థను పొందినట్లయితే మీకు  అన్ని స్థితులు లభిస్తాయి. బాబూజీ స్మరణలో మునిగిపోయి, వారిలోనే ఎల్లప్పుడు మీరు జీవించినట్లయితే, మీరు కూడా ఆ అల్టిమేట్‌లోనే నివసిస్తున్నారని అర్థం. బాబూజీతో అనురాగ బంధం పెంచుకోవటం అనేది ఆధ్యాత్మికత పురోగతిలో చాలా ముఖ్యమైన విషయం. ఈ అనుబంధం అనేది ఎలా ఉండాలి? ఎప్పుడైనా అందమైన పుష్పాన్ని చూడగానే, ఓహ్! ఈ పుష్పం ఎంత ఆకర్షణీయంగా ఉంది, అనే ఆలోచన నా మనుస్సులోకి వచ్చేది. ఈ ఆలోచన రాగానే, ఈ సృష్టిలో అన్నిటికంటే అందమైనది బాబూజీ మహరాజ్ కదా! అనే ఆలోచన కూడా వెనువెంటనే వచ్చేది. అప్పుడు ఒక్కసారిగా నా మనస్సు మరల బాబూజీవైపుకు మరలేది. అనుబంధం అంటే ఈ విధంగా ఉండాలి.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! ఈ ప్రపంచంలో ఎన్నో ఆకర్షణలు ఉన్నాయి. అవి నన్ను ఆకర్షిస్తున్నాయి. నేను నిరంతర స్మరణ ఎలా చేయగలను? భగవంతుని గురించి అన్వేషణ ఎలా చేయగలను" అని అడిగాడు. అప్పుడు వారు "భాయీ! ఈ ప్రపంచం ఎంతో అందమైనది అని నీవు అన్నావు. కాని ఈ ప్రపంచంలోని మొత్తం అందం ఆ దివ్య సౌందర్యంలోని ఒక అణువు మాత్రమే" అని అన్నారు.

ఎవరికైతే దైవంతో కలయిక (కనెక్షన్) ఉందో, వారిని 'యోగి' అని అంటాము. నీవు 'వియోగ్' కాకుండా 'యోగి' కాలేవు – అని బాబూజీ అనేవారు. హిందీలో 'వియోగ్' అనగా సెపరేషన్ (ఎడబాటు) అని అర్థం. అభ్యాసీలో వియోగ్, దైవంతో ఎడబాటై ఉన్నానన్న ఫీలింగ్ ఉన్నప్పుడు క్రేవింగ్ (తపన) అనేది ఏర్పడుతుంది.

"శరీరం అనేది ఎప్పటికీ గురువు కాదు. ఎవరైతే ఈ శరీరాన్ని (గురువు యొక్క శరీరాన్ని) గురువుగా భావిస్తారో వాళ్ళు పశువుతో సమానం. దీని వలన వారిలో ఒక ధృఢమైన సంస్కారం (బంధనం) ఏర్పడుతుంది. ఈ బంధనం నుండి అభ్యాసీ ఎప్పటికీ విముక్తి పొందలేడు" అని బాబూజీ అనేవారు.

ఒకసారి ఈశ్వర్ సహాయ్‌గారు, "బాబూజీ! మీ రూపం (శరీరం) మీద ధ్యానం చేయాలని, అభ్యాసీలకు నేను చెప్పాలని అనుకుంటున్నాను" అని అన్నారు. అప్పుడు బాబూజీ, "భాయీ! ఇది నా ఫోటో, ఇదిగో ఇది కూడా నా ఫోటోనే. ఇంకొకటి, ఇది కూడా నా ఫోటోనే, ఈ మూడు కూడా నా ఫోటోలే. ఇవి అన్నీ నా శరీరానికి సంబంధించిన ఫోటోలు. నీవేమో శరీరం (రూపం) మీద ధ్యానం చేయాలని చెప్తున్నావు. కాని శరీరం శాశ్వతం కాదు కదా! ఈ శరీరం లేనప్పుడు నీవు దేని మీద ధ్యానం చేస్తావు?" అని అన్నారు. మనం బాబూజీ రూపంలోపల దాగి ఉన్నటువంటి ఆ డివైన్ పర్సనాలిటీ (దివ్య సౌందర్యం) యొక్క ఆ రియాలిటీ (వాస్తవికత)ను దర్శించటానికి సాధన చేస్తున్నాము. ఎప్పుడైతే ఈ శరీరాన్ని మరచిపోతావో అనగా నిన్ను నీవు పూర్తిగా మరచిపోయినపుడే, నీవు బాబూజీని పొందగలవు.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! యోగా అంటే ఏమిటి?" అని అడిగాడు. అప్పుడు వారు, "భాయీ! నేను నిన్ను ధ్యానంలో కూర్చోమని చెప్పలేదు. 'దైవం – నాలోనే ఉన్నాడు' అనే సత్యం మీద నీ దృష్టిని ఉంచమని చెప్పాను. 'దైవం – నాలోనే ఉన్నాడు" అనే దానిని గుర్తు పెట్టుకోమని చెప్పాను. ఈ దివ్య సత్యం జ్ఞాపకం పెట్టుకోవటం వలన ఒక రోజున నీకు ఆ డివైన్‌తో కనెక్షన్ ఏర్పడుతుంది. యోగా అంటే కనెక్షన్. ఆ దైవంతో కలయిక ఏర్పడుతుంది" అని అన్నారు.

ఒకసారి మేమందరం బాబూజీ ఇంటిలోని వరండాలో 'వారి'తో కలిసి కూర్చున్నాము. అప్పటికే బాబూజీ డాక్టర్ కె.సి. వరదాచారిగారిని సెంట్రల్ రీజియన్‌కు తీసుకొని వెళ్ళారు. అప్పట్లో మాలో ఎవరికి కూడా నిజమైన డివోషన్ (భక్తి) అనేది లేదు. చాలామందికి హార్ట్ రీజియన్, మైండ్ రీజియన్, సెంట్రల్ రీజియన్ గురించి తపన ఉండేది. దైవం కొరకు తపన లేదు. కాని, ఈ సెంట్రల్ రీజియన్ కొరకు ఆరాటం ఉండేది. అప్పుడు ఒక ప్రిసెప్టర్ తనను సెంట్రల్ రీజియన్‌కు తీసుకొని వెళ్ళమని బాబూజీని కోరాడు. వారు ఏమీ మాట్లాడకుండా నిశ్శబ్దంగా ఉన్నారు. ఆ ప్రిసెప్టర్ మరల షాజహాన్‌పూర్‌కు వచ్చినప్పుడు, బాబూజీ "భాయీ! నీవు నిన్ను సెంట్రల్ రీజియన్‌కు తీసుకొని వెళ్ళమని అడిగావు. నీవు కోరిన విధంగానే నేను నిన్ను సెంట్రల్ రీజియన్‌కు చేర్చాను. కాని నీవు అక్కడ కూర్చోకుండా, ఇక్కడ (ఈ అభ్యాసుల గుంపులో) ఎందుకు కూర్చున్నావు?" అని అడిగారు. దీని అర్థం ఏమిటంటే, బాబూజీ మీకు ఏ స్థితినైతే ప్రసాదించారో, దానిలోనే ఆ దివ్య వాతావరణంలోనే మీరు నివసించాలి. కాబట్టి, 'బాబూజీ నావారు' అనే ఒక్క ఫీలింగ్‌ను అభ్యాసీ కలిగి ఉండాలి. రీజియన్‌లు, స్థితులను గురించి ఆరాటపడవలసిన అవసరంలేదు.

"బాబూజీ నావారు. నాకు చాలా సమీపంలో ఉన్నారు. 'వారు' నా హృదయంలోనే ఉన్నారు" అని భావించటం వలన మిమ్మల్ని మీరు సులభంగా మరచిపోగలరు. ఇక్కడ హృదయం అంటే పిడికెడు గుండె కాదు, మొత్తం సిస్టమ్ – శరీరవ్యవస్థ అంతా కూడా హృదయంగా భావించాలి. మీలోని అణువణువు, మొత్తం సిస్టమ్ అంతా కూడా బాబూజీ ఉన్నట్లుగా భావించాలి. "బాబూజీ నావారు" అనే ఫీలింగ్ మీలో

ఏర్పడినప్పుడు, మీ ప్రోగ్రెస్‌ను ఎవరు కూడా ఆపలేరు. అందువలన మీరు "బాబూజీ నావారు" అని నోటితో అనడం కాకుండా, హృదయంలో అనుభూతి చెందాలి.

"తమ హృదయంలోకి రావలసినదిగా అభ్యాసీలు నన్ను ఆహ్వానిస్తారు. నేను, అక్కడికి రాగానే వాళ్ళు నన్ను విడిచిపెట్టి ఎక్కడికో ఏ ఆలోచనలోకో వెళ్ళిపోతారు. నేను ఒక్కడినే ఒంటిరిగా, నిశ్శబ్దంగా వాళ్ళ హృదయంలో కూర్చొని ఉంటాను. నేను మీ ఇంటికి వచ్చినప్పుడు, మీరు నన్ను వదలి వేరే చోటికి వెళ్ళటం మర్యాద కాదు కదా!" అని బాబూజీ చాలాసార్లు అనేవారు. అందువల్లనే "బాబూజీ! మీరు నావారు. మీరు నాలోనే ఉన్నారు" అనే ఫీలింగ్‌తో ఉంటే 'వారు' ఒక్కరే ఒంటరిగా ఉండవలసిన అవసరం రాదు. 'వారు' ఎల్లప్పుడు మీతోనే ఉంటారు.

"సమస్త మానవాళిని, అత్యున్నతమైన స్థితికి అల్టిమేట్ వద్దకు తీసుకొని వెళ్ళటానికి నేను ధరణి మీద అవతరించాను" అని బాబూజీ అన్నారు. ఇది 'వారి' దివ్య సంకల్పం కాబట్టి అందరం తప్పకుండా అక్కడకు అనగా అల్టిమేట్ చేరుకుంటాము.

**సబ్‌మిషన్ (ఆత్మ నివేదన):** "బాబూజీ! నావద్ద సెల్ఫ్ (నేను) అనేది తప్ప ఇంక ఏదీ లేదు. ఈ సెల్ఫ్ (నేను) అనే దానినే మీ చరణాలకు అర్పిస్తున్నాను. దయచేసి స్వీకరించండి" అని ప్రార్థించాలి. "బాబూజీ! నేను మీ వాడిని" అని 'వారి'కి మీ సెల్ఫ్‌ను సమర్పించాలి. ఇదే ఆత్మ నివేదన (సబ్‌మిషన్). ఈ ఆత్మ నివేదన పూర్తి అయినపుడు, బాబూజీ  ఎల్లవేళల మీ ఎదుటనే ఉంటారు. అక్కడ నీవు ఉండవు. నీ 'సెల్ఫ్' అనే దాన్ని వారు స్వీకరించారు. ఇది సరెండర్ (శరణాగతి). ఇప్పుడు బాబూజీ అభ్యాసీని తమ ఇష్టప్రకారంగా తయారుచేస్తారు.

"హిందీలో 'ఉపవాస్' (ఉప + వాస్) అంటే భగవంతునితో నివసించటం అని అర్థం. ఆ రోజంతా ధ్యానంలోను, భగవంతుని స్మరణలో గడపాలి. మనస్సును, దృష్టిని పూర్తిగా భగవంతుని మీద నిలపాలి. కాని ఉపవాసం రోజునే అందరూ పిండివంటలు, స్వీట్స్ తయారుచేయడంలో బిజీగా ఉంటారు" అని బాబూజీ అనేవారు. "నీవు జ్వరంతో 20 రోజులు బాధపడతావు. ఆ 20 రోజులు ఆహారం తీసుకోవు. అప్పుడు అది ఉపవాసం అవుతుందా?" అని బాబూజీ నవ్వుతూ అనేవారు.

వ్రత్ అంటే సంకల్పం అని అర్థం. హనుమంతుడు సీతా మాతను వెదకి తీసుకొని రావాలి అనే ఒక వ్రతం (సంకల్పం) ఏర్పరచుకొన్నాడు. అదే విధంగా "నేను నా బాబూజీని పొందాలి" అనే వ్రతదీక్ష, ఒక సంకల్పం మీరు ఏర్పరచుకోవాలి.

ఒక అభ్యాసీ, "బాబూజీ! నిజమైన స్వేచ్ఛ అంటే ఏమిటి?" అని అడిగాడు. అప్పుడు వారు "భాయీ! సెల్ఫ్ (నేను) అనే దాని నుండి విముక్తి పొందటమే నిజమైన స్వేచ్ఛ" అని అన్నారు. ఒకసారి నేను, "బాబూజీ! నేను మరచిన స్థితిలో జీవిస్తున్నాను. ఏదైనా వస్తువు లేదా పనిని మరచిపోవటం లేదు. కాని 'నేను' అనే దానిని మరచిపోతున్నాను. ఎప్పుడైనా 'నేను' అనేది గుర్తుకు వచ్చినప్పుడు, ఆ 'నేను' అనేది మీకు చాలా సమీపంలో ఉన్నట్లుగా అనిపిస్తున్నది" అని వారికి ఉత్తరంలో వ్రాశాను.

"బాబూజీ! నేను మీ వాడిని" అని 'నేను' అనే దానిని 'వారి'కి సమర్పించినప్పుడు, అది సెల్ఫ్-సరెండర్ అవుతుంది. అపుడు 'నేను' నుండి విముక్తి (స్వేచ్ఛ) లభిస్తుంది. తరువాత బాబూజీలోనే మునిగిపోయి,

'వారి'లోనే జీవించటం వలన ఆత్మ నెమ్మదిగా కరిగిపోతూ డివైన్‌లో కలిసిపోతుంది. ఇదే సోల్–సరెండర్ (ఆత్మ శరణాగతి). కాని ఆత్మ లేకుండా ఎవరూ జీవించలేరు. ఇప్పుడు ఆత్మ స్థానంలో బాబూజీ మహరాజ్ ఉంటారు. ఇదే ఫ్రీడమ్–ఫ్రం –సోల్ (ఆత్మ నుంచి స్వేచ్ఛ పొందటం). దీని ఫలితంగా బాబూజీలో లయావస్థ మొదలవుతుంది. బాబూజీయే అభ్యాసీ స్థానంలో ఉండి అన్ని పనులు చేస్తారు. దివ్యత్వం అనే సముద్రంలో మునిగిపోయి నప్పుడు లయావస్థకు చెందిన వివిధ స్థితులు అనుభవంలోకి వస్తాయి. లయావస్థ యొక్క చిట్టచివరి స్థితిలో, శరీరం ఈ ప్రపంచంలో అప్రయత్నం (ఆటోమేటిక్)గా, యాంత్రికంగా అన్ని పనులు చేస్తుంది. నీవు మాత్రం బాబూజీ (డివైన్ పవర్)లోనే జీవిస్తావు.

ఒకసారి బాబూజీ నవ్వుతూ, "ఈశ్వర్ సహాయ్‌జీ! ఈ అభ్యాసీ తన బిజినెస్‌ను, కుటుంబ సభ్యులను అన్నింటిని నాకు సమర్పించాడు, అని అంటున్నాడు. కాని నాకు బిజినెస్ (వ్యాపారం) గురించి ఏమీ తెలియదు. అతని బిజినెస్ అతడినే చేసుకోమను. ఒకవేళ నేను ఆయన బిజినెస్ (వ్యాపారం) చేస్తే నా బిజినెస్ (పనిని) ఎవరు చేస్తారు? నేను ఈ దివ్య కార్యం కొరకే కదా ఇక్కడకు వచ్చినది. అతని భారమంతా నేను తీసుకోవాలని అతని కోరిక. అతడు తన కుటుంబ సభ్యులను, బిజినెస్‌ను అన్నీ కూడా ఉట్టి మాటలలోనే నాకు అర్పిస్తున్నాడు. నాకు ఇవేవి అవసరం లేదు. కాని అతని సెల్ఫ్ (నేను) మాత్రమే నాకు కావాలి. ఎందుకంటే, ఆ సెల్ఫ్ (నేను) అనేది అభ్యాసీకి నాకు మధ్య ఉన్న దూరాన్ని ఏర్పరచినది. ఆ సెల్ఫ్ వల్లనే అభ్యాసీ ఈశ్వరుని నుండి విడిపోయాడు" అని అన్నారు.

నేను ధ్యానం ప్రారంభించిన తొలిరోజులలో నాకు మెడిటేషన్‌లో ఆలోచనలు వచ్చేవి. ధ్యానంలో ఆలోచనలు రాకపోతే, ధ్యానం సక్రమంగా జరిగింది అని భావించేదానిని. కాని ధ్యానంలో ఆలోచనలు వస్తున్నాయి అంటే నా అటెన్షన్ (దృష్టి) బాబూజీ మీద లేనట్లే కదా! ఒకసారి నేను షాజహాన్‌పూర్ వెళ్ళినప్పుడు, "బాబూజీ! ధ్యానంలో ఆలోచనలు వస్తున్నప్పుడు, 'ధ్యానం సరియైన పద్ధతిలోనే జరుగుతున్నది' అని నేను ఎలా తెలుసుకోగలను?" అని 'వారి'ని అడిగాను. అపుడు 'వారు' ఎంతో ప్రేమతో "బిటియా! ఆలోచనలు అనేవి ధ్యానంలో ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. కాని శాంతి, ప్రశాంతత, ఆనందం, లేదా తేలికదనం వంటివి ఏదైనా ఫీలింగ్ (అనుభూతి) నీ హృదయానికి కలిగినట్లయితే, నీకు ఆలోచనలు వచ్చినప్పటికి, ధ్యానం సరియైన పద్ధతిలోనే జరుగుతున్నదని అర్థం" అని అన్నారు. ధ్యానంలో పొందినటువంటి ఆనందం, తేలికదనం, అలా ఆ స్థితిలోనే మునిగిపోవటానికి ప్రయత్నించినట్లయితే ధ్యానంలో ఆలోచనలు రావు, అని నాకు కొన్ని రోజుల తరువాత అర్థమయింది. కనుక ధ్యానంలో ఆలోచనలు వచ్చినప్పుడు, మీ హృదయంలో కలిగిన ఫీలింగ్ (శాంతి, ఆనందం లేదా తేలికదనం) లోనే మునిగిపోవటానికి మీరు కృషి చేయాలి. అప్పుడు ఆలోచనలు తగ్గిపోయి, కొంత కాలానికి అసలు రావు. ధ్యానంలో ఈ బ్లెస్సింగ్స్ (ఆనందం, శాంతి లేదా తేలికదనం) అనేవి బాబూజీ నుండి వస్తున్నాయి. కనుక ధ్యానంలో మీరు ఆ దివ్య ఆశీస్సులను తీసుకొని ఆలోచనలను మరచిపోండి.

ఒక్కొక్కసారి ధ్యానంలో నాకు చాలా ఆలోచనలు వచ్చేవి, ధ్యానం సరిగా చేయలేకపోయేదానిని. అప్పుడు నేను కళ్ళు తెరచి, నా ఎదుటనే ఉన్న బాబూజీ మహరాజ్‌ను అరక్షణం పూర్తి అటెన్షన్ (శ్రద్ధ)తో చూసి మరల మెడిటేషన్ ప్రారంభించేదాన్ని. అప్పుడు ధ్యానంలో ఆలోచనలు రాడటం ఆగిపోయేది. కనుక

ధ్యానంలో మీకు ఎక్కువగా ఆలోచనలు వచ్చినప్పుడు, వెంటనే ఒక అర నిమిషం కళ్ళు తెరచి, “బాబూజీ నా ఎదుటనే ఉన్నారు, బాబూజీ నావారు” అనే ధృఢమైన ఫీలింగ్‌తో మరల ధ్యానం ప్రారంభించండి. ఆలోచనల తీవ్రత వెంటనే తగ్గిపోతుంది.

కుర్చీలో కూర్చొని ఉన్న బాబూజీ ఫోటోను, లేదా వారి రూపాన్నిగాని నిరంతరం జ్ఞాపకం చేసుకోవటం అనేది నిరంతర స్మరణ కాదు. ధ్యానంలో మీకు ఏదైతే ఫీలింగ్ (అనుభూతి) కలిగినదో, ఆ స్థితిలోనే, బాబూజీ ప్రసాదించిన దివ్య ఆశీస్సులలోనే నిరంతరం మునిగిపోయి ఉండటానికి కృషి చేయాలి. నిరంతర స్మరణ అంటే ఇదే. ధ్యానంలో కలిగిన అనుభూతి (ఫీలింగ్)లోనే మునిగిపోయి జీవించటం వలన బాబూజీతో సామీప్యత ఎక్కువగా ఏర్పడుతుంది.

“బాబూజీ నా వారు” అని నోటితో అనటం వలన ప్రయోజనం లేదు. “బాబూజీ నా వారు” అని నోటితో అన్నప్పుడు మీ హృదయం ‘వారి’ సామీప్యతను అనుభూతి చెందాలి. “బాబూజీ నా వారు” అని మీరు అన్నప్పుడు, మిమ్మల్ని మీరు మరచిపోవాలి. అక్కడ మీరు ఉండకూడదు. కేవలం ‘వారు’ మాత్రమే ఉండాలి. ఒకసారి బాబూజీ, **“బిటియా! ఎటాచ్‌మెంట్ (అనుబంధం) అనేది అభ్యాసీవైపు నుండి రావాలి, ప్రేమ అనేది నావైపు నుండి వస్తుంది”** అని నాకు ఉత్తరంలో వ్రాశారు. కనుక “బాబూజీ నా వారు” అని మీరు వారితో అనుబంధం ఏర్పరచుకోవాలి.

“నేను అభ్యాసీని రోజుకు 4,5 సార్లు 1 గంట, 2 గంటలు, 3 గంటలు ధ్యానం చేయమని చెప్పలేదు. దైవం నా హృదయంలోనే ఉన్నాడు అనే దానినే గుర్తుపెట్టుకోమని చెప్పాను” అని బాబూజీ అనేవారు. “బాబూజీ నా వారు; నాలోనే ఉన్నారు; నన్నే చూస్తున్నారు” అనే దానిని మీరు గుర్తుపెట్టుకుంటే చాలు.

బాబూజీ మహరాజ్ కృప వలన, ‘వారి’ కోరిక ప్రకారం, ప్రతి అభ్యాసీ యొక్క ఆత్మ, మరల బయటకు రాలేని విధంగా, శ్రీ బాబూజీ మహరాజ్ కృపలోనే పూర్తిగా మునిగిపోయింది. తల్లి ఎల్లప్పుడు తన బిడ్డలు ఆనందంగా ఉండాలని కోరుకుంటుంది. అదే విధంగా బాబూజీ కూడా మీరందరు ఆ స్థితిలో నిరంతరం ఆనందంగా ఉండాలని కోరుతున్నారు. అంతేకాదు, ఇది ‘వారి’ సంకల్పం కనుక, బాబూజీ దివ్య కృపలో మునిగిపోయిన మీ ఆత్మ మరల బయటకు రాదు. మీరు ఇంటి పని లేదా ఆఫీస్ పనిలో మునిగిపోయినప్పటికి, బాబూజీ జ్ఞాపకం రాగానే, నా ఆత్మ బాబూజీ కృపలోనే మునిగిపోయి ఉన్నది అని జ్ఞాపకం చేసుకుంటే, మీరు ఇక్కడ పొందిన స్థితిలోనే మునిగిపోయి ఉంటారు. బాబూజీ మహరాజ్ సమస్త మానవాళిని అల్టిమేట్ (భూమా) వద్దకు తీసుకొని వెళ్ళాలి అనే దివ్య సంకల్పంతో అవతరించారు. ప్రాపంచిక జీవితంలో మీ డ్యూటీ (విధి)ని మీరు సక్రమంగా నిర్వహించండి. కాని మీ ఆత్మ ‘వారి’లోనే మునిగిపోయినది. ‘వారి’ పావన చరణాలవద్దనే ఉంది, అనే విషయాన్ని మాత్రం మరచిపోవద్దు. మీలోని ఐ–నెస్ అనేది ఆత్మగా మార్పుచెంది, ఆత్మ అనేది ‘వారి’ దివ్య కృపలోనే మునిగిపోయినది. మీరు బాబూజీలోనే ఇంకా ఇంకా మునిగిపోవటానికి కృషి చేయండి. ఈ స్థితి నుండి బయటకు మాత్రం రాకూడదు. సహజమార్గ్ అంటే ఒక జీవన విధానం అని బాబూజీ చెప్పారు. అనగా అన్ని పనులను చేస్తూనే, నిరంతరం ‘వారి’ దివ్య కృపలో మునిగిపోయి జీవించటం.

బాబూజీ ఆశీస్సులు మనందరికీ ఎల్లప్పుడూ ఉంటాయి. వాటిని మనం పొందగలగాలి. అందుకు మనందరం సిద్ధంగా ఉన్నామా! లేకపోయినప్పటికీ సిద్ధంగా ఉండవలసిన అవసరం ఉంది.

**ప్రశ్న: సూపర్ కాన్షస్ మరియు డివైన్ కాన్షస్ అంటే ఏమిటి?**

**జవాబు:** ఎవరైనా నన్ను ప్రశ్నించినపుడు, నేను ఆలోచన చేయకుండా సమాధానం వస్తుంది. అనగా అది దివ్యతలం నుండి వస్తుంది. అది సూపర్ కాన్షస్ (అధిచేతనా మనస్సు) అనబడుతుంది. బాబూజీకి దగ్గరగా ఉండటాన్ని డివైన్ కాన్షస్ అంటారు.

**ప్రశ్న: వైడ్ గ్లింప్స్ అంటే ఏమిటి?**

**జవాబు:** మన ఎదుట – వెనుక, అన్ని వైపులా ఎటు చూసినా బాబూజీనే దర్శించటాన్ని వైడ్‌గ్లింప్స్ అంటారు.

ఒక అభ్యాసీ బాబూజీతో తన కుటుంబ సభ్యులందరూ మన మిషన్‌లో చేరాలనే కోరిక ఉన్నట్లుగా చెప్పాడు. దానికి జవాబుగా బాబూజీ, ముందుగా ఆ అభ్యాసీ గురించే ఆలోచించుకొనమని, సాక్షాత్కారం కొరకు అతడు ఈ మిషన్‌లో చేరాడన్న విషయాన్ని గుర్తుంచుకోమని చెప్పారు. సాధన ద్వారా అభ్యాసీ బాబూజీలోనే నివసించే విధంగా గాఢంగా ప్రయత్నిస్తే అపుడు అతడు శ్రీ రామచంద్ర మిషన్ అభ్యాసీగా గుర్తింపబడతాడు.

నేను బాబూజీ పుస్తకాలు చదవలేదు. బాబూజీ నాతో ఏదైనా వ్రాయించాలని సంకల్పించినప్పుడు, ఆ విషయాన్ని నా కళ్ళ ముందు ప్రత్యక్షపరుస్తూ ఉంటే, నేను దానిని వ్రాయటం జరిగింది. అంతేకాని నాకు నేను వ్రాసింది ఏమీ లేదు. అభ్యాసీకి తను ఏ స్థాయిలో ఉన్నదీ తెలుసుకోవాలనిపిస్తుంది. నాకు బాబూజీయే ఆ స్థితిని గురించి, స్థాయిని గురించి చెప్పితే తెలిసేది. అందుచేత బాబూజీ తీసుకొస్తున్నట్లు అభ్యాసీలు ముందుకు సాగిపోవాలేగాని తాను ఎక్కడ ఉన్నాను అనే ఆలోచన అనవసరం. అభ్యాసీ బాబూజీతో బంధం ఏర్పరుచుకుని వారితో లయావస్థలో పూర్తిగా మునిగిపోతే దక్కవలసినదంతా దక్కుతుంది. కనుక పరిమితమైన దానినే కోరుకుంటే అపరిమితమైన దానిని అందుకోలేము. అభ్యాసీ బాబూజీలోనే నివసించటం ముఖ్యం కాని, ఏమి పొందుతున్నదీ తెలుసుకోవటం ముఖ్యం కాదు. కష్టేఫలే అన్నట్లు సాధనకొద్దీ సాఫల్యం ఉంటుంది.

విముక్త ఆత్మలు (Liberated souls) అవసరం కలిగినపుడు దివి నుంచి దిగి వచ్చి బాబూజీకి తమ సేవలు సమకూర్చుతారు. మోక్షం (Salvation) అనేది తాత్కాలికం. ముక్తి కోసం మళ్ళీ జన్మ తీసుకోవాలి. బ్రహ్మలోకం అనేది దేవుడు ఉన్నాడని గ్రహింపు కలిగించేది. అది ఆధ్యాత్మిక జీవనానికి ఆరంభం కూడా కాదు.

ఒక అభ్యాసీ, ధ్యానంలో ఉన్నప్పుడు తన శరీరం కాంతివంతంగా కనిపించిందని చెప్పాడు. అది అతనికి సంక్రమించిన దివ్యకాంతి, కాని దానిని గురించి ఆలోచించకూడదు.

'You' అనగా 'నీవు' నుంచి 'I' అనగా 'నేను' వేరుపడిన కారణంగా మళ్ళీ 'నీవు' (You')లో కలిసిపోవటానికి చేసే కృషియే సాధన అనబడుతుంది.

బాబూజీ మనల్ని ఎప్పుడూ వెన్నంటే ఉంటారు. అందుకు మన శరణాగతి ముఖ్యం. ఒకసారి నేను హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం వెళ్ళనని చెప్పినప్పుడు, బాబూజీ నాకు తోడుగా ఉంటానని అభయమిచ్చారు.

హాస్పిటల్‌లో నేను బెడ్ విడిచి బాత్‌రూమ్‌కు వెళ్ళినప్పుడు, ఆ సమయంలో డాక్టర్ వచ్చి చూస్తే నా మంచం కాంతివంతంగా కనిపించింది. తాకితే షాక్ కొట్టినట్లయ్యింది. అంతలో నేను తిరిగి వచ్చి బెడ్ మీద ఉన్నాను. అపుడు డాక్టర్ వచ్చి వారికి కలిగిన అనుభవాన్ని చెప్పారు. అనగా బాబూజీ మనల్ని వెన్నంటి ఉంటారని అనటానికి నిదర్శనం.

**ప్రశ్న: 1955వ సంవత్సరంలో బాబూజీ మీకు వ్రాసిన ఉత్తరంలో "ఒకే సమయంలో ఇద్దరు విశిష్టమూర్తులు (Special Personlaties) (దివ్య పురుషులు) మెలగటం సంభవం కాదు, ఒకరు నిష్క్రమించిన తరువాతనే మరొకరు ప్రవేశించటం జరుగుతుంది" అని వ్రాశారు. అలాగే 1956వ సంవత్సరంలో బాబూజీకి మీరు వ్రాసిన లేఖలో మీలో కొంచెం చీకటి ఇంకా మిగిలి ఉందని తెలియజేసినప్పుడు బాబూజీ మీకు ఇచ్చిన సమాధానంలో –ఆ కాస్త అంధకారం కూడా తొలగిపోయినట్లయితే నీవు మహా పార్షద్‌లో ప్రవేశించటం జరుగుతుంది. (ఒకే సమయంలో మహాపార్షద్ స్థితిలో ఇద్దరు ఉండటం అసంభవం కదా) కనుక స్వామి వివేకానంద నీలో ఆ కాస్త అంధకారాన్ని నిలిపి ఉంచారు – అని చెప్పారు. అయితే ఇపుడు బాబూజీ భౌతికంగా లేరు కనుక మిమ్మల్నే ఆ దివ్యమూర్తిగా భావించవచ్చునా?**

**జవాబు:** ఆ విధంగా మహాపార్షద్ చేరుకోగలవారుగా తయారు చేయగలవారు ఒక్కరే ఉంటారు. ఆ ఒక్కరే బాబూజీ. ఆ శక్తి వారికి మాత్రమే ఉంది. అలా చేయబడిన వారిలో నేను ఒకరిని. అటువంటి శక్తి లాలాజీగారికి ఉంది. వారు తయారు చేయగలరు. నేను చేయగలను అని మీరు అనుకున్నా అలా చేసేది బాబూజీగారే.

తల్లిదండ్రులు తమ బిడ్డల్ని వెన్నుతట్టి, అండగా నిలిచి ఉన్నత విద్యావంతులుగా చేసి కలక్టర్ వంటి ఉన్నత పదవులు పొందేటట్లు చేయవచ్చు. అంతమాత్రంచేత వారు తల్లిదండ్రుల్ని అధిగమించినవారు కాలేరు. వారి తల్లిదండ్రుల స్థానాన్ని విలువైనదిగానే గ్రహించాలి. మనకు బాబూజీ ఒకే ఒక్కరు. 'వారు' ఎంత మందినైనా అలాంటి వారిని తయారు చేయగలరు. 'వారు' తయారు చేసిన అనేక మందిలో కస్తూరీ కూడా ఒకరిగా తయారు చేయబడింది. కళాకారుడు ఎన్ని విగ్రహాలనైనా తయారు చేయగలడు. అలాగే చిత్రకారుడు ఎన్ని చిత్రాలనైనా చిత్రించగలడు. అయితే ఆధ్యాత్మిక రంగంలో ఎంతమంది ఎంతగా ఎదిగినా బాబూజీ వారికి సమతూగలేము. 'అసలు', 'సిసలు' ఎప్పటికీ వారే! డాక్టర్ వరదాచారిగారు ఒకసారి "నీకు ఇవ్వవలసింది అంతా ఇచ్చేసాను. ఇంక నీకు నా అవసరం లేదు" అని బాబూజీ చెప్పినట్లుగా వెల్లడించారు. వారికి బాబూజీ తమ శక్తితో ఆ స్థాయిని కల్పించారు. వరదాచారిగారు తన స్వశక్తితో ఆ స్థాయికి ఎదగలేదు. ఆ శక్తికి బాబూజీయే సర్వాధికారి.

బాబూజీ నాకు ఇచ్చిన స్థితులతో నేను పూర్తిగా సంతృప్తి చెందాను. 'వారు' తయారు చేయదలచిన విధంగా నన్ను తయారు చేశారు. కనుక తయారు చేయగలవారు నాతోనే ఉండగా నాకు ఆ అవసరం లేదు.

అభ్యాసులందరూ బాబూజీ మహరాజ్ యొక్క శక్తితోనే ఉన్నత స్థితికి వెళ్ళగలరు. 'తమ' శక్తితోనే మనల్ని పరిపూర్ణ మానవులుగా తయారుచేస్తారు. 'వారి' సంకల్పమూ, శక్తి లేకుండా మనం పైకి వెళ్ళటం కాని, దిగి రావటం కాని జరగదు. మనం ఒక దివ్య స్థితిని పొందినపుడు ఆ దివ్య వాతావరణం కూడా మనకు అనుకూలించగా దాని యొక్క అనుభూతిని పొందుతాము. అదే పరిపూర్ణ స్థితి.

బాబూజీ తనకు దైవంతో నేరుగా సంబంధం కల్పించి నట్లుగాను, ఇంక 'వారి' అవసరం లేదని వ్రాసినట్లుగా వరదాచారి గారు నాతో ప్రస్తావించినపుడు, నేను ఆయనతో –మీ స్థితి బాబూజీకి తెలుసు గనుక 'వారు' అలా వ్రాశారు. కాని మనకు 'వారి' అవసరం ఎప్పుడూ ఉంటుంది –అన్నాను. బాబూజీ అభ్యాసీల గురించి గొప్పగా చెబుతారుగాని తాము గొప్పవారమని ఎప్పుడూ చెప్పరు. అందుచేత 'వారి' ప్రశంసలకు పొంగిపోయి మనం గొప్పవారమనే భావన రానీయకూడదు. బాబూజీ ప్రేమతో వరదాచారిగారికి ఆ ఉన్నత స్థితుల అనుభవం కల్పించారు. మనం భక్తి ప్రేమలతో అటువంటి స్థితిని పొందగలిగితే అది ఘనతగా ఉంటుంది. బాబూజీ అందరినీ అంతిమం చేర్చటానికే అవతరించారు.

**ప్రశ్న: ప్రిసెప్టర్ అభ్యాసీకి సిట్టింగ్ ఇస్తున్నప్పుడు అభ్యాసీ యొక్క స్థితి ప్రిసెప్టర్‌పైన ప్రభావం చూపుతుందా?**

**జవాబు:** ప్రిసెప్టర్ దైవ సాన్నిధ్యంలో బాగా (గాఢంగా) మునిగి ఉండి సిట్టింగ్ ఇస్తే ఆ స్థితి అభ్యాసీని ప్రభావితంచేసి, మంచి అనుభవం కలిగిస్తుంది కాని, అభ్యాసీలో ఏమైనా ఆలోచనలు వంటివి ఉన్నా ప్రిసెప్టర్ మీద వాటి ప్రభావం ఉండదు. సూర్యుని తేజస్సు భూమి మీద ప్రజ్వరిల్లుతుంది కాని భూమి ప్రభావం సూర్యుని మీద ఉండదు.

సాధనలో మనం దైవంతో అనగా బాబూజీతో యోగం చెందుతాము. మన సాధన సఫలం కావాలంటే వారితో మన కనెక్షన్ (సంబంధం) సామీప్యత చెందాలి. ఎంతగా సామీప్యత చెందితే అంతటి శక్తి మనకు చేకూరుతూ ఉంటుంది. ప్రిసెప్టర్ ద్వారా మనకు వారిని చేరే దారి ఏర్పాటయ్యింది. కనుక ప్రిసెప్టర్, అభ్యాసీ కూడా బాబూజీలోనే లయలీనమై ఉంటే 'వారి' సామీప్యతానుభవంతోపాటు వారిచ్చిన స్థితుల అనుభవం కూడా కలుగుతుంది. సిట్టింగ్‌లో కలిగిన అనుభూతిని ఆ తర్వాత కూడా స్మరించుకుంటూ ఉండాలి. బాబూజీతో మన అనుబంధాన్ని ఒకవేళ ఏదైనా పని మూలంగా ఆదమరిచినప్పటికీ, అలా భావించకుండా వారినే స్మరించుకుంటూ ఉన్నట్లుగా అనుభూతి చెందాలి.

ఆత్మ లేకుండా శరీరం ఉండదు కాని, శరీరం లేకుండా ఆత్మ ఉండగలదు అని బాబూజీ వ్రాశారు. ధ్యానంలో బాబూజీని ఎంత ప్రేమతో మనలో నిలుపుకొని, ఎంత సామీప్యతను పొందుతామో అంతగా మనలో ఆనందం కలుగుతుంది. ధ్యానం తర్వాత కూడా మన హృదయం ఆనందానుభూతిని నెమరు వేసుకుంటూ ఉంటుంది. అలా ఉన్నప్పుడు ధ్యానం బాగా జరిగినట్లుగా అనుభూతి చెందటం మనవంతవుతుంది. ఒకవేళ ధ్యానంలో ఆలోచనలు అవాంతరం కలిగించినట్లుగా అనుభవమైతే వాటిని గురించి పట్టించుకోకుండా బాబూజీ మహరాజ్ మనవారు, మన ఎదుటనే ఉన్నారు, 'వారు' లేకుండా మనం లేము –అని అనుకుంటే వాటి ప్రభావం మనపైన ఉండదు. బాబూజీయే మనకు రక్షణ కల్పిస్తారు.

**ప్రశ్న: శూన్యస్థితి నుండి మహాపార్షద్ (తురీయాతీత) స్థితికి చేరటం ఎలా సాధ్యం?**

**జవాబు:** అది ఊహామాత్రంగా సాధ్యపడదు. ప్రేమ, భక్తితో 'వారి' సాన్నిధ్యం కల్పించుకొని అత్యంత సామీప్యత చెందటం ద్వారానే అది సాధ్యపడుతుంది. బాబూజీ అపుడు మనల్ని కూడా ప్రేమించి, తమ సంకల్పశక్తితో మనల్ని తీసుకు వెళ్తారు. ఆ విధంగా అది సంభవమే, సందేహం లేదు.

బాబూజీ ఏమి చెప్పేవారంటే, స్థితుల గురించి తలంపు కాకుండా అనుభూతి కలగాలి అని చెప్పేవారు. వారంతట వారుగా అభ్యాసీ యొక్క స్థితిని గురించి చెప్పేవారు కాదు. నా అనంత యాత్రలో నాకు కలిగిన

అనుభూతిని వారికి లేఖల ద్వారా తెలియజేసినపుడు మాత్రమే నేను అనుభూతి చెందినది ఏమిటో చెప్పేవారు. అనుభూతి అనేది మానసికంగా కాకుండా హృదయపరమైనదిగా ఉండాలి. బాబూజీని ఆలోచన ద్వారా కాకుండా హృదయంలో 'వారు' ఉన్న అనుభూతిని చెందుతూ ఉండాలి. హృదయంలో 'వారి'కి చేరువ కావటానికి తపన ఉండాలి. లాలాజీ మహరాజ్ తన కఠోర సాధన ద్వారానే బాబూజీ మహరాజ్‌ను భూమా నుండి అవతరించేటట్లు చేశారు. నిరంతర స్మరణ, సామీప్యత ద్వారానే మనకు ఆ స్థితిని పొందే అవకాశం కలుగుతుంది. మొదట బాబూజీ మనలోనే ఉన్నారన్న తలంపు ద్వారా సామీప్యతానుభవం కలుగుతుంది. ఆ తర్వాత 'వారి' స్మరణ కలిగినంతనే మన హృదయంలో 'వారి' ఉనికిని అనుభూతి చెందుతాము. ఇది అభ్యాసం ద్వారా సాధ్యమవుతుంది.

ఒకసారి ఒక అభ్యాసీ తాను ఏ రీజియన్‌లో ఉన్నాడో, ఏ స్థితిలో ఉన్నాడో తెలియజేయమని బాబూజీని మరీ మరీ కోరాడు. అపుడు బాబూజీ అతనితో నీకు కలిగిన అనుభూతి, సామీప్యత ఎటువంటిదో చెప్పమన్నారు. అనగా బాబూజీ యొక్క సామీప్యత అనుభూతి ద్వారానే అభ్యాసీ యొక్క పురోగమనం తెలుస్తుంది. **బాబూజీ నీలోనే, నీతోనే, నీ ఎదుటనే ఉన్నారన్న అనుభూతి ద్వారా నీ ప్రగతిని సాధించవచ్చు.** దాని కొరకు అభ్యాసం చేయాలి.

**ప్రశ్న: భౌతికంగా బాబూజీ ఉన్నప్పుడు మీ ప్రోగ్రెస్ గురించి చెప్పేవారు. కాని 'వారి' తర్వాత మన ప్రోగ్రెస్ గురించి ఎవరు తెలియజేస్తారు?**

**జవాబు:** నీ హృదయమే (అందులోని బాబూజీయే) చెప్తుతుంది. నేను, నా యొక్క స్థితులను గురించి బాబూజీకి వ్రాసినపుడు, 'వారు' నా మీద పరిశోధన చేశారు కనుక ఆ స్థితులు ఏమిటో తెలియ జేసేవారు. 'వారి' పరిశోధన నిమిత్తం ఆ సత్యత్వాన్ని (రియాలిటీని) త్వరగా సాధింపజేయాలి కనుక, నా స్థితులను వేగవంతం చేశారు. ఆ స్థితి ఏమిటో చెప్పేవారు. ఇపుడు మీరు కూడా నన్ను అడిగి తెలుసుకోవచ్చు. నేను అభ్యాసం చేస్తున్నానని అనుకోవటం లేదు. నాలో బాబూజీని వెదుకుతున్నాను. 'వారి' దివ్యత్వాన్ని చూడ గోరుతున్నాను. నాకు ఎప్పుడు, ఏ స్థితి కలిగినా, అది బాబూజీ ఇచ్చిన దివ్య ప్రసాదమనే అనుకుంటున్నాను. మనలో బాబూజీ ఉన్న అనుభూతి చెందినట్లయితే 'వారే' మనకు ఆ స్థితులను ప్రసాదిస్తారు.

నేను బాబూజీకి నా స్థితులను గురించి వ్రాసేటప్పుడు, ఆ స్థితి కలిగే సమయంలో అక్కడ ఉన్న పరిసరాలను, వాతావరణాన్ని, దివ్యశక్తి ప్రభావాన్ని గురించి కూడా వ్రాశాను. మనం చాలా సావధానంగా, అప్రమత్తంగా ఉంటేనేకాని 'వారు' ఇచ్చే స్థితులను తెలుసుకోలేము. "నేను చూస్తున్నాను, చాలాసార్లు అన్వేషిస్తున్నాను. బాబూజీ మహరాజ్ ఉన్నారని, 'వారు' దివ్యపురుషులనీ తెలుసు. మీ కళ్ళలోకి చూస్తున్నాను. అసలు మీరు ఏమిటి అని చూస్తున్నాను. మీ శరీరం మాత్రం ఇక్కడ ఉంది. కాని మీ రియాలిటీ (సత్య స్వరూపం) ఎక్కడ ఉందా అని అన్వేషిస్తున్నాను. నేను అక్కడ ఆవరణ మరియు ఆ స్థితి యొక్క స్థితిని కూడా చూస్తూ వాటిని ఎలా ప్రసాదిస్తున్నారా అని తరచి చూస్తున్నాను" అని వ్రాశాను.

నేను మొదటిసారి షాజహాన్‌పూర్ వెళ్ళినప్పుడు కుర్చీలో కూర్చుని ఉన్న బాబూజీ స్వరూపం నా కళ్ళలో నిలిచిపోయింది. ఇంటికి తిరిగి వెళ్ళేప్పుడు 'వారు' లేకుండా జీవించలేననిపించింది. ఇంకా రెండు, మూడు రోజులు ఉండాలనిపించింది. కాని బాబూజీ మాత్రం నా ప్రయాణానికి సిద్ధంగా ఉండమని చెప్పారు. నాకు చాలా బాధ కలిగింది. అంటే అప్పటికి 'వారి' కుర్చీలో ఉన్న స్వరూపాన్ని మాత్రమే అనగా

బాహ్యరూపం మాత్రమే నిలుపుకున్నాను. నేను మరోసారి షాజహాన్‌పూర్ వెళ్ళి 'వారి'ని దర్శించినప్పుడు 'వారు' కుర్చీలో ఆసీనులై ఉన్న దృశ్యమే మనస్సులో ఉంది. కాని ఇంటికి తిరుగు ప్రయాణమైనపుడు 'వారు' నాతోనే వస్తున్నట్లు, నా ఎదుటనే నిలిచి ఉన్నట్లు అనుభూతి కలిగింది. నాలో ఉన్న తపన 'వారి' ప్రజెన్స్ (ప్రత్యక్షత) అనగా 'వారు' నా హృదయంలో నిలిచి నా ఎదుట, నా వెంట ఉన్నట్లుగా చేసింది. భౌతికంగా బాబూజీ కుర్చీలోనే ఉన్నారు. "ఈసారి నన్ను మరో రెండు రోజులు ఉండమని చెప్పినా నేను ఉండటం లేదు" అని 'వారి'కి చెప్పి తిరిగి వచ్చాను. అంటే ఇప్పుడు 'వారు' నా హృదయంలోనే నిలిచిపోయారు. నేను 'వారి'కి దూరంగా లేను, అనే అనుభూతి నాకు సంతృప్తి నిచ్చింది. అనగా 'వారు' మనలోనే, అంతర్యామిగా నిలిచి ఉన్నట్లుగా అనుభూతిని కలిగిస్తారు. ఎవరైనా బాబూజీ మహరాజ్‌ను ఎవరనిగాని, ఎలా ఉండేవారు అనిగాని సంభాషిస్తే నా మనస్సు అందుకు అంగీకరించేది కాదు. ఎందుకంటే, 'వారు' ఎల్లప్పుడూ ఉన్నారు, అంతటా ఉన్నారు, అందరిలోనూ ఉన్నారు. కనుక ఒకప్పుడు అనే ప్రశ్నకు తావుండ కూడదు. మీరు "బాబూజీ మహరాజ్ నా వారు" అని అనుకోగానే 'వారు' మీ హృదయంలో దర్శనమిస్తారు. ముఖతః (నోటితో) "బాబూజీ నా వారు" అని అనుకున్నా, అనుభూతి మాత్రం హృదయంలో కలుగుతుంది. అనుబంధం యొక్క స్థితి అలా ఉంటుంది. ఆ విధంగా బాబూజీకి మనల్ని సమర్పించుకున్నప్పుడు లోపల ఉన్న 'మన' (నేను) తొలగిపోయి 'వారి'కి స్థానం ఇచ్చినట్లవుతుంది. ఆ శరణాగతి మూలంగా అహం కరిగి దివత్వమే చోటుచేసుకుంటుంది.

**ప్రశ్న: స్పందన అంటే ఏమిటి? దాని ద్వారా సృష్టి ఎలా ఏర్పడింది?**

**జవాబు:** స్పందన అనేది సృష్టికి కారణమయింది. ఆదిశక్తిలో క్షోభ కలిగిన కారణంగా ఆ శక్తి వచ్చి సృష్టి నిర్మాణం చేసింది. లాలాజీ సాహెబ్ తన కఠోర తపస్సు, దీక్ష ద్వారా ఆ ఆదిశక్తిలో స్పందన కలిగించి సమస్త మానవాళిని ఉద్ధరించటం కోసం బాబూజీని అవతరింపజేశారు. ఆదిశక్తి సమన్వితుడైన బాబూజీతో మనం సంబంధం ఏర్పరుచుకుంటే, దివ్యశక్తి 'వారి' నుంచి మనకు వస్తుంది. హృదయంలోకి 'వారి'ని ఆహ్వానించాలి. అపుడు ఎల్లప్పుడూ 'వారు' మనలోనే, మన ఎదుటనే ఉన్నట్లుగా అనుభూతి కలుగుతుంది.

నేను 'వారి' దివ్య సంకల్పం ద్వారా ఆ శక్తిని పొందు తున్నాను. 'వారు' సమస్త మానవాళిని ఉద్ధరించటం కోసం వచ్చారు కనుక, నేను మాత్రమే కాదు, వారితో అనుబంధం పెంచుకున్న అభ్యాసీ లందరూ కూడా ఆ దివ్యశక్తిని పొందగలుగుతారు. ఆ శక్తి ఎటువంటిదంటే, మీకు మీరుగా ఏమీ తెలియదని అనుకున్నప్పటికి, ఎవ్వరైనా మిషన్ గురించి చర్చించితే అప్రయత్నంగానే మీరు సమాధానం చెప్పగలుగుతారు. ఆ వాస్తవాన్ని మీరు పరీక్షించుకొని నిర్ధారించుకోవచ్చు.

**ప్రశ్న: ఐడెంటిటీ అంటే ఏమిటి?**

**జవాబు:** బాబూజీ ఎప్పుడూ నెగేషన్ స్థితిలో ఉంటారు. మానవుడు కూడా సృష్టించబడిన తొలిదశలో ఇదే స్థితిలో ఉండేవాడు, అనగా ఫర్‌గెట్‌ఫుల్ స్టేట్ (మరుపు స్థితి లేదా విస్మృతావస్థ)లో. వ్యక్తి తాను జీవించి ఉండి కూడా తన యొక్క స్పృహ లేనివాడై ఉంటాడు. తన శరీరం, ఉనికి యొక్క జ్ఞానం కోల్పోయినవాడుగా ఉంటాడు. బాబూజీ అతనికి వానియొక్క ఉనికిని లేదా జీవించి ఉన్న జ్ఞానాన్ని కలిగించదలచినప్పుడు, వెంటనే అతనిలో ఆ స్పృహ కలుగుతుంది. అనగా దైవంలోనే లీనమైపోయి తాదాత్మ్యం చెందిన స్థితిలో, తాను లేకపోయిన స్థితి నుంచి ఉన్నట్లు స్ఫురింపజేయటమే ఐడెంటిటీ.

నేను అందరినీ ప్రేమిస్తున్నాను. ఎవ్వరినీ ద్వేషించటం లేదు అని అనుకోవటంలో 'నేను' అనేది ఉంది కనుక, అది మీ వ్యక్తిగతం అవుతుంది. బాబూజీ ప్రమేయం ఉండదు. అందులో సమర్పణ భావం లేదు కనుక, అది సరైనది కాదు. అలా కాకుండా లయావస్థలో ఉన్నప్పుడు మాత్రమే బాబూజీ బాధ్యత వహిస్తారు. నీకు బాధ్యత లేనట్లుగా అనుభూతి చెందుతావు. అటువంటి స్థితిలో నీ శరీరానికి ఏదైనా బాధ కలిగినప్పటికీ అది ఎక్కడో ఉందని అనుభూతి కలుగుతుందే కాని నీకు చెందినదిగా అనిపించదు. అలా కాకుండా దుర్భరమైన బాధ కలిగినప్పుడు నీవు చేసే ఆక్రందన బాబూజీకి చేరుతుంది. దానికి నివారణ 'వారు' చేస్తారు. బాబూజీ మహరాజ్ ఈ విధంగా అభ్యాసులను ఉన్నత స్థితికి చేర్చుతారు. ఈ కృషిలో వారి పాత్రయే ఎక్కువగా ఉంటుంది. మనమల్లా ప్రేమ, భక్తితో వారితో అనుబంధం పెంచుకొని వారికి సహకరించటమే. మనకు బాబూజీ నా వారే అన్న తలంపు హృదయపూర్వకంగా ఎల్లప్పుడూ ఉండాలి. నిరంతర స్మరణ, వారితో అనుబంధం వలన మనకు అన్నీ సిద్ధిస్తాయి. బాబూజీ నావారే అని అనుకోవటం ఒక దారం లేదా సూత్రం వంటిది. దానిని అంటిపెట్టుకుని సాగిపోతే మనకు దక్కవలసింది దక్కుతుంది. ఇది వూరికే అనుకోవటం కాదు. అలా అనుకోవటం లేదా తలంపు ద్వారా హృదయంలో ఆత్మీయత, అనుబంధం, అనుభూతికి రావాలి. ఆ అనుభూతి మన ఆలోచనకు (థాట్) వాస్తవ రూపమన్నమాట.

చాలా సంవత్సరాల తర్వాత నేను వ్రాసినదానికి అర్థం గ్రహించగలిగాను. నేను బాబూజీకి వ్రాసే ఉత్తరాలలో అనంతయాత్రలోని నాకు కలిగిన స్థితులు, అనుభవాలను వివరించే దానిని. అది నాకు కలిగిన స్థితియో లేదా నేను చేరిన ఆ ప్రాంతపు స్థితియో (Condition or Condition of that condition) నాకు తెలియదు. బాబూజీ నుంచి సమాధానం వచ్చిన తర్వాతనే దాని వివరం తెలిసేది. అది నా స్థితి కాదు, అది స్థితి యొక్క స్థితి అనగా అక్కడ ఉన్న దివ్యస్థితి అనీ; దానిని 'వారి' కృప వల్లనే స్థితి యొక్క అనుభూతి చెందగలమని గ్రహించాను. ఈ సూక్ష్మం తెలుసు కోవటానికి నాకు చాలా సంవత్సరాలు పట్టింది.

**ప్రశ్న: మన జీవితకాలంలో బాబూజీతో అనుబంధం కలిగి ఉంటాము. మరణించిన తర్వాత కూడా ఆ బంధం కొనసాగుతుందా?**

**జవాబు:** మన నిరంతర స్మరణ ద్వారా వారితో విడదీయరాని సంబంధం మన జీవితకాలంలో నెలకొల్పుకుంటే మన మరణం తర్వాత కూడా అదే కొనసాగుతుంది. మన ప్రేమ, భక్తి ఫలితంగా బాబూజీ యొక్క ఆకర్షణ మన చేయిపట్టుకుని ముందుకు నడిపిస్తుంది. మనం వారికి అర్పితమయ్యాము కనుక మనల్ని వదలిపెట్టరు. మరణం శారీరకమైనది కాని ఆత్మకు నశింపులేదు.

**ప్రశ్న: మరణ సమయంలో తలచుకొనకపోతే ఏమవుతుంది?**

**జవాబు:** జీవించి ఉన్న కాలంలో కొనసాగిన అనుబంధం మరణించిన తర్వాత కూడా అది ఆత్మతో కొనసాగుతుంది. ఒక అభ్యాసీ జీవన్మరణాలతో పోరాడుతూ అపస్మారక స్థితిలోకి జారుకుంటూ, మళ్ళీ స్పృహలోకి వస్తూ ఉన్నాడు. వైద్యులు అతడు బ్రతకటం కష్టమని నిర్ణయించారు. ఆ అభ్యాసీ తన ఆరోగ్యం కుదుటపడిన తర్వాత బాబూజీకి ఇలా వ్రాశాడు: "నాకు జబ్బులో అపరిమితమైన బాధ కలిగింది. నా ఆత్మ శరీరం వదలి పైకి పోతున్నట్లుగా అనిపించింది. అపుడు ఆ ప్రాంతమంతా మీరు వ్యాపించి ఉన్నట్లు, మీ చల్లని స్పర్శతో ఆత్మ క్రిందకు దిగి శరీరం వదలకుండా ఉండునట్లు అనిపించింది." కనుక బాబూజీ మనల్ని జీవించి ఉన్నప్పుడు, అలాగే జీవితం చాలించిన తర్వాత కూడా తమ కనుసన్నలలో నిలిపి

ఉంచుతారు. మనం మనకు కలిగిన స్థితులను నిలుపుకుంటూ, నిరంతర స్మరణ, తపన కలిగి ఉంటే, 'వారు' ఉన్నత స్థితులను, ఉత్తమగతిని అనుగ్రహిస్తారు. ఆ విధంగా అభ్యాసీకి ఎప్పుడూ విజయమే కలుగుతుంది.

బాబూజీ మనకు ఇచ్చిన వరదానం ద్వారా ఉన్నత స్థితులు అనుగ్రహిస్తున్నారు. వాటిని నిలుపుకోగల అర్హత పొందాలంటే మనం అందుకు తగినట్లుగా సాధన ద్వారా తయారుకావాలి. అప్పుడే మనకు వారిచ్చిన వరప్రసాదం దక్కుతుంది.

ఒక అభ్యాసీ బాబూజీని– మీరు ఇచ్చిన వరదానం ఫలం మాకు దక్కుతుందా – అని అడిగాడు. దానికి సమాధానంగా బాబూజీ– "నేను అంతిమం నుండి ఆ ఉన్నత స్థితులను మీ కొరకు తరలించుకు వచ్చాను. మీరు శ్వాస ద్వారాగాని, స్పర్శ ద్వారాగాని ఆ దివ్యత్వంతో సంబంధం కలిగి ఉంటే మీకు అవి సమకూరుతాయి. అందుకు తగిన యోగ్యులుగా మీరు తయారుకావాలి" అని చెప్పారు. పరిపూర్ణత్వం నుంచి ఏది వచ్చినా అది పరిపూర్ణంగానే ఉంటుంది. మనలో నిరంతరం స్మరణ, సాధన ద్వారా దానిని జీర్ణించుకోవాలి.

**ప్రశ్న: మనం బాబూజీతో పూర్తిగా సంబంధం కలిగి ఉన్నట్లు ఎలా తెలుస్తుంది?**

**జవాబు:** అది ఐడెంటిటీ; దాని గురించి నేను పుస్తకాలలోవ్రాశాను. మన హృదయంలోపల ఉన్న బాబూజీలో మనం లీనమై ఉన్నప్పుడు, ఎవరైనా దేనినైనా అడిగితే చేతితో ఇస్తాము, ఏమైనా చెప్పవలసి వస్తే నోటితో చెప్తాము. అలా భౌతికంగా మనం చేసే పనులు మనస్సుకు తెలియవు. వాటంతట అవే జరిగిపోతాయి. ఇటువంటి స్థితి కలిగినప్పుడు బాబూజీతో మన సంబంధం దృఢంగా ఉన్నట్లు గ్రహించవచ్చు. 'బాబూజీ' అని వినగానే మన హృదయంలో ప్రేమానుభూతి కలగాలి.

**ప్రశ్న: మనం బాబూజీలో లయమైనట్లు ఎలా తెలుస్తుంది?**

**జవాబు:** ఒక వ్యక్తి నీటిలో మునిగి, తిరిగి బయటకు రానంతగా మునిగిపోయే వరకు కొన్ని స్థితులు ఉంటాయి. చనిపోయే వరకు మునగటం, తేలటం, బుడగలు వేయటం లాంటి స్థితులు ఉంటాయి. అలాగే సంపూర్ణ లయావస్థ పొందటానికి ముందు కొన్ని స్థితులు ఉంటాయి. వాటిలో తనను తాను స్పృహ కోల్పోవటం (మరపుస్థితి), తిరిగి తన ఉనికిని తెలుసుకోవటం జరుగుతూ ఉంటాయి. మన పరిపూర్ణ లయావస్థ అనేది పూర్తిగా మనల్ని మనం మరచిపోయినప్పుడే లేదా కోల్పోయినప్పుడే జరుగుతుంది. అనగా ఇది శరీరాన్ని విడిచి వెళ్ళిన తర్వాతనే కలుగుతుంది.

**ప్రశ్న: ఆత్మ సమర్పణ అంటే ఏమిటి?**

**జవాబు:** మనం ఏ పని చేస్తున్నప్పటికీ దానిని నేను చేస్తున్నాను, నా వలన ఫలానా మంచి ఫలితం కలిగిందని భావించకుండా, ధ్యాసను హృదయంలో బాబూజీ మీదనే నిలిపి చేస్తున్నట్లయితే, అందులో 'తన' ప్రమేయం లేకుండా ఉంటుంది. అనగా ప్రతిదీ భగవదార్పితంగానే ఉంటుంది. దీనిలో అహం ఉండదు కనుక ఆత్మ సమర్పణమవుతుంది.

**ప్రశ్న: (Self Realisation) ఆత్మ సాక్షాత్కారం, (God Realisation) భగవత్ సాక్షాత్కారం రెండూ ఒక్కటేనా?**

**జవాబు:** (Self Realisation) ఆత్మ సాక్షాత్కారం అనగా నిన్ను నీవు తెలియపర్చుకోవటం (తెలుసుకోవటం), నీలో దైవం ఉన్నాడని తెలుసుకోవటం (ఆత్మ పరమాత్మ విచారణ) ఇది ఆత్మ సాక్షాత్కార మవుతుంది.

నీ గురించి నీవు చెబుతున్నప్పుడు ఆ దైవం గురించే చెబుతున్నట్లుగాను అంతా ఆ పరమాత్మమయమే అని అనభూతి చెందటమే (God Realisation) భగవత్ సాక్షాత్కారమవుతుంది. అంతా పరాధీనంగా అనగా దైవపరంగా తలపించబడుతుంది. ఎంత గొప్ప విషయమైనా సాధారణమైనదిగానే అనిపిస్తుంది.

ఒక దివ్య పురుషుడు (డివైన్ పర్సనాలిటీ) అవతరించినప్పుడు మనలో దైవాన్ని చేరాలనే తపన ఎంత తీవ్రంగా ఉంటే అంతగా మనం వారి ద్వారా బాగా ఆకర్షింపబడి అంత త్వరగా గమ్యాన్ని చేరతాము. అది ఎలా ఉండాలంటే, శలభం (కీటకం) అగ్నిచేత ఆకర్షింపబడి దానిలో దగ్ధమైపోవటానికి సిద్ధపడి పోయినట్లుగా ఉండాలి.

బాబూజీని అభ్యాసులు తమ స్థితి (కండీషన్)ని గురించి అడుగుతూ ఉండేవారు. ఒకసారి ఒక అభ్యాసీ తన స్థితిని గురించి అడిగినప్పుడు, "నీకు జ్వరం వస్తే ఎంత టెంపరేచర్ వచ్చిందో తెలుసుకుంటావు. తగ్గాక కూడా నీవు ఆ జ్వరంలో ఉన్న స్థితిని గురించి వివరిస్తావు. అలాగే నీ ఆధ్యాత్మిక స్థితిని గురించి ఎందుకు తెలుసుకోలేకపోతున్నావు. 'నీవు' అప్రమత్తంగా ఉంటే స్వయంగానే గ్రహించగలవు" అన్నారు బాబూజీ.

ప్రిసెప్టర్ మరియు అభ్యాసీ కూడా బాబూజీలో గాఢంగా నిమగ్నమైపోవటానికి అనగా ఎంత బాగా స్మరణ కలిగి ఉంటే అంత బాగా ఫలితాన్ని పొందగలుగుతారు. 'వారు' మనల్ని తమ ఒడిలోనికి చేర్చుకోవటానికి సిద్ధంగా ఉన్నారు. మనం హృదయంలో "మీరు నా వారు" అని ఎంత దగ్గరగా బాంధవ్యం పెంచుకుంటే అంతగా చేరువవుతాం. అభ్యాసులు ధ్యానంలో ఉండగా నాకు ఎప్పుడైనా అసౌకర్యంగా అనిపిస్తే, అపుడు బాబూజీని, "మీరు నాకు ఏదైతే ప్రసాదించారో దానిని అభ్యాసులకు కూడా ప్రసాదించండి" అని వేడుకొనే దానిని.

పుస్తకాలు చదువుతారు కాని ఎంతవరకు అర్థం చేసుకున్నాము అనేది ప్రశ్న. నాకు బాబూజీ వ్రాసిన ఉత్తరాలు చదువుతుంటే ఒక్కసారిగా అర్థమయ్యేవికావు. వాటిని మళ్ళీ మళ్ళీ చదివితే ఆంతర్యం తెలిసేది. తెలియనిదానిని తెలుసుకోవటం కోసం తపన ఉండాలి. బాబూజీ అనేవారు –హృదయంలో బాధ పెంచుకో– అని. మరైతే ఏదైనా దెబ్బ తగిలితేగాని బాధ ఉండదు. అపుడుగాని బాధ గురించి ఆలోచించము. అలాగే తపన పెంచుకొంటే దానిని తీర్చటానికి బాబూజీ కృప లభిస్తుంది. సంస్కారాలు మన బాధలకు కారణమవుతాయి. సంస్కారాలే లేకుంటే మనకు బాధలు ఉండవు.

బాబూజీ ఇలా చెప్పారు: ఈశ్వరుడు సర్వవ్యాపి అయినపుడు ఒకే మూర్తి (విగ్రహం)లో మాత్రమే ఉండడు గదా! అలా అన్ని మూర్తులలో వ్యాపించి ఉంటాడు. మూర్తి (రూపం) అనేది మన మనస్సుతో తయారుచేయబడుతోంది. వాస్తవానికి మన సహజమార్గంలో అందరికన్నా ఎక్కువగా మూర్తిపూజ చేస్తున్నాము. మనం సాధన ప్రారంభించినపుడు ఈశ్వరుడు మన హృదయంలోనే ఉన్నాడని భావించుకొని పూజ ప్రారంభిస్తాము. ఆ ఈశ్వరుడు మన ఒక్కరి హృదయంలోనే కాకుండా అందరి హృదయాల్లోను ఉన్నాడు. దైవం ఈ మానవాళిని సృష్టించి, అందరిలోనూ తన దివ్యత్వాన్ని నిలిపాడు. అనగా మానవమాత్రులందరూ ఆ దివ్యత్వం (రియాలిటీ)తో సమకూర్చబడిన మూర్తులే. చిత్రకారుడు లేదా శిల్పి తన భావనకొద్దీ ఎన్నో మూర్తులను తయారుచేస్తాడు. కాని వాటిలో దివ్యత్వాన్ని నింపలేడు. ఎందుకంటే అవి మానవ నిర్మితం. అందుచేత నీవూ ఒక మూర్తివే! నీలోనే ఉన్న దైవాన్ని వెదుకు. అలా అన్వేషించటంలో అహం అనగా

'ఐ'నెస్ కరిగిపోయి దివ్యత్వం (సత్యత్వం) వృద్ధి చెందుతూ ఉంటుంది. ఇది గ్రహించలేక ఇటీవల అనేకానేకంగా విగ్రహాలు సృష్టించబడు తున్నాయి, ఆరాధించబడుతున్నాయి. ఈశ్వరీయతను దూరంగా ఉంచి దానికోసం వెతుకుతున్నారు.

ఒకసారి బాబూజీతో కలిసి మధురై వెళ్ళాను. బాబూజీ అక్కడ ఒక ప్రజా సభలో పాల్గొని ఉపన్యసించారు. ఉపన్యాసం ముగిశాక ఇద్దరు పూజారి సోదరులు వచ్చి బాబూజీతో "మీరు చెప్పిన దానిని మేము పరీక్షించుకోవాలి" అంటూ అందులో ఒకరు "మా తమ్మునకు సిట్టింగ్ ఇవ్వండి" అని కోరాడు. వారి ఉద్దేశ్యంలో బాబూజీ సిద్ధాంతంలో మూర్తిపూజ చేయరు కనుక, దానిలో పసలేదని చులకన భావన ఉంది. మరుసటి రోజు ఉదయం బాబూజీ వద్దకు వెళ్ళగా నన్ను సిట్టింగ్ ఇవ్వమని చెప్పారు. అలాగే ఇచ్చాక ఎలా ఉందని అడిగితే ఏమి ఫీల్ కాలేదని చెప్పాడు. అలాగే రెండవసారి కూడా, ధ్యానం నిలవలేదు అని చెప్పాడు. మూడవసారి సిట్టింగ్ ఇచ్చాక నీకు ఏమి అనుభవం కలిగిందని అడగ్గానే తాను కళ్ళు తెరవలేనంత లోతుగా ధ్యానంలోకి వెళ్ళిపోయినట్లు, తన ఉనికి గురించి ఏమీ తెలియనంతగా అందులో మునిగిపోయినట్లుగా చెప్పాడు. అప్పుడు బాబూజీ వారితో "మీరు చిన్నప్పటి నుంచి విగ్రహారాధన చేస్తున్నారు. మీరు రోజంతా దైవంతోనే ఉంటారు. ప్రతిరోజు అర్చనలు, హారతులు ఇస్తూ ఉంటారు కదా, మరి దైవం మీద ధ్యానం ఎందుకు నిలపలేకపోతున్నారు" అని అడిగారు. బాహ్యమైన ఆచరణమీద కాకుండా ఆంతరికంగా ఉన్న దైవాన్ని ఆరాధించమన్నారు. వారు యాంత్రికంగా వృత్తిరీత్యా దేవాలయంలో విగ్రహారాధన చేస్తున్నారే కాని హృదయపూర్వకంగా దైవాన్ని కొలవటం లేదు. తమ ఆంతరికంలోని అంతర్యామి పైన శ్రద్ధ వహించలేకపోతున్నారు. దైవాన్ని చేరే మార్గం వారికే తెలియనపుడు ఇతరులను ఎలా దైవం దగ్గరకు చేర్చగలరు. దీని అర్థం ఏమిటంటే, నేను చేస్తున్నాను అనే దానిలో 'అహం' ఉంటుంది. అనగా అది ఒక క్రియగానే ఉంటుంది కాని, ఫీలింగ్ లేదా దివ్యానుభూతి ఉండదు. ధ్యానంలో అహం లేకుండా దివ్యానుభూతి కలుగుతుంది. అందుకనే బాబూజీ –ధ్యాన్ రఖో – అనగా మనలోనే ఉన్న దైవం మీద దృష్టి నిలుపు, అని చెప్పేవారు. ధ్యానం చేస్తున్నాను అని అనుకోకుండా, ధ్యానంలో ఉన్నానని లేదా ధ్యానం నిలుపుకుంటున్నానని అనుకోవాలి. ధ్యానం ద్వారా దైవంతో మనకు సంబంధం కలుగుతుంది. ప్రార్థన ద్వారా దైవంపట్ల భక్తి, ప్రేమ ప్రేరేపింపబడతాయి. క్లీనింగ్ (నిర్మలీకరణ) ద్వారా మనలోని మాలిన్యాలు కరిగిపోయి పవిత్రత ఏర్పడుతుంది. ధ్యానం అయిపోయింది అనుకోకుండా ధ్యానంలోనే నిరంతరం ఉన్న భావన కలిగి ఉండాలి. ధ్యానం, సాధన అనేవి దివ్యత్వాన్ని పొందటానికి, దైవ సాన్నిధ్యం పొందటానికి మాత్రమేకాని భౌతిక పరమైన లేదా ప్రాపంచిక పరమైన విషయాలలో లబ్ధి పొందటానికి కాదు.

ఒకసారి ఒక ప్రిసెప్టర్ బాబూజీతో –తన కుమారునికి రాత్రి విపరీతంగా జ్వరం వచ్చిందని, రాత్రి కావటంచేత వైద్యుని వద్దకు వెళ్ళివచ్చే అవకాశం లేనందున 'బాబూజీ' అని ఒక కాగితం మీద వ్రాసి దానిని ఒక గ్లాసు నీళ్ళలో కలిపి త్రాగించిన తర్వాత తెల్లవారేసరికి జ్వరం నిదానించిందని చెప్పాడు. అప్పుడు బాబూజీ అతనితో "ఒక్క పదిపైసల మాత్రతో తగ్గే జ్వరానికి నన్ను నివారణోపాయంగా ఉపయోగించావు. నేను మానవాళినంతటినీ ఉద్ధరించటానికి వచ్చాను కాని ఇటువంటి అల్ప ప్రయోజనం కోసం కాదు" అని హెచ్చరించారు. **కనుక మనం చేరవలసిన లక్ష్యం ఆత్మోన్నతికే కాని ఆర్థిక, ఆరోగ్య అవసరాల కోసం కాదు.**

**సమస్యలు ఉంటే దైవానికి నివేదించుకోవాలే కాని పరమార్థాన్ని వాటికి పణంగా పెట్టకూడదు. అందుచేత బాబూజీ అభ్యాసులతో చెప్పేవారు –మన సంస్థలో చేరదలచుకున్నవారు ఆధ్యాత్మిక ప్రయోజనం కోసమేకాని ప్రాపంచిక కోర్కెలు నెరవేర్చుకోవటానికి కాదు –అని.** అందుచేత సహజమార్గంలోకి మనం ఎవ్వరినైనా ఆహ్వానించదలచుకున్నప్పుడు వారికి ఈ ప్రాథమిక అంశాన్ని వివరించటం అవసరం అని బాబూజీ చెప్పేవారు. మిషన్‌లో ఎంతమందైనా చేరవచ్చు. కాని ఎవరైతే ఆ రియాలిటీ (సత్యత్వం) కోసం కాంక్ష, విశ్వాసం కలిగి ఉంటారో వారే నిజమైన అభ్యాసీల జాబితాలో ఉంటారు.

**ప్రశ్న: బెహెన్‌జీ! ఒక అభ్యాసీకి ధ్యానంలో కూర్చున్నప్పుడు కన్నీరు పెల్లుబుకుతుంది, అవి దుఃఖంతో వచ్చేవి కాదు కదా!**

**జవాబు:** అవి వాటంతటఅవే వస్తున్నాయి. భక్తి, ప్రేమ మూలంగా కావచ్చు. బలవంతంగా రప్పించుకున్నవి కానప్పుడు అవి సరైనవేనని భావించాలి. ఆంతరికమైన క్లీనింగ్ వలన కూడా అలా కావచ్చు. ఏది ఏమైనా అసహజమైన జీవనం పాపం. నిరంతర స్మరణతో మెలగటం యోగ్యమైనది, దివ్యమైనది. బాధలు అనేవి ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమయంలో కలుగుతాయి. విజ్ఞత ఏమిటంటే, వాటిని మరచిపోవాలే కాని మననం చేసుకోకూడదు. అందుకు బదులుగా సంతోషంగా ఉండే అలవాటు చేసుకోవాలి. ఆ సంతోషాన్నే స్మరించుకుంటూ ఉంటే బాధలు అనేవి తలపుకురావు. సంతృప్తి, సంతోషం సుఖశాంతుల నిస్తాయి. బాధల గురించిన ఆలోచనను దరి చేరనివ్వవు.

ఒక స్త్రీ, తాను పది సంవత్సరాల క్రితం టైఫాయిడ్ జ్వరానికి గురైనప్పుడు అనుభవించిన బాధల గురించి ప్రస్తావించసాగింది. అంటే ఆమె తన బాధలనే స్మరిస్తూ ఉంది కాని, తాను పొందిన సుఖాలను గురించి కాదు. మనం దైవస్మరణ గురించి మరచి పోయామన్న సంగతినే మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకుంటున్నట్లయితే అది మరపుకే మొగ్గినట్లవుతుంది. అలా కాకుండా మనం దైవాన్ని మళ్ళీ జ్ఞాపకం చేసుకొని స్మరిస్తున్నాం అని మరీ మరీ అనుకుంటూ ఉంటే అది నిరంతర స్మరణను సక్రమం చేసి ఆ దైవంతో మన సంబంధాన్ని నిలుపుతుంది. బాబూజీ మహరాజ్ నీలోనే ఉన్నారు అనుకుంటే నీవు మరచిపోయే అవకాశం ఉండదు.

బాబూజీ మహరాజ్‌తో ఒక అభ్యాసీ, “నేను ధ్యానాన్ని ప్రతి నిత్యం నియమంగా చేయలేకపోతున్నాను, ఏమి చేయమంటారు” అని అడిగారు. బాబూజీ అతనికి “నీవు దశ నియమాలలో మొదటిది అనగా ప్రాతఃకాలమే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని ధ్యానంలో కూర్చోమని చెప్పిన దానిని అనుసరించు” అని చెప్పారు. బాబూజీ ప్రేమ పొందటానికి ఎటువంటి నియమాలు లేవు. అందరిపట్లా వారి ప్రేమ ఉంది. దశ నియమాలు మన జీవనసరళిని క్రమబద్ధం చేయటానికి కొన్ని సూచనలు, సలహాలు వంటివిగా మనం భావించుకోవాలి. సాధన చేయటానికి అనేక కారణాలను సాకులుగా చెప్పేవారి కోసం ఆ దశ నియమాలను సూచించారు. అలా ఏర్పాటు చేశారు.

ఒకసారి మాస్టర్ ఈశ్వర్ సహాయ్‌గారు బాబూజీతో “ఒక్కోసారి కొందరు మీతో పరుషంగానూ, చెడుగానూ మాట్లాడుతారు; అప్పుడు మీలో ద్వేషంగాని, కోపంగాని ఎందుకు కలుగవు?” అని అడిగారు.

దానికి సమాధానంగా, "నన్ను ఎవరైనా మంచిగా మాట్లాడినా, చెడుగా మాట్లాడినా అవి నా అంతరంగాన్ని తాకలేవు. నా హృదయమంతా లాలాజీ సాహెబ్ ఆక్రమించుకుని ఉన్నారు. అందులో ఏమీ ప్రవేశించటానికి చోటులేదు. ఏదైనా నా అంతరంగాన్ని తాకినపుడు నేను అందుకు స్పందిస్తాను" అని చెప్పారు బాబూజీ. దీని నుంచి మనం నేర్చుకోవలసింది ఏమిటంటే, మనం కూడా బాబూజీ మహరాజ్‌ను అంతగా ప్రేమించాలి, వారితో మమేకం కావాలి. ప్రేమ తప్ప మరోదానికి తావివ్వకూడదు.

"అభ్యాసులు నన్ను చూడటానికి వస్తుంటారు కాని 'అసలు' చూడకుండానే వెళ్ళిపోతారు. కలుసుకోవటానికి సమయం కోరతారు కాని, కలవకుండానే వెళ్ళిపోతారు" అని బాబూజీ అంటూ ఉండేవారు. దాని అర్థం ఏమిటంటే, భౌతికంగా 'వారి' రూపాన్ని దర్శిస్తున్నారేకాని 'వారి' దివ్యత్వాన్ని కానేకాదు. మన ఆత్మ ఎలా ఉంటుందో, ఎక్కడ ఉంటుందో మనకేమి తెలుసు. ఆ ఆత్మలో ఉన్న పరమాత్మను దర్శింపజేసి సాక్షాత్కారం అనుగ్రహించగల శక్తి ఒక్క బాబూజీకి మాత్రమే ఉంది. ఆ పరమ సత్యాన్ని మనం గ్రహించి హృదయంలో వారినే నింపుకుంటే షాజహాన్‌పూర్‌లో కుర్చీలో దర్శనమిచ్చిన బాబూజీ అక్కడే ఉన్నప్పటికీ, మనం ఎక్కడికి వెళ్ళినా, ఎక్కడ ఉన్నా కూడా మనలోనే, మన వెంటే ఉంటారు. బాబూజీ మనకు మన హృదయంలోనే దైవం ఉన్నాడని బోధించి, ఆ హృదయేశ్వరుని ఆరాధించటం ద్వారా సాక్షాత్కారం పొందేటట్లు చేయటానికే అవతరించారు. వారినే మనం ఆరాధించాలి, వారి ప్రేమను పొందాలి, ఆ ప్రేమయే మనకు పెన్నిధి.

"ఏ ఇతరుల మీద కాకుండా బాబూజీ గురించియే పాటలు వ్రాస్తారు మీరు" అని నన్ను ఒకరు అడిగారు. దానికి నేను ఇలా చెప్పాను: "నాకు బాబూజీ మహరాజ్ గురించి తెలుసు. వారు ఎప్పుడూ నాలోనే, నాతోనే ఉంటారు. వారు నాకు శక్తి నిస్తుంటారు, వివేకాన్ని ఇస్తుంటారు. వారు వ్రాయించినందువల్లనే నేను వ్రాయగలుగుతున్నాను" అని.

అభ్యాసులు గ్రూపులుగా విడిపోయినప్పటికీ, వారు శ్రీరామచంద్ర మిషన్‌లో చేరారు కనుక, అందరూ శ్రీ బాబూజీ మహరాజ్ పాదపద్మాల వద్దకు చేరవలసిందే. బాబూజీ మహరాజ్ అందరినీ అంతిమానికి తీసుకు వెళ్ళటానికే దిగి వచ్చారు కనుక, ఎవరినీ వదలిపెట్టరు. ఎవరు ఎన్ని చెప్పినా, ఏమి చేసినా, ఎవరెవరి వద్దకు వెళ్ళినా సరే, చివరకు బాబూజీ మహరాజ్‌గారి వద్దకు వెళ్ళాల్సిందే.

"లివింగ్ మాస్టర్" (జీవించి ఉన్న మాస్టర్) అనే ఆలోచన వచ్చినట్లయితే దానిని విశ్లేషణ చేసుకుంటే లివింగ్ (సజీవ) అనేది శరీరానికే కాని ఆత్మకు కాదు. ఆత్మ నశింపులేనిది, కనుక లివింగ్ (సజీవ) అనే దానికి ప్రాధాన్యతనిస్తే ఆత్మ సాక్షాత్కారానికి దారి తీయదు. రియలైజేషన్ అంటే ఐజేషన్ ఆఫ్ రియల్ అనగా సత్యత్వాన్ని శోధించటం, ఇంకా ముందుకు వెళ్తే సాధించటం జరుగుతుంది. ఆత్మ సాక్షాత్కారం ద్వారా ఆత్మ అనే దానిని గ్రహిస్తాము. తర్వాత దాని ద్వారా సత్యపథ్ వద్దకు ప్రయాణించి భగవత్ సాక్షాత్కారాన్ని పొందుతాము. అంతేకాని శరీరాన్ని మోసుకుపోలేము. మన శాశ్వతమైన సంబంధం సత్యత్వం అనగా బాబూజీతోనేగాని శరీరంతో కాదు. రియాలిటీ కొరకు తపించాలేకాని భౌతిక రూపం కొరకు కాదు. ఉదాహరణగా – ఒక స్త్రీ (సతి) తన భర్తను శారీరకంగా అమితంగా ప్రేమిస్తుంది. అతను చనిపోయినపుడు అతని చితిలో తన దేహాన్ని వదలి చాలిస్తుంది. దీనినే 'సతీ సహగమనం' అంటారు. మరి భౌతికంగా ప్రేమించేవారు కూడా అలా సహగమనం చేయగలరా? అలా ఎందుకంటే –ఆ సతీపతుల అనుబంధం

(ఎటాచ్‌మెంట్) గత జన్మలది కూడా కావచ్చు. అందుచేత ఆ ఆత్మలు కలిసి సహగమించవచ్చు. అంటే ఒకే ప్రాణం –రెండు శరీరాలు.

పురుషుని పుణ్యంలో భార్యకు సగభాగం దక్కుతుంది అంటారు. అందుకే అర్ధాంగి అంటాము. ఉదాహరణకు –అత్రి మహాముని భార్య అనసూయ. ఆమె తన భర్త తపస్సు చేసుకోవటానికి అనుకూలంగా సకల సపర్యలు చేపట్టి, ఆశ్రమ నిర్వహణ చేసేది. ఆమె మనస్సు ఆయన యందే లగ్నమై ఉండేది. గృహకృత్యాలు నెరవేర్చినా అనుబంధం ఆయనతోటే. కనుక ఆయన తపఃఫలంలో ఆమెకు అర్థభాగం లభించింది. ఆ విధంగా మనం కూడా మన హృదయాన్ని ఆ దైవానికే అనుసంధానం చేస్తే ఉన్నత స్థితులు కలుగుతాయి.

ఒక అభ్యాసీ సోదరి నాతో ఇలా చెప్పింది: "ఒకసారి మీరట్ ఆశ్రమంలో మేము ధ్యానంలో కూర్చున్నాము. నా ప్రక్కనే నా కుమారుడు కూడా కూర్చున్నాడు. ఇంతలో ఒక కోతి వచ్చి ప్రక్కనే కూర్చుంది. ధ్యానం నిలిపి వేసిన తరువాత అందరూ ఒక్కసారిగా లేచేసరికి ఆ కోతి కంగారుపడి మా కుమారుని చేతిని కరిచింది. అతను తన ప్రక్కనే ఉన్న ఆ కోతిని తన మాస్టర్‌గా భావించాడు కూడా. మరి అలా ఎందుకు జరిగింది" అని అడిగింది. నేను ఇలా సమాధానం చెప్పాను: "దీనిలో ఆలోచించాల్సినది ఏముంది, మీ కుమారుడు దైవంతో సంబంధం కలిగించుకోవటానికి బదులు ఆ కోతితో (అనగా దాని రూపంతో) సంబంధం కలిగించుకున్నాడు. అది దాని జాతి సహజమైన లక్షణంతో అలా చేసింది. కనుక మనం దైవం మీద దృష్టి నిలపాలి కాని రూపం మీద కాదు" అని.

మనం భక్త మీరాను గురించి తెలుసుకుందాము. ఆమెకు విషం ఇచ్చినా త్రాగింది. పాము కాటుకూ భయపడలేదు. అంటే ఆమె హృదయమంతా కృష్ణ భగవానుడే నిండి ఉన్నాడు. తాను ఉన్న పరిసరాలు, పదార్థాలు అన్నీ అతడే. మరో ధ్యాస లేదు. సర్వమూ ఆయన ప్రేమతో ప్రసాదించినవే అని స్వీకరించింది. ఆ దుష్ట తలంపుల నుంచి తాను నమ్మిన దైవమే ఆమెను కాపాడటం జరిగింది. ఆమెలాగ అంతరంగంలోని అంతర్యామిని సాక్షాత్కరించు కోవటానికే మనం వేదన చెందాలి. బాహ్య రూపాన్ని దర్శించటానికి కాదు. అందుకే బాబూజీ చెప్పేవారు– మీరు గుడికి వెళ్ళినప్పుడు ఆ విగ్రహాలలో నన్ను బంధించకండి –అని.

**ప్రశ్న: సహజమార్గంలో సాధన చేసే అభ్యాసీకి మరణ సమయం సమీపించినపుడు బాబూజీతో అతని సంబంధం ఎలా ఉంటుంది?**

**జవాబు:** అభ్యాసీకి బాబూజీతో సంబంధం ఉంది కాని అది శరీరంతో అనగా రూపంతో కాదు, వారి దివ్యత్వంతో ఉంది. ఆ సంబంధం నశింపులేని ఆత్మది. కనుక ఆత్మ పరమాత్మల సంబంధం కొనసాగుతూనే ఉంటుంది. మరణం శరీరానికే కనుక ఆత్మ గతికి అది ఆటంకం కాదు. మనలోని ఆత్మ మన దేహాన్ని పని చేయిస్తుంది. ఎప్పుడైతే మన ఆత్మ బాబూజీతో అనుసంధానం చేయబడుతుందో దానికి వారి నుండి శక్తి ప్రసారమవుతుంది. ఆ శక్తితో ప్రయాణించి 'వారి' దివ్యత్వంలో విలీనమైపోతుంది. 'వారి' చేతిలో మనం కీలుబొమ్మగా అయిపోవాలి. 'వారి'కి అమ్ముడు పోయినట్లయిపోవాలి. అప్పుడింక వారు ఎలా ఆడిస్తే అలా, 'వారు' ఎలా, ఎక్కడికి తీసుకు వెళ్ళితే అక్కడికి ప్రయాణిస్తాము. అనగా 'వారి' ఇచ్ఛాశక్తికే మనం అర్పితమయిపోతాం.

శ్రీరాముడు పట్టాభిషేకం అయిన తర్వాత హనుమంతుని మెడలో ఒక ముత్యాలహారంవేసి సత్కరించాడు. దానిని హనుమంతుడు మెడలో నుంచి తీసి ఒక్కొక్క ముత్యాన్ని పెరికి పారవేస్తున్నాడు. దానిని శ్రీరాముడు జాతి లక్షణంగా భావించాడు. సీతాదేవికి కూడా ఆ పని నచ్చలేదు. ఆమె హనుమంతుని ఎందుకలా చేస్తున్నావని ప్రశ్నించింది. అపుడు హనుమంతుడు, వీటిలో రాముని వెదుకుతున్నాను. రాముడులేని ఈ వస్తువులు నాకు అనవసరం అని జవాబిచ్చాడు. దీనినిబట్టి మనం గ్రహించాల్సింది ఏమిటంటే, మానవ నిర్మితమైన వాటిలో పదార్థం ఉంటుంది కాని, పరమాత్మ (తత్వం) లేదా దివ్యత్వం ఉండదు. దైవం సృష్టించిన వాటిలో దివ్యత్వం సమకూర్చబడుతుంది. మానవులమైన మనం ఆ ఈశ్వరునిచేత సృష్టించబడ్డాం కనుక మనలో ఆ ఈశ్వరత్వం ఉంది. దానిలో మనం లగ్నం కావాలి.

పాదాభివందనం అనేది భౌతికంగా ఆచరిస్తున్న క్రియ. హృదయాంతరాళంలో భక్తితో, ప్రేమతో, వినయపూర్వకంగా ఆ దివ్యత్వం ముందు సాగిలపడటమే అసలైన పాదాభివందనమని బాబూజీ బోధిస్తూ ఉండేవారు. చరణ స్పర్శ కాకుండా భక్తితో, ప్రేమతో వారి హృదయాన్ని స్పర్శించగలగాలి.

బాబూజీ నన్ను నెగేషన్ స్థితికి తీసుకు వెళ్ళేటప్పుడు బ్రహ్మరంధ్రం గుండా ప్రయాణింపజేయాల్సి వచ్చింది. అది ప్రాణాంతకమైన ప్రయాణం. అందుచేత బాబూజీ నన్ను తమ సంకల్పం ద్వారా దాని ద్వారం దాటించారు. బ్రహ్మరంధ్రం అనేది ఆత్మ శరీరంలోకి ప్రవేశించి నిష్క్రమించే మార్గం. ఇటువంటి స్థితిలోనే బ్రహ్మరంధ్రం దాటే చర్యలోనే స్వామి వివేకానంద మరణించటం జరిగింది. బాబూజీ నన్ను అలా దాటించిన తర్వాత నా క్షేమం గురించి తెలుసుకున్నారు. ఆ విధంగా 'వారు' అభ్యాసుల రక్షణ విషయంలో చాలా జాగ్రత్త తీసుకునేవారు.

అభ్యాసులు నన్ను విడిచిపెట్టవచ్చునేమో కాని నేను అభ్యాసులను వదలను – అని బాబూజీ చెపుతూ ఉండేవారు. ఒకసారి మనం 'వారి' పాదపద్మాలకు సమర్పితమయ్యాక వారే మన బాధ్యత వహిస్తారు. "అభ్యాసుల హృదయమే నా ఇల్లు. వారి ఇల్లే నా ఆశ్రమం" అని బోధపర్చేవారు బాబూజీ. అందుచేత మనం ఏ ఆలోచన చేస్తున్నా, ఏమి మాట్లాడుతున్నా, ఏమి చేస్తున్నా కూడా బాబూజీ స్మరణతోనే, బాబూజీ పరంగానే చేస్తే మన బాధ్యత నెరవేర్చినట్లవుతుంది. ఆ విధంగా మన జీవనసరళిని క్రమబద్ధం చేసుకోవాలి.

భగీరథుడు తపస్సు చేసి గంగావతరణకు కారకుడయ్యాడు. సామాన్యంగా ఆలోచించే వారికి అది తన స్వంత అవసరం ఏర్పడి అలా సాధించాడు –అని తోచినప్పటికీ, సమస్త జీవరాశికీ సజలధారను సమర్పించటానికే ఆ మహాముని గంగను అవతరింప జేశాడు అని గ్రహించాలి.

ఆశ్రమంలో బాబూజీ తమ దివ్యశక్తిని (ఛార్జింగ్) పూరిస్తారు. ఆ విధంగా శక్తి సమన్వితం చేయకపోతే అది మామూలు భవంతిగానే ఉండిపోతుంది. దాని నిర్వహణ బాధ్యతను 'వారు' తమ అదుపులో ఉంచుకుంటారు. సమయోచితంగా ఛార్జ్ చేస్తుంటారు.

బాబూజీ మన హృదయంలో ప్రవేశించటానికి ఎల్లవేళలా సర్వసన్నద్ధంగా ఉంటారు. మనం ఆహ్వానించటమే ఆలస్యం. అందుకే బాబూజీ చెప్పేవారు –నీవు పిలిచినంతనే రావటానికి నేను వేచి ఉంటాను. కాని నీవు నన్ను స్వీకరించటానికి సిద్ధంగా ఉండవు –అని. అందుచేత ఒక దివ్యమూర్తిని మన హృదయంలోకి ఆహ్వానించేటప్పుడు మనం సావధానంగా ఉండాలి. అప్పుడే ప్రయోజనం చేకూరుతుంది.

అభ్యాసీ సోదరీ సోదరులందరూ బాబూజీ యొక్క కృపను, దివ్య ప్రాణాహుతిని పూర్తిగా పొందారు. ఆ దివ్యానందం అనుభవించటానికి ఆత్మ నృత్యం చేయాలని కూడా కోరుకుంటోంది. అదంతా వారి మహిమ. తమ బిడ్డలైన అభ్యాసులను 'వారు' ఏమి ఆశీర్వదించనున్నారో నాకు తెలియదు కాని 'వారి' పాదపద్మాలను ఆశ్రయించిన వారు ఇక్కడ ఉన్నా, ఎక్కడ ఉన్నా వారికందరికీ తమ ప్రేమను పంచుతున్నారు. 'వారి' దివ్యాశీస్సులు మీరు పొందుతూ ఉంటే నాకు ఆనందంగా ఉంది.

బాబూజీ మహరాజ్ నాకు చాలా దగ్గరలోనే ఉన్నారు; నేను 'వారి' ఎదుటనే ఉన్నాను –అని 'వారి' స్మరణలో ఎల్లవేళలా అభ్యాసీలు 'వారి' ప్రజెన్స్‌ను (సన్నిధి)ని అనుభూతి చెందాలి. దీని ఫలితంగా అభ్యాసీలో నిరంతర స్మరణ మరియు బాబూజీతో నిరంతరం కనెక్షన్ అనేది ఏర్పడుతుంది.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! నాకు మీతో రిలేషన్ (బాంధవ్యం) చాలా దగ్గరిగా ఏర్పడినట్లుగా ఉంది. మీరు నాకు చాలా సమీపంలో ఉన్నట్లుగా అనిపిస్తుంది" అని వ్రాశాడు. అపుడు వారు, "భాయీ! నీవు వ్రాసింది చాలా మంచి విషయమే. కాని రిలేషన్ (సంబంధం) అనే పదం మన ఇద్దరి మధ్యన ఉండకూడదని నేను కోరుకుంటున్నాను" అని వ్రాశారు. రిలేషన్ (సంబంధం) అనే పదం వచ్చినప్పుడు సెపరేషన్ (విడిపోవటం) అనేది కూడా అక్కడ ఉన్నట్లే. అందువలన కలిసిన (కనెక్షన్) అనేది సరైన పదం. ఆలోచనలతోను, హృదయంతోను, నిరంతర స్మరణతోను మీరు బాబూజీతో కనెక్షన్‌ను ఏర్పరచుకోవాలి. రిలేషన్ (సంబంధం, బాంధవ్యం) అంటే బాబూజీ మరియు అభ్యాసీ మధ్యన దూరం ఉందని, అభ్యాసీ బాబూజీలో లయం కాలేదని అర్థం.

**ప్రశ్న: ఆధ్యాత్మికతలో అభివృద్ధి చెందటానికి చాలా అవసరమైనది ఏమిటి?**

**జవాబు:** భౌతిక పదార్థాన్ని అభివృద్ధి చేయగలం. కాని ఆధ్యాత్మికతను అభివృద్ధి చేయలేము. "బాబూజీ నా వారు" అనే భావం ప్రేమతో నిండిన నిరంతర స్మరణ అనేది చాలా ముఖ్యమైన విషయం. దీనిని ఏర్పరచుకోవటం చాలా సులభం. ఎప్పుడైనా సరే బాబూజీ మహరాజ్ స్మరణ గుర్తుకురాగానే, వారి స్మరణలోనే మునిగిపోవాలి. అప్పుడు పురోగతి వేగంగా ఉంటుంది.

"నేను ఎవరు? ఏమిటి? అనేది నాకు తెలియదు. కాని నేను ఎవరు? అనేది అభ్యాసీలకు తెలుస్తుంది" అని బాబూజీ చాలాసార్లు అనేవారు. మీరు బాబూజీతో కనెక్షన్ (లింక్)ను ఏర్పరచుకుంటే, నెమ్మది నెమ్మదిగా మీకు బాబూజీ మహరాజ్ (డివైన్ పర్సనాలిటీ) గురించి తెలుస్తుంది. బాబూజీకి వారి గురించి వారికి ఏమీ తెలియదు. అందువల్లనే ఒకసారి లాలాజీ సాహెబ్ ''నీవు వేలకొద్దీ ఆధ్యాత్మిక ప్రతినిధులను తయారుచేయగలవు. కాని నీ సబ్‌స్టిట్యూట్ (అనగా రెండవ బాబూజీని) నీవు తయారుచేయలేవు. ఎందుకంటే, నీవు ఎవరు? నీ శక్తి ఏమిటి? అనేది నీకు తెలియదు. నీవు ఎల్లవేళలా నా స్మరణలోనే మునిగిపోయి పూర్తిగా మరచిన స్థితిలోనే ఉన్నావు" అని బాబూజీతో అన్నారు.

**సమాధి:** నిన్ను నీవు మరచిపోయిన స్థితి.

**సహజ సమాధి:** నీవు అన్ని పనులు చేస్తూనే, సహజంగానే సమాధి స్థితిలో మునిగిపోయి నివసిస్తావు. కాని నీవు సమాధి స్థితిలో ఉన్నట్లుగా నీకు తెలియదు. శరీరానికి ఏదైనా దెబ్బ తగిలినప్పుడు లేదా గాయం

అయినప్పుడు, అప్పుడు ఒక్కసారిగా నీకు దాని స్పర్శ తెలుస్తుంది. శరీరం యొక్క ఎరుక కలుగుతుంది. ఇది **సహజ సమాధి** స్థితి.

**జడ సమాధి:** ఇది సహజ సమాధి స్థితి కంటే కూడా చాలా ఉన్నతమైనది. ఈ స్థితిలో శరీరానికి దెబ్బ తగిలినా కూడా దాని యొక్క స్పర్శ తెలియదు. "బాబూజీ! నేను దేనిని ముట్టుకున్నా కాని, నన్ను నేను తాకినా కాని, నాకు దాని స్పర్శ కాని, అనుభూతికాని తెలియటంలేదు" అని వారికి వ్రాశాను. అప్పుడు వారు, "బిటియా! నాకు చాలా ఆనందంగా ఉంది. ఇది మన లాలాజీ సాహెబ్ యొక్క కృప. ఇదే **జడ సమాధి** యొక్క స్థితి. ఇంతవరకు ఎవరు కూడా ఈ జడ సమాధి యొక్క స్థితిని అనుభూతి చెందలేదు" అని వ్రాశారు. ఈ జడ సమాధి యొక్క స్థితిని దాటిన తరువాత భగవత్ సాక్షాత్కారం ఆ డివైన్ పర్సనాలిటీ (దివ్య పురుషుడు) బాబూజీ మహరాజ్ యొక్క సాక్షాత్కారం అనేది మొదలవుతుంది. అందువల్లనే నేను ఒక పాటలో, "బాబూజీ! ఎప్పుడైతే మీ డివైన్ బ్యూటీ (దివ్య సౌందర్యం) నా ఎదుట ప్రత్యక్షమైందో అప్పుడు, ఈ జడ సమాధి స్థితిలో స్పందనలు ఏర్పడటంవలన, ఆ డివైన్ పర్సనాలిటీ యొక్క డివైన్ బ్యూటీ నా ఎదుటనే ఉన్నట్లుగా నేను అనుభూతి చెందాను" అని వ్రాశాను.

**ప్రశ్న: జనన-మరణ చక్రం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది కదా! ముక్తిని పొందటం ఎలా?**

**జవాబు:** మానవులందరిని భగవంతుని వద్దకు తీసుకొని వెళ్ళటానికి ఎవరైనా డివైన్ పర్సనాలిటీ (బాబూజీ మహరాజ్) భూమి మీద అవతరించినపుడు మానవులకు ముక్తి లభిస్తుంది. **పునర్జన్మ అనేది లేకపోవటమే ఆధ్యాత్మికతలోని మొట్టమొదటి స్థితి. బాబూజీ మహరాజ్ చరణాలను చేరుకున్న వారు అందరికి ఈ మొదటి బహుమతి (పునర్జన్మ రాహిత్యం) లభిస్తుంది. మనం శాంతి, ప్రశాంతత కొరకు ఈ సహజమార్గ్‌లో చేరలేదు. శాశ్వతమైన శాంతి కొరకు, శాశ్వతమైన పరమానందం కొరకు మరియు డివైన్ పర్సనాలిటీ, బాబూజీ మహరాజ్ యొక్క డివైన్ బ్యూటీ (దివ్య సౌందర్యం)ను దర్శించటం కొరకే మనం ఈ సహజమార్గ్ మెడిటేషన్ (ధ్యానం) చేస్తున్నాము.**

**ప్రశ్న: చాలామంది ప్రిసెప్టర్లకు అభ్యాసీ యొక్క ప్రోగ్రెస్ (పురోగతి) గురించి తెలియటం లేదు.**

**జవాబు:** నీవు ఏ విధంగా అయితే ప్రోగ్రెస్ కావాలని తపనతో ఉంటావో, అదే తపనతో, ప్రిసెప్టర్ అభ్యాసీలను ప్రేమించాలి- అని బాబూజీ అనేవారు. అప్పుడు ఆ ప్రిసెప్టర్‌కు అభ్యాసీ యొక్క పురోగతి గురించి తెలుస్తుంది. బాబూజీ మహరాజ్ నన్ను ప్రిసెప్టర్‌ను చేసిన కొన్ని సంవత్సరాల తరువాత ఎవరైనా అభ్యాసీ గుర్తుకురాగానే, లేదా కనబడినప్పుడు వెంటనే ఎక్స్‌రే ఫిల్మ్ (ఫోటో)లాగ ఆ అభ్యాసీ యొక్క ఆధ్యాత్మిక స్థితి నా ఎదుట ప్రత్యక్షమయ్యేది. ఎవరైనా అభ్యాసీ నా వద్దకు వచ్చినప్పుడు, చూడగానే, అతనికి సిట్టింగ్ (పూజ)ను ఇవ్వాలి అని అనిపిస్తుంది. ఎందుకంటే, అతనిలో క్రేవింగ్ (తపన) ఉంది. అతని హృదయం పవిత్రతతో నిండి ఉంది. కాని కొంతమంది అభ్యాసీలను చూడగానే, వాళ్ళ నుండి పారిపోవాలని అనిపిస్తుంది. ఎందుకంటే, వాళ్ళలో క్రేవింగ్ లేదు కాబట్టి. అలాగని ప్రిసెప్టర్ వాళ్ళను విడిచిపెట్టకూడదు. "బాబూజీ! ఈ అభ్యాసీని మీ చరణాలకు అర్పిస్తున్నాను. ఇతనికి మీ దివ్యకృపను ప్రసాదించండి" అని నేను అటువంటి అభ్యాసీ నావద్దకు వచ్చినప్పుడు 'వారి'ని ప్రార్థిస్తాను. "అభ్యాసీలు నన్ను విడిచిపెడతారు కాని, నేను ఏ ఒక్క అభ్యాసీని కూడా విడిచిపెట్టను" అని బాబూజీ అనేవారు.

**ప్రశ్న: క్రేవింగ్ (తపన) అనేది ఎలా అభివృద్ధి చేసుకోవాలి?**

**జవాబు:** ఆధ్యాత్మికతలో ఏదీ కూడా అభివృద్ధి చేయలేము. ఆధ్యాత్మికతలో ప్రతిదీ కూడా సహజంగానే, దానంతట అదే వస్తుంది. "బాబూజీ నావారు" అనే దానిని మీరు అనుభూతి చెందినప్పుడు, బాబూజీ ఎల్లప్పుడు కూడా మీ అటెన్షన్ (దృష్టి)లోనే ఉంటారు. బాబూజీ మీ దృష్టిలోనే ఉన్నారు. మీలోనే ఉన్నట్లుగా అనిపిస్తుంది. కాని ఇంకా మీరు వారిని పొందలేదు. ఇంక ఇప్పుడు మీలో క్రేవింగ్ (తపన) అనేది మొదలవుతుంది. అనగా సెపరేషన్ (ఎడబాటు) యొక్క అనుభూతి కలిగినప్పుడు క్రేవింగ్ (తపన) ఏర్పడుతుంది. కొన్నిసార్లు బాబూజీ మీకు చాలా దగ్గరగా ఉన్నట్లుగా అనిపిస్తుంది. మరి కొన్నిసార్లు బాబూజీ అలా దగ్గరగా ఉన్నట్లుగా అనిపించదు. దూరంగా ఉన్నట్లుగా అనిపిస్తుంది. అప్పుడు వారిని చేరుకోవాలనే తపన (క్రేవింగ్) మరల కలుగుతుంది. తల్లి తన పసిపిల్లవానికి నడక నేర్పించటానికి అతని ఎదుట ఒక ఆట వస్తువును ఉంచు తుంది. పిల్లవాడు దగ్గరకు రాగానే ఆ ఆటవస్తువును ఇంకా కొద్దిగా దూరంలో పెట్టుతుంది. అప్పుడు ఆ ఆటవస్తువును ఎలాగైనా పట్టుకోవాలనే తపన ఆ పసిపిల్లవానిలో కలుగుతుంది. అదే విధంగా ఆధ్యాత్మిక జనని అయిన బాబూజీ, అభ్యాసీలలో తపన (క్రేవింగ్)ను పెంపొందిస్తారు. పసిపిల్లవాడు తన తల్లినితప్ప ఎవరిని కూడా గుర్తించలేడు. పసిపిల్లవాడు తన తల్లిని ఎలా ప్రేమిస్తాడో, ఆమెపై ఎలా ఆధారపడి ఉంటాడో, అదే విధంగా అభ్యాసీలు కూడా బాబూజీ మీద ప్రేమతో నిండిన డిపెండెన్సీ (ఆధారపడి) ఉండాలి.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! మరణించిన తరువాత ఏం జరుగుతుంది" అని అడిగాడు. అప్పుడు బాబూజీ నవ్వుతూ, "భాయీ! మరణించిన తరువాత నీకు అక్కడ డబ్బు లభించదు. ఉద్యోగం దొరకదు. మరణించిన తరువాత ఏం జరుగుతుంది అని నీవు ఎందుకు తెలుసుకోవాలని అనుకుంటున్నావు? ఇవి అన్నీ విడిచిపెట్టు. నీ డ్యూటీ (కర్తవ్యాన్ని) నీవు నిర్వహించు. మరణం తరువాత ఏం జరుగుతుంది? ఏమిటి? అనే దానిని గురించి ఆలోచించకు" అని ప్రేమతో అన్నారు.

**ప్రశ్న: ప్రోగ్రెస్ (పురోగతి) చెందుతున్నామని గుర్తించటం ఎలా?**

**జవాబు:** మీ ఆలోచనలలోని మార్పువలన, బాబూజీ మహరాజ్ యొక్క నియర్‌నెస్ (సామీప్యత)ను అనుభూతి చెందటం వలన ప్రోగ్రెస్ అవుతున్నట్లుగా అభ్యాసీ గుర్తించగలడు. మీ ప్రవర్తనలో, మీ సంభాషణలో మార్పు కలిగినదా, లేదా అనేది మీ కటుంబ సభ్యులు మరియు ఇతరులు గుర్తిస్తారు.

"బాబూజీ మహరాజ్ యొక్క దివ్య ప్రేమను అనుభూతి చెందినప్పుడు నాకు కఠినమైన ప్రాపంచిక సమస్యలు కూడా తేలికగా కనబడుతున్నాయి" అని ఒక డెన్మార్క్ సోదరి అన్నారు. నిజమే! "బాబూజీ నావారు" అని మీరు 'వారి' స్మరణలో, ప్రేమలో మునిగిపోయినప్పుడు, 'వారు' మీకు తన దివ్యశక్తిని ప్రసాదిస్తారు. అప్పుడు ఆ సమస్యల బాధ యొక్క తీవ్రత అనేది తగ్గిపోతుంది. బాబూజీతో మీకు నిజమైన కనెక్షన్ అనేది ఏర్పడినప్పుడే ఈ విధంగా జరుగుతుంది. బాబూజీ దీనిని గురించి ఒక చక్కని ఉదాహరణ చెప్పారు. ఒక అభ్యాసీ సోదరి "బాబూజీ మిమ్మల్ని గాఢంగా ప్రేమిస్తున్నాను. మీతో నాకు నిజమైన కనెక్షన్ ఉంది" అని చెబుతూ, "నేను మంచినీళ్ళు త్రాగినప్పుడు, బాబూజీయే మంచినీళ్ళు త్రాగుతున్నారని అనుకొంటాను. స్వీట్ తింటున్నప్పుడు, ఆహారం తింటున్నప్పుడు బాబూజీయే తింటున్నారని భావిస్తాను"

అని అన్నది. అప్పుడు బాబూజీ ఆ సోదరితో, "నీవు స్వీట్ తిన్నావు, భోజనం చేసావు, ప్రతీసారి బాబూజీయే తింటున్నారు –అని నీవు అంటున్నావు. కాని దాని రుచి నాకు తెలియటం లేదు. నిజంగానే నేను తిన్నట్లయితే దాని రుచి నాకు తెలియాలి కదా!" అని అన్నారు. అందువలన బాబూజీతో మీకు నిజమైన కనెక్షన్ అనేది ఉంటేనే మీ సమస్యలు వారిని స్పర్శిస్తాయి. అపుడు వారి సహాయం మీకు లభిస్తుంది. సమస్య యొక్క తీవ్రత తగ్గిపోతుంది.

**ప్రశ్న: భగవంతుడు దయామయుడు కదా! ప్రపంచంలో ఈ కష్టాలు, దుఃఖాలు ఎందుకు ఉన్నాయి?**

**జవాబు:** సృష్టిలోని నిర్మాణం, వినాశనం అనే ఈ క్రియలన్నీ కూడా ప్రకృతి ద్వారా జరుగుతున్నాయి. మానవుడు భగవంతునితో, భగవంతునిలో జీవించటానికి బదులుగా ఈ ప్రకృతి మీద ఆధారపడి జీవిస్తున్నాడు. భగవంతుడు కరుణామయుడు, ఎందుకంటే భగవంతుడు మానవులందరి హృదయాలలో ఉన్నాడు. మానవుడు రకరకాల దేవుళ్ళు, దేవతల యొక్క విగ్రహాలను తయారుచేస్తూ రియాలిటీని అనగా నిజమైన భగవంతుని మరచిపోయాడు.

ధ్యానంలో చాలా ఆలోచనలు వస్తున్నాయి. ఏ ఫీలింగ్ (అనుభూతి) కలగటంలేదు –అని అంటారు. ధ్యానంలో కూర్చున్నప్పుడు అభ్యాసీ యొక్క అటెన్షన్ (ఆంతరిక దృష్టి), డివైన్ (దైవం)తో కలవనప్పుడు, ఫీలింగ్ అనేది మీ అనుభవంలోకి రాదు. ధ్యానంలో "భగవంతుడు (డివైన్) నా హృదయంలోనే ఉన్నాడు" అని ఒక్కసారి మనస్సులో అనుకోమని బాబూజీ చెప్పారు. అప్పుడు "బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు" అనే థాట్ (ఆలోచన) గాఢం అయినకొద్దీ, అది (ఆలోచన) ఫీలింగ్ (అనుభూతి)గా మారుతుంది. అభ్యాసీలు ధ్యానంలో వచ్చే ఆలోచనల మీద ఎక్కువగా దృష్టి ఉంచుతారు. కాని ధ్యానంలో కలిగే ఫీలింగ్ (అనుభూతి) మీద దృష్టిని ఉంచరు. ధ్యాన సమయంలో ఆలోచనలు వచ్చినప్పటికి ధ్యానం తరువాత అయినా సరే, మీరు జాగ్రత్తగా గమనిస్తే మీకు హృదయంలో ఒక విధమైన శాంతి, ప్రశాంతతలు పొందినట్లు అనిపిస్తుంది. మీరు ధ్యానంలో కూర్చుంటారు కాని, మీ అటెన్షన్ (ఆంతరిక దృష్టి) అనేది డివైన్‌తో కనెక్ట్ (లింక్) కావటం లేదు. "భగవంతుడు (డివైన్) నా హృదయంలోనే ఉన్నాడు" అనే ఒక్క విషయాన్ని మాత్రమే బాబూజీ గుర్తుపెట్టుకోమని అన్నారు. ఈ ఒక్క విషయం మీదనే మీరు మీ అటెన్షన్ (దృష్టిని) ఉంచాలి. సూర్యుడు ప్రకాశించినప్పుడు అక్కడ చీకటి ఉండదు. అదే విధంగా బాబూజీ మీకు ట్రాన్స్‌మిషన్ (దివ్య ప్రాణాహుతి)ని ఇచ్చినప్పుడు మీకు ఆ ఫీలింగ్ (అనుభూతి) కలిగినా, కలగకపోయినా, ఆ దైవ ప్రసాదం మీ హృదయంలోనే ఉంటుంది. కాని, "బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు" అనే దాన్ని మీరు ఎప్పుడూ తప్పక గుర్తుపెట్టుకోవాలి.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! మెడిటేషన్ (ధ్యానం) చేయాలంటే చాలా కష్టంగా ఉంది" అని అనగానే, వారు "భాయీ! నీవు చెప్పేది తప్పు. మెడిటేషన్ (ధ్యానం)లో ఎటువంటి కష్టం లేకపోవటమే ధ్యానంలోని అసలు కష్టం" అని అన్నారు. చిన్నపిల్లలు చదువుతున్నప్పుడు వాటిమీద ధ్యాసపెట్టి చదవమని చెప్పుతాం. ఒక విద్యార్థి ఎదుట అతడు చదవలసిన సబ్జెక్ట్స్ పుస్తకాలు చాలా ఉంటాయి. కాని ఇక్కడ అభ్యాసీకి, బాబూజీ ఒక్కటే వాక్యం ఇచ్చారు. "భగవంతుడు నా హృదయంలోనే ఉన్నాడు" అనే ఒక్కదానినే స్మరణలో ఉంచుకోమన్నారు.

“నీ అటెన్షన్‌ను (ఆంతరిక దృష్టిని) నా మీద నిలిపితే, దివ్య ప్రేమ అనేది నీకు దానంతట అదే లభిస్తుంది” అని బాబూజీ అనేవారు. ఎందుకంటే, బాబూజీయే ఆ దివ్య ప్రేమయై ఉన్నారు కదా! ‘వారి’ వద్ద ఆ దివ్య ప్రేమతప్ప ఇంకొకటి లేదు.

ఒకసారి మేమందరం షాజహాన్‌పూర్‌లో బాబూజీ ఇంటి వరండాలో ‘వారి’ ఎదురుగా కూర్చొని ఉన్నాం. అప్పుడు ఒక అభ్యాసీ “బాబూజీ! నేను మిమ్మల్నే చూస్తున్నాను. మీ ముఖంవైపే చూస్తున్నాను. కాని మీరు కనీసం ఒక్కసారి కూడా నావైపు చూడ్డంలేదు” అని అన్నాడు. అప్పుడు బాబూజీ నవ్వుతూ, “భాయీ! ఇది చాలా మంచిది. నీవు ఆలోచించేది సరైనదే. ఎందుకంటే, నీ మనస్సులో నేను నిన్ను చూడలేదనే ఆలోచనవలన నీ ఆటెన్షన్ (దృష్టి) అంతా కూడా నా మీదనే ఉంది” అని అన్నారు.

మరొకసారి ఇంకొక అభ్యాసీ “బాబూజీ! అలహాబాద్‌లో మీరు మా ఇంటికి వచ్చినప్పుడు నేను ఎంతో శ్రద్ధతో మీకు అన్ని సేవలు చేసాను. ఇప్పుడు నేను మీ ఎదుటనే కూర్చొని ఉన్నాను. మీరు నావైపు కూడా చూడటం లేదు. మీరు నన్ను మరచి పోయినట్లుగా ఉన్నారు” అని అన్నాడు. అప్పుడు వారు “భాయీ! నేను చాలా సంతోషంగా ఉన్నాను. ఎందుకంటే, నీ మనస్సులో నేను నిన్ను మరచిపోయాను అనే ఆలోచన కలిగింది. అనగా మరచిపోవటం అంటే ఏమిటి అనేది ఇప్పుడు నీకు అర్థమయ్యింది. ఇప్పుడు నిన్ను నీవు మరచిపోవటంలో నీవు తప్పకుండా విజయాన్ని పొందుతావు” అని అన్నారు.

ఒక అభ్యాసీ, “బాబూజీ! మేము ఎన్నో పనులను చేస్తూ ఉంటాము. ఈ సంస్కారాలు అనేవి ఎక్కడ ఉంటాయి?” అని అడిగాడు. అప్పుడు వారు, “ప్రతి మనిషిలో ప్రింటర్ అనేది ఒకటి ఉంది. అది ఒక ప్రింటర్ (ముద్రణా పరికరం) లాగానే పని చేస్తుంది. ఏదైనా విషయాన్ని గురించి దీర్ఘంగా ఆలోచిస్తే, అది సబ్‌కాన్షస్ మైండ్ మీద ముద్రించబడుతుంది” అని అన్నారు. ఎప్పుడైతే మీరు బాబూజీని ప్రేమించటం ప్రారంభిస్తారో, అప్పుడు నెమ్మది నెమ్మదిగా ఆ ప్రింటర్ (సబ్‌కాన్షస్ మైండ్) మీద ముద్రించబడినవి అన్నీ కూడా చెరిపివేయబడి అక్కడ బాబూజీ మహరాజ్ యొక్క దివ్య ఆలోచన మాత్రమే ముద్రించబడుతుంది. అప్పుడు మీలో నిరంతర స్మరణ మొదలవుతుంది.

ఒకసారి ఒక అభ్యాసీ, “బాబూజీ! మాయ అంటే ఏమిటి? భగవంతుడు అంటే ఏమిటి?” అని అడిగాడు. అప్పుడు వారు నవ్వుతూ “భాయీ! కళ్ళు తెరచి చూస్తే కనపడేది మాయ, కళ్ళు మూసుకుంటే (ధ్యానంలో) కనపడేది భగవంతుడు” అని ఆన్నారు. కళ్ళు తెరచి ఈ బాహ్య ప్రపంచాన్ని చూస్తే బంధనాలు ఏర్పడతాయి. కళ్ళు మూసుకొని (హృదయంలో) భగవంతుని చూస్తే బంధనాలు ఏర్పడవు.

బ్రైటర్‌వరల్డ్ (తేజోమయ లోకం)లో బ్లిస్ (పరమానంద స్థితి) ఉంటుంది. ముక్తి పొందిన ఆత్మలకు అనగా లిబరేటెడ్ సోల్స్‌కు పరమానందం (బ్లిస్) కావాలి. అందువలన అవి బ్రైటర్‌వరల్డ్‌లో ఉంటాయి. నేను ఆ బ్లిస్ (పరమానంద స్థితి)ని పొందినప్పుడు బాబూజీ నాకు ఒక ఉత్తరం వ్రాశారు. “బిటియా! ఈ బ్లిస్ (పరమానంద స్థితి) అనేది భరింపలేనటువంటిది. ఈ సమయంలో నీవైనా షాజహాన్‌పూర్‌కు వచ్చి నావద్ద ఉండాలి లేదా నేనయినా లఖింపూర్‌కు వచ్చి నీ వద్ద ఉండాలి. లాలాజీ సాహెబ్‌కు కృతజ్ఞతలు. వారే స్వయంగా నిన్ను కాపాడుతున్నారు. నీకు ఈ బ్లిస్ (పరమానంద స్థితి) భరింపలేనట్లుగా అనిపిస్తే, వెంటనే నీ గదిలోని లాలాజీ సాహెబ్ కుర్చీ ఎదురుగా పూజలో కూర్చో” అని వ్రాశారు. ఈ బ్లిస్ (పరమానంద

స్థితి) అనేది చాలా ఆకర్షణీయమైన స్థితి. అందువలన ఎవ్వరు కూడా ఈ స్థితిని విడిచిపెట్టి ముందుకు వెళ్ళలేరు. కేవలం డివైన్ పర్సనాలిటీ అయిన బాబూజీ మహరాజ్ యొక్క దివ్య శక్తి వల్లనే అభ్యాసీ ఈ పరమానంద స్థితిని దాటి పురోగమించి, అల్టిమేట్ (అంతిమ సత్యం) చేరుకోగలడు.

**ప్రశ్న: సంస్కారాల నుండి బయటపడటం ఎలా?**

**జవాబు:** సంస్కారాల్ని మీరు తొలగించలేరు. సంస్కారాల వలన 'భోగ్' అనేది తప్పనిసరి. భోగ్ అంటే, ఆ సంస్కారాల యొక్క ఫలితాన్ని అనగా కష్టాలు, దుఃఖాలు అనుభవించటం. ప్రేమతో బాబూజీ స్మరణలో లీనమైనపుడు మీకు వీటిని ఎదుర్కొనే శక్తి లభిస్తుంది.

**ప్రశ్న: ధ్యానంలో చాలా ఆలోచనలు వచ్చి చికాకుగా ఉన్నప్పుడు కళ్ళు తెరచి బాబూజీ చిత్రాన్ని చూడవచ్చునా?**

**జవాబు:** బాబూజీ చిత్రాన్ని చూడటం కాదు, 'వారి' ప్రజెన్స్ (సన్నిధి)ని అనుభూతి చెందాలి. ప్రజెన్స్ (ఉనికి) అంటే బాబూజీ మహరాజ్ నా ఎదుటనే ఉన్నారు అనే దృఢమైన ఫీలింగ్‌ను (అనుభూతిని) కలిగి ఉండటం. అభ్యాసీ లందురు కూడా బాబూజీ మహరాజ్ సాన్నిధ్యాన్ని (ప్రజెన్స్‌ను) అనుభూతి చెందాలి. మనం 'వారి' ఫోటో మీద ధ్యానం చేయటం లేదు.

**ప్రశ్న: ప్రిసెప్టర్ అభ్యాసీని, బాబూజీతో కనెక్ట్ చేయగలడా?**

**జవాబు:** ఎవ్వరు కూడా అభ్యాసీని బాబూజీతో కనెక్ట్ చేయలేరు. "బాబూజీ! నేను మీ వాడిని, నేను మీ వాడినే" అనే ఆలోచనతో, ఫీలింగ్‌తో అభ్యాసీ 'వారి'తో ఎటాచ్‌మెంట్ (అనురాగ బంధాన్ని) ఏర్పరచుకోవాలి. ఎప్పుడైతే "బాబూజీ! మీరు నావారు, నేను మీ వాడిని" అని మీ హృదయంలో అనురాగపు అనుభూతి కలుగుతుందో అప్పుడు కనెక్షన్ ఏర్పడటం మొదలవుతుంది. బాబూజీ మహరాజ్ యొక్క ప్రాణాహుతి వలన అభ్యాసీలలో ప్రేమ, భక్తి ఎక్కువ అవ్వాలనే సంకల్పంతో ప్రిసెప్టర్ సిట్టింగ్ ఇస్తాడు.

బాబూజీ మహరాజ్ యొక్క దివ్య ప్రేమ, వర్షంలాగ వర్షిస్తున్నట్లుగా నేను ప్రతిక్షణం 24 గంటలు అనుభూతి చెందుతున్నాను. కనుక మీరందరు కూడా 'వారి' ట్రాన్స్‌మిషన్‌లో, దివ్యప్రేమలో, 'వారి' నిరంతర స్మరణలో మునిగిపోవటానికి ప్రయత్నం చేయండి. ఇది అమూల్యమైన సమయం. మీరందరు 'వారి' దివ్యప్రేమలో మునిగిపోవాలి.

నేను మొదటిసారి షాజహాన్‌పూర్‌కు వెళ్ళి తిరిగి వచ్చేటప్పుడు 'వారి'ని విడిచిపెట్టి రాలేకపోయాను. ఎందుకంటే, 'వారి' భౌతికరూపం ఎంతో ఆకర్షణీయంగా ఉంది. మరల రెండవసారి, బాబూజీ ఇంటి నుండి తిరిగి వస్తున్నప్పుడు, 'వారి'ని విడిచిపెట్టి ఉండలేనని, 'వారి' ఆ భౌతికమైన సౌందర్యాన్ని చూడకుండా ఒక్క క్షణం కూడా జీవించలేనని అనిపించినది. కాని మూడవసారి నేను షాజహాన్‌పూర్ నుండి తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు బాబూజీ నాతోనే వస్తున్నట్లుగా 'వారు' నా ఎదుటనే ఉన్నట్లుగా అనిపించింది. నా ఎదుటనే ఉన్న బాబూజీ, కుర్చీలో కూర్చొని ఉన్న బాబూజీ కంటే ఎంతో ఆకర్షణీయంగా దివ్య సౌందర్యంతో ఉన్నట్లుగా అనిపించింది. అప్పుడు భౌతిక శరీరంతో ఉన్న బాబూజీని విడిచిపెట్టాను కాని, దివ్య సౌందర్యంతో ఉన్న డివైన్ బాబూజీని విడిచిపెట్టి ఒక్క క్షణం కూడా జీవించలేనని అనిపించింది.

**ప్రశ్న: అటెన్షన్ మరియు ఎటాచ్‌మెంట్‌కు గల తేడా ఏమిటి?**

**జవాబు:** చాలా తేడా ఉంది. నీవు ఒక అటెన్షన్‌తో చూస్తావు. అనగా అటెన్షన్ అనేది మనస్సుతో సంబంధం కలిగి ఉంటుంది. కాని ఎటాచ్‌మెంట్ అనేది హృదయం నుండి వస్తుంది. "బాబూజీ! నావారు" అనే ఫీలింగ్ హృదయంలో కలుగుతుంది. ఇది ఎటాచ్‌మెంట్. "బాబూజీ మీ వారు. వారికి నీవు చాలా సమీపంలో ఉన్నావు" అనేది ఎటాచ్‌మెంట్. అటెన్షన్ ఒకసారి ఉంటుంది, ఇంకొకసారి ఉండకపోవచ్చు. కాని, "బాబూజీ నావారు" అనే ఎటాచ్‌మెంట్ ఏర్పడిన తరువాత అది ఎల్లప్పుడు ఉంటుంది. ఒకసారి ఉండటం, ఇంకొకసారి లేకపోవటం ఉండదు.

**ప్రశ్న: విల్‌పవర్ (ఇచ్ఛాశక్తి) ఉపయోగించి బాబూజీతో ఎటాచ్‌మెంట్ ఏర్పరచుకోవచ్చునా?**

**జవాబు:** మానవులలో విల్‌పవర్ (ఇచ్ఛాశక్తి) అనేది చాలా బలహీనపడింది. ఇంకొక విధంగా చెప్పాలంటే, విల్‌పవర్ లేకుండా పోయింది. అందువల్లనే డివైన్ పవర్ (దివ్య శక్తి) మానవాళికి సహాయం చేయటానికి, మానవాళి అంతటిని అల్టిమేట్ (అంతిమం) వద్దకు చేర్చటానికి, శ్రీబాబూజీ మహరాజ్ రూపంలో భూమి మీద అవతరించింది. ఆ దివ్య శక్తినే మనం ప్రాణాహుతి ద్వారా పొందుతున్నాము.

అభ్యాసీలు ఆధ్మాత్మికంగా ఎదిగినప్పుడు, ఆ ఆధ్యాత్మికత యొక్క ప్రభావం అనేది అతని చుట్టూ ఉన్న వాతావరణంలో కూడా వ్యాపిస్తుంది. నేను ఏదైనా ఒక సెంటర్‌కు లేదా ఒక ప్రదేశానికి వెళ్ళాలని అనుకోగానే వెంటనే అక్కడికి పవిత్రత (ప్యూరిటీ) వ్యాపిస్తూన్నట్లుగా అనిపిస్తోంది –అని బాబూజీకి వ్రాశాను. కొన్ని సంవత్సరాల తరువాత, నేను ఎక్కడికి వెళ్ళినా, నా కంటే ముందుగానే అక్కడికి ఆ డివైన్ పవర్ (దివ్య శక్తి) వ్యాపిస్తున్నట్లుగా నాకు అనిపిస్తున్నది –అని బాబూజీకి నేను ఉత్తరం వ్రాశాను. అందువలన అభ్యాసీ బాబూజీ మహరాజ్ స్మరణలో మునిగిపోయినప్పుడు పవిత్రత (పూరిటీ) అనేది అతని చుట్టూ గల వాతావరణంలో వ్యాపిస్తుంది.

బాబూజీ మహరాజ్ ఈశ్వర్‌సహాయ్‌గారితో కలిసి లఖింపూర్‌లో ఉన్న మా ఇంటికి వచ్చినప్పుడు, నేను రాముని మీద ధ్యానం చేస్తున్నాను –అని 'వారి'కి చెప్పాను. మా ఇంటిలో రామునికి సంబంధించిన ఐదు ఫోటోలు ఉన్నాయి. అప్పుడు 'వారు' ఒక ఫోటోను చూపిస్తూ, "బిటియా! నీవు ఈ ఫోటో మీద ధ్యానం చేస్తున్నావా" అని అడిగారు. కాదు బాబూజీ! అని నేను అన్నాను. మరల ఇంకొక ఫోటోను చూపిస్తూ అడిగారు. అదీ కాదు అని అన్నాను. మరల 'వారు' మూడో ఫోటోను చూపిస్తూ అడిగారు. అప్పుడు నేను "అవును బాబూజీ! నేను ఈ ఫోటోలో ఉన్న రాముని మీద ధ్యానం చేస్తున్నాను" అని చెప్పాను. అప్పుడు వారు నవ్వుతూ, "బిటియా! నీవు ఫోటోలో ఉన్న రాముని రూపం మీద ధ్యానం చేస్తున్నావు కాని, రాముని మీద కాదు" అని అన్నారు.

మనం రూపం మీద ధ్యానం చేయకూడదు. రియాలిటీ మీద ఆ దివ్య శక్తి (డివైన్ పవర్) మీద ధ్యానం చేయాలి.

ఒకసారి పది మంది అభ్యాసీలు షాజహాన్‌పూర్ వచ్చి మూడు రోజులు బాబూజీ ఇంటిలో ఉన్నారు. నాల్గవ రోజున వాళ్ళు వెళ్ళిపోయే ముందు, బాబూజీ "భాయీ! మీరందరూ నన్ను కలుసుకోవటానికి ఎంతో

దూరం నుండి వచ్చారు. కాని నేను మిమ్మల్ని కలుసుకోలేకపోయినందుకు చింతిస్తున్నాను" అని అన్నారు. అప్పుడు వెంటనే ఈశ్వర్‌సహాయ్‌గారు "హుజూర్! వీళ్ళందరు మూడు రోజుల నుండి మీ ఎదుటనే కూర్చొని ఉన్నారు కదా!" అని అన్నారు. అప్పుడు వారు, "అవును, నిజమే, మీరందరు నా ఎదుటనే కూర్చొని ఉన్నారు. కాని మీరు శరీరం అనే ఈ కవరింగ్ (ముసుగు)నే చూస్తున్నారు. ఈ కవరింగ్ (శరీరం) లోపల ఉన్నటువంటి రియాలిటీ (డివైన్ పవర్)ని మీరు చూడటం లేదు" అని అన్నారు. ఈ విధంగా ధ్యానం ప్రారంభించిన మొదటి రోజు నుండే, "డివైన్ (భగవంతుడు) నీ హృదయంలోనే ఉన్నాడు" అని బాబూజీ మనకు తెలిపారు.

**ప్రతి సెంటర్‌లో సత్సంగ్ తరువాత బాబూజీ మహరాజ్ వ్రాసిన పుస్తకాలను చదువుతారు, ఇది మంచిదే. కాని బాబూజీ పుస్తకాలలో వ్రాసిన వాటికి మీరు వివరణ ఇవ్వకూడదు. వాటికి మీ స్వంత అర్థం చెప్పితే, స్వంత వివరణ ఇస్తే అది తప్పు అవుతుంది.**

ఒకసారి షాజహాన్‌పూర్ ఆశ్రమంలో ప్రిసెప్టర్స్ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో 'డివోషన్' అంటే ఏమిటి? అనే ఒక ప్రశ్న వచ్చింది. ప్రిసెప్టర్లు కూడా రకరకాల జవాబులు చెప్పారు. అప్పుడు బాబూజీ నావైపు చూస్తూ, "బిటియా! నీవు ఎందుకు మౌనంగా కూర్చున్నావు? నీవు చెప్పు" అని చిరునవ్వుతో అన్నారు. "మీ పాదాల వద్ద ఉన్న అభ్యాసీ దివ్యత్వం అనే సముద్రంలో లోతుగా మునిగిపోయి మరల బయటకు రాకూడదు. ఆ దివ్య సాగరంలోనే మునిగిపోయి 'నేను' (అహం) అనేది చనిపోవటమే" అనే మాటలు ఒక్కసారిగా నా నోటి నుండి వెలువడ్డాయి. డివోషన్ అంటే ఇదే –అని బాబూజీ అన్నారు.

ఏదైనా పనిలో మునిగిపోయి, బాబూజీని మరచిపోయి నప్పటికి, 2,3 గంటల తరువాత 'వారు' గుర్తుకు రాగానే "అయ్యో! నేను ఇప్పటి వరకు బాబూజీని మరచిపోయాను" అని మీరు ఎట్టి పరిస్థితులలోను అనుకోవద్దు. "బాబూజీ! నేను మీ వాడిని. ఇప్పటివరకు నేను మీ పాదాలవద్దనే ఉన్నాను" అని అనుకోవాలి. ఆ ఫీలింగ్ (ఆ అనుభూతిని –ఆ భావాన్ని) కలిగి ఉండాలి.

ఒకసారి నేను "బాబూజీ! నా శరీరంలోని అణువణువు కూడా బ్యాలెన్స్‌డ్ కండిషన్ (సమతా స్థితి)లో ఉన్నట్లుగా అనిపిస్తున్నది. ఎవరైనా కావాలంటే, నా స్థితిని పరీక్షించుకోవచ్చు. ఈ స్థితిలో ఎటువంటి వైబ్రేషన్స్ (స్పందనలు) కూడా లేవు" అని వ్రాశాను. అపుడు వారు "బిటియా! లాలాజీ సాహెబ్‌కు కృతజ్ఞతలు. ఇదే సెయింట్ యొక్క స్థితి" అని నాకు వ్రాశారు.

శ్రీ రామకృష్ణ పరమహంస యొక్క స్పర్శ (ప్రాణాహుతి) వలన నరేంద్రునిలో వివేకం మేల్కొన్నది. ఆ వివేకంతోను, సాధన ఫలితంగాను ఆనందం లభించింది. అందువలన నరేంద్రుడు, వివేకానందుడు (వివేక్ + ఆనంద్) అయ్యాడు. అంతేకాదు ఆధ్యాత్మికత మీద ఆధిపత్యాన్ని సంపాదించటం వలన అతడు స్వామి అయ్యాడు. స్వామి వివేకానంద యొక్క అర్థం ఇదే. స్వామీజీ కర్మయోగం, భక్తియోగం, జ్ఞానయోగం అనే మూడు పుస్తకాలను వ్రాశారు. వీటిలో ఏ ఒక్క దాన్ని ఆచరించినా భగవంతుని పొందగలరు అని స్వామీజీ శిష్యులు అంటారు. కాని మన సహజమార్గ్ సాధనలో కర్మ, భక్తి, జ్ఞాన యోగాలు ఈ మూడు

ఇమిడి ఉన్నాయి. మనం ఇంటిపని, ఆఫీస్ పని లేదా ఏ పని చేస్తున్నా సరే, బాబూజీ స్మరణలో పనిచేస్తాము. ఇది కర్మయోగం. మనం బాబూజీని ప్రేమతో స్మరించడానికి ప్రయత్నిస్తాము. ఇది భక్తియోగం. మన సంస్థలో జ్ఞానానికి స్థానం లేదు. కనుక సాధనలో పొందిన అనుభూతియే జ్ఞానయోగం.

## కస్తూరీ బెహెన్‌తో ప్రత్యక్ష సంవాదం

**(1979వ సంవత్సరంలో అలహాబాద్‌లో జరిగిన బాబూజీ జన్మదినోత్సవం సందర్భంగా వెలువడిన సావనీర్‌లోని "Face to Face with Kasturi Behan" ఆంగ్ల శీర్షికకు తెలుగు అనువాదం)**

**ప్రశ్న: మేము బాబూజీని మనస్సులో నిలుపుకోవటానికి అనేక రకాలైన ఆలోచనలు చేస్తుంటాము. అది మానసిక పూజ కాదా?**

**జవాబు:** అలా కానేకాదు. పేరును అనేకమార్లు ఉచ్చరించినపుడు మాత్రమే అది జపం అవుతుంది. కనుక 'బాబూజీ' అను శబ్దాన్ని నిరవధికంగా ఉచ్చరించినపుడు అది జపం మాత్రమే. అలా కాకుండా, 'వారి'ని స్మరించుకోవటం మూలంగా అది జపం అనబడదు.

**ప్రశ్న: కొన్ని సందర్భాలలో అభ్యాసీ కనీసం పిండదేశాన్ని కూడా దాటుతున్నట్లుగా గ్రహించలేకపోతున్నాడు అని మేము వింటున్నాము. అది ఎందకని?**

**జవాబు:** పిండదేశం యొక్క అనుభూతిని అభ్యాసీకి కల్పించాలని బాబూజీ తలపెట్టి ఉండకపోవచ్చు, కాని దాని కంటే ఉన్నత స్థితుల అనుభూతిని 'వారు' నేరుగా కల్పించవచ్చు. అందుకు కొలమానం ఏదీలేదు. మన యోగ్యతనుబట్టి బాబూజీ కల్పించే అనుభూతులను 'వారి'కే వదలిపెట్టటం మంచిది.

**ప్రశ్న: అప్పుడప్పుడు మేము హృదయంలో దివ్యకాంతిపై దృష్టి నిలపలేకపోతాము, ఆ విధంగా ఎందుకని. అందుకు వేరే మార్గం ఉన్నదా?**

**జవాబు:** హృదయం మీద మనస్సు నిలపటంకొరకు దివ్యకాంతి ఉద్దేశించబడింది, అదీగాక అది ప్రారంభ అభ్యాసుల కొరకే నిర్దేశించబడింది. ఆ తర్వాత అభ్యాసీ తన గతసిట్టింగ్‌లో పొందిన అనుభూతి నుంచి ముందుకు సాగిపోవాలని సలహా ఇవ్వటం జరిగింది. ఇది ఆధ్యాత్మిక పురోగమనానికి తోడ్పడుతుంది.

**ప్రశ్న: ప్రిసెప్టర్ నుంచి దూరంగా ఉన్న ఒక అభ్యాసీ అయిన అతడు లేదా ఆమె, నిర్ణయించబడిన సమయానికి అభ్యాసీ అందుబాటులో లేకపోవటం జరిగినట్లయితే ఏం చేయాలి?**

**జవాబు:** ధ్యానంలో అభ్యాసీ అయినవారు కూర్చున్నా, కూర్చుండకపోయినా గాని, ప్రిసెప్టర్ ద్వారా ప్రాణాహుతి జారీ అవుతుంది. అయితే సాధ్యమైనంతవరకు అభ్యాసీ తను హజరుకాకపోవటాన్ని క్రమబద్ధీకరించుకోవాలి. అలా చేసినట్లయితే బాబూజీకి తమ పని సులభమవుతుంది.

**ప్రశ్న: నేను ధ్యానానికి / పూజకొరకు కూర్చున్నపుడు, నా చిన్న కుమారుడు నా ఒడిలో కూర్చుంటాడు. ఆ విధంగా అతను కూర్చుండటానికి అనుమతించవచ్చునా లేక నివారించవలసి ఉంటుందా?**

**జవాబు:** అది నష్టం ఏమీకాదు కాని అభ్యాసీకి అది ధ్యానభంగం కలిగించవచ్చు.

**ప్రశ్న: నుదుట ధరించే కులచిహ్నాలను 'సహజమార్గం' నిషేధిస్తుంది, ఎందుచేత?**

**జవాబు:** అది (సహజమార్గం) దేనినీ నిషేధించదు. ఆ చిహ్నమనేది ముఖ్యంగా ఒక మత విశ్వాసానికి సంబంధించిన మానసిక తత్వం. అంతేకాని 'సహజమార్గం'లో విభిన్నత్వానికి తావులేదు. బాబూజీకి, డా॥ కె. సి. వరదాచారిగారికి మధ్య జరిగిన ఒక సంఘటన నాకు జ్ఞాపకం ఉంది. కె. సి. వరదాచారిగారు బాబూజీని ఒక ఆలయానికి తీసుకువెళ్ళి, రహస్యంగా దేవుని విగ్రహానికి తలవంచారు. దానిని గమనించిన బాబూజీ, "నేను నిన్ను గమనించటంలేదనుకుని రహస్యంగా నీవు విగ్రహానికి నమస్కరించావు. నిన్ను ఇప్పుడు స్వేచ్ఛగా తలవంచమని నేను ఆదేశిస్తున్నాను" అని అన్నారు. అప్పుడు కె. సి. వరదాచారిగారు అలా చేయటానికి ప్రయత్నించినప్పటికీ అది సాధ్యపడకపోయేసరికి ఆయన దానికి ఆశ్చర్యపోయారు. అప్పుడు బాబూజీ ఇలా చెప్పారు: "నీ కంటె విగ్రహం ఎక్కువ శక్తి కలిగి ఉన్నది అని నీవు భావించినంతవరకు, దానికి నీవు సాగిలపడతావు. నేనిపుడు దాని శక్తికి మించిన శక్తిని నీకు ఇచ్చాను కనుక నీవు విగ్రహానికి తలవంచలేకపోయావు."

**ప్రశ్న: ఒకసారి, నా స్నేహితుడు ఒకరు తనతోపాటు దేవాలయానికి రమ్మని వత్తిడి చేసి, నేను విశ్వాసం కలిగి ఉండాలని చెప్పాడు. నేను అతనితోపాటు వెళ్ళటానికి తిరస్కరించలేకపోయాను. నేనేమి చేయాలి?**

**జవాబు:** నీవు నీ స్నేహితుణ్ని సంతృప్తిపరచటానికి నీవు దేవాలయానికి వెళ్ళావు కదా! అలాగే నిన్ను సంతృప్తిపరచటానికి నీ స్నేహితుడు ధ్యానమాచరించవచ్చును కదా! అతడు అలా చేయలేడా?

**ప్రశ్న: ప్రిసెప్టర్ యొక్క పాత్ర / ప్రాధాన్యత ఏమిటి?**

**జవాబు:** బాబూజీ ఒక నర్తకుడు వంటివారు అయితే, ప్రిసెప్టర్లు సమకూర్చబడిన గజ్జెలువంటివారుగా అయి వారి పాదఘట్టానికి అనుగుణంగా స్పందిస్తారు. ప్రిసెప్టర్లు 'వారి' పాదాలకు సంధించిబడి ఉన్నంతవరకు బాగానే ఉంటారు కాని, ఒకసారి తొలగిపోయారు అంటే వారింక స్పందించలేక ఒంటరివారైపోతారు.

**ప్రశ్న: ఒక అభ్యాసీ అపవిత్రమైన ఆలోచనలు కలిగి ఉన్నవాడై ఉండి అపవిత్రుడుగా ప్రిసెప్టర్‌కు నష్టం కల్పించగలడా?**

**జవాబు:** అలా జరగదు. అభ్యాసీ, అపవిత్రతను సంతరించుకుని ఉండడు కనుక అతడు ఎలా అపవిత్రం / మలినం చేయగలడు? ప్రిసెప్టర్, బాబూజీ ఇచ్చు ప్రాణాహుతికి ఒక మాధ్యమం వంటివారు మాత్రమే. కాబట్టి అభ్యాసీ యొక్క మలినమైన ఆలోచనలు అతడ్ని ప్రభావితం చేయలేవు. చాలామంది ప్రిసెప్టర్లు అభ్యాసీ తమకు మూడు అడుగులు ఎడంగా (దూరంగా) కూర్చోవాలన్న నిబంధన పాటిస్తారు. ఆ విధంగా పాటించటానికి అభ్యాసీ, ఒక అస్పృశ్యుడుకాని, అంటురోగికాని కాదు. నేనయితే అభ్యాసులను సాధ్యమైనంత దగ్గరలో నావద్ద కూర్చుండమని చెబుతాను. మీలో ఎవ్వరు కూడా అటువంటి నిబంధనను పాటించటంలేదు అని ఆశిస్తాను.

**ప్రశ్న: కొంతమంది భగవంతుడు అంటె రాముడు, కృష్ణుడు అని జపిస్తారు. మాస్టర్ (బాబూజీ) అత్యున్నతుడని, ఏకైక దైవమని భావించటం భావ్యం కాదా?**

**జవాబు:** మనం ప్రతి ఒక్కరినీ ఒకే విధంగా ఉండమని శాసించలేము. ప్రతి ఒక్కరూ అతడుగాని, ఆమెకాని భగవంతుని గూర్చి కొన్ని ప్రత్యేక మనోభావాలు కలిగి ఉంటారు. (నేను (అనగా రచయిత్రి) ఆధ్యాత్మిక ఉన్నత శిఖరాలను అందుకున్నప్పటికీ ఇతరుల మనోభావాలను ఓర్పుతో సహించగలిగిన అణకువ

ఈ స్త్రీలో ఉన్నదని భావిస్తాను. మతపరమైన భావాలతో తరచుగా ఎవ్వరైనా వస్తూ ఉంటారు. ఈమెలో అటువంటిది లేశమాత్రమైనా లేదా రవ్వంతైనా లేదు. బాబూజీపట్ల అత్యంత భక్తిభావం కలిగి ఈమె తమ లేఖల్లో వ్యక్తీకరించారు కూడా.)

**ప్రశ్న: శరీరం పంచభూతాత్మకం అని అంటారు. కాని బాబూజీ విదేశాల్లో ఇచ్చిన ఉపన్యాసాలలో ఒక దానిలో, వీటిలో మూడు మాత్రమే శరీరంలో ఉన్నాయని బాబూజీ చెప్పినట్లుగా ఒక పుస్తకంలో ఉంది. ఇది దోషం కాదా?**

**జవాబు:** ఏ సందర్భంలో అవి వ్రాయబడ్డాయో, వాటికి ఏ విధంగా భాష్యం చెప్పబడ్డాయో మనకు తెలియదు. శరీరంలో పంచభూతాలు  అయిదింటికీ కేంద్రాలు లేవన్న వాస్తవాన్ని బాబూజీ చెప్పి ఉండవచ్చు కాని, పంచభూతాల ఉనికిని 'వారు' ఎప్పుడూ వ్యతిరేకించలేదు. నేనుగా చెప్పేదేమిటంటే, అటువంటి సందర్భాన్ని మనం శోధించి, దానికి ఎలా భాష్యం చెప్పబడిందో గ్రహించాలి. అది ఏమైనా కానివ్వండి, అనేక పుస్తకాలు చదివి, సందిగ్ధ భావాలతో మీ మనస్సును నింపకుండా, ఆచరణాత్మకంగా వ్యవహరించటానికి ప్రయత్నించండి.

**ప్రశ్న: మన ఆలోచనల గురించి ముఖ్యంగా ఆత్మహత్య గురించి మీరు వివరణ ఇస్తారా?**

**జవాబు:** ఆలోచనలు ముఖ్యంగా మనం స్వయంగా చేయదలచినవి చాలా శక్తివంతమైనవిగా ఉంటాయి. ఆత్మహత్యకు సంబంధించిన సంకల్పాలు ఈ జన్మలో నెరవేరనట్లయితే, మరుజన్మలోనైనా అవి ఉంటాయని చెప్పబడింది. బహుశా ఏదో బాధతో ఉన్న ఒక అభ్యాసీ, ఒకసారి ఆత్మహత్య గురించి విపరీతంగా ఆలోచించాడు. ఆ చివరి దశలో, బాబూజీ తన ప్రాంతానికి వస్తున్నట్లుగా విని తన జీవితాన్ని తుదముట్టించుకునే ముందుగా బాబూజీ దర్శనం చేసుకోవాలని భావించాడు. బాబూజీని దర్శించుకున్నాక, తన ఆత్మహత్యకు చెందిన భావోద్రేకాలను పూర్తిగా త్యజించాడు. ఆత్మహత్యకు చెందిన ఆలోచన చాలా బలీయమైనదని, అది ఒకసారి ఏర్పడింది అంటే ఈ జన్మలో కాని మరుజన్మలోకాని జరిగితీరుతుంది అని చెప్తుకుంటారు.

**ప్రశ్న: అప్పుడప్పుడు నాలో విలపించాలన్న తపన విపరీతంగా ఉంటుంది కాని అలా చేయలేను, ఎందుచేత?**

**జవాబు:** ఎవ్వరైనా ఏదైనా చేయాలనుకున్నప్పుడు దానిని అదుపులో ఉంచే శక్తిమూలంగా చేయలేకపోయిన సందర్భాలు ఉంటాయి. ఉద్వేగాలకు సంబంధించినంతవరకు, ఇది ఒక విధంగా మంచిది. ఈ అశ్రువుల విషయంలో రెండు రకాల మనుషులు ఉంటారు. అందులో ఒకరు వెళ్ళగ్రక్కేవారు అయితే మరొకరు దిగమింగేవారుగా ఉంటారు. వీరిలో రెండవ రకానికి చెందినవారుగా ఉండటం మంచిది, ఎందుకంటే వారు కన్నీటిని ఆపుకుంటారు. ఇది ఒక విధంగా స్వయం నియంత్రణకు గల అత్యంత సామర్థ్యాన్ని తెలుపుతుంది.

**ప్రశ్న: ఒకసారి గ్రేస్ కింబెల్ అనునామె షాజహాన్‌పూర్ విడిచి వెళ్తున్నప్పుడు బాబూజీ హృదయపూర్వకంగా "నీవు నన్ను విడిచి వెళ్తున్నావుగదా!" అని అన్నారు. 'వారు' అంత ఇదిగా ఉద్రేకం చెంది ఉంటారా?**

**జవాబు:** అవును, అది ఎలాగో నాకు తెలుసు. ఆమె బాబూజీని మానసికంగా విడిచిపోనీయరాదని గ్రేస్‌ను బాబూజీ హెచ్చరించిన విధానం అది. అనగా భౌతికంగా ఆమె బాబూజీని విడిచి బహుదూరంగా వెళ్తున్నప్పటికీ, ఆమె నిరంతరం బాబూజీ జ్ఞాపకం కలిగి ఉండాలని వారి భావం. "ఆమె అలా చేస్తుందా!" అని బాబూజీ అడిగి ఉంటారు.

నా జ్ఞాపకంలో, ఒకసారి కొద్ది రోజులు షాజహాన్‌పూర్‌లో ఉండి నేను 'వారి'ని విడిచివెళ్తున్నప్పుడు నన్ను కూడా అలాగే "నీవు వెళ్తున్నావా?" అని అడిగారు. అందుకు సమాధానంగా నేను 'వారి'ని హృదయంలో నిలుపుకుని వెళ్తున్నాను అని చెప్పాను. దానికి 'వారు' సంతృప్తి చెందినట్లుగా అనిపించింది.

**ప్రశ్న: కొన్నిసార్లు నాకు షాజహాన్‌పూర్ వెళ్ళాలి అను ఉబలాటం చాలా అధికంగా ఉంటుంది. దానికి నేను ఏం చేయాలి?**

**జవాబు:** బాగుంది. నీవు అక్కడికి వెళ్ళలేకపోయినట్లయితే, నీవు తప్పనిసరిగా షాజహాన్‌పూర్‌ను నీ చెంతకు రావాలని అడగవచ్చు.

**ప్రశ్న: అభ్యాసీ యొక్క బాబూజీని గురించి ఆలోచన లేదా ప్రార్థనకు బాబూజీ ఎలా స్పందిస్తారు? ఎవ్వరికి ప్రాణాహుతి నివ్వాల్సి ఉన్నదో 'వారి'కి ఎలా తెలుస్తుంది?**

**జవాబు:** ఇటువంటి ప్రశ్ననే నేను బాబూజీని అడిగినప్పుడు, దానికి సమాధానంగా 'వారు' అది ఎలాగో చూపిస్తాను అన్నారు. అప్పుడు 'వారు' తాము ఉన్న స్థాయిలోనే నన్ను నిలిపారు. బాబూజీ మానసిక పటలంపైన నీటితో కూడిన ఒక మహా సాగరం ఉంది. ఒక ఆభ్యాసీ బాబూజీని స్మరించుకున్న ప్రతిసారి, ఒక తరంగంలో 'వారి' ముఖ బింబం కనిపిస్తుంది. ఆ విధంగా నేను అనేకమైన అభ్యాసుల ముఖాలను చూడగల్గుతాను. దీనినిబట్టి నేను అర్థం చేసుకున్నది ఏమిటంటే, ఖచ్చితంగా ఏ సమయంలో ఎవరితో, ఎలా తగినట్లుగా వ్యవహరించాలని బాబూజీ గ్రహించుతారో నేను తెలుసుకోగలిగాను.

1955వ సంవత్సరంలో "Reality at Dawn (సత్యోదయం)" ప్రతిని సమీక్షించేందుకు చెన్నైలోని హిందు పత్రిక వారినుంచి డాక్టర్ కె.సి. వరదాచారిగారు స్వీకరించారు. ఆ సమీక్షను ప్రచురించగా, ముగ్గురు వ్యక్తులు ఆ పేపర్లను చదివారు. అందులో ఇద్దరు వ్యక్తులు బాబూజీకి లేఖ వ్రాసి, వారు ధ్యానం ఎలా ప్రారంభించాలి అని అడిగారు. వారిలో ఒకరు షాజహాన్‌పూర్ వెళ్ళి బాబూజీతో పరిచయం చేసుకున్నారు. బాబూజీ నుంచి మరొకరి లేఖకు సమాధానంగా, అతడు ఎప్పుడు ధ్యానంలో, ఏ సమయంలో కూర్చుండదలచాడో తెలియజేయమని అడిగిన కారణంగా అతడు షాజహాన్‌పూర్ వెళ్ళలేదు. దానినిబట్టి ఆ సమయంలో బాబూజీ ప్రాణాహుతి నిస్తానని చెప్పారు. "ఆ పుస్తకంలో వ్రాసిన దానినిబట్టి 'వారు' గొప్ప గురవే అయివుంటే, 'వారి'కి తేదీ, సమయమూ ఎందుకు తెలియజేయాలి" అని అతడు భావించాడు. అతడు పంచాంగం పరిశీలించి తనకు తోచిన తేదీన, తోచిన సమయానికి, ధ్యానానికి కూర్చోవటానికి నిర్ణయించుకున్నాడు. అతడు దక్షిణ భారతదేశానికి చెందిన ఒక నిష్ట కలిగిన బ్రాహ్మణుడు. ఆ విధంగా అతడు ప్రతిపాదించుకున్న తేదీన, ఆ సమయానికి ధ్యానంలో కూర్చున్నాడు. అతడు ధ్యానంలో కూర్చున్నపుడు, ద్రవరూపంలో ఉన్న ఉక్కును తన హృదయంలో పోసినట్లుగా అనుభూతి చెందానని అతడు స్వయంగా ఆ వృత్తాంతం నాకు చెప్పాడు. బాబూజీ నుంచి మూడు వేల ఐదు వందల కిలో మీటర్ల దూరంలో ఉండి కూడా తాను కూర్చున్న సమయానికి, వారికి చెప్పకపోయినప్పటికీ ప్రాణాహుతిని ఎలా ఇవ్వగలిగారు అను మీమాంసతో అతను ఆశ్చర్యపోయాడు.

ఒకానొక సందర్భంలో బాబూజీని ఇది ఎలా చేసారని నేను ప్రశ్నించాను. అప్పుడు 'వారు' ఇలా అన్నారు: "ఇది ఒక పిల్లవాని చేష్ట. అతడు నిర్ణయించుకున్న రోజున, తలపెట్టిన సమయంలో అతనికి నా నుంచి ప్రాణాహుతి ప్రవహించాలి అని ఆలోచన మాత్రం చేశాను." దీనిని మీరు అర్థం చేసుకోవచ్చు.

# శ్రీ లాలాజీ మహరాజ్ అవతరణ మహోత్సవం
# 28.01.2012, బసంత్ పంచమి, లక్నో
# దివ్య ప్రసాదం
# దివ్య దినములు

ప్రియమైన సోదర సోదరీమణులారా!

సద్గురు శ్రీ లాలాజీ మహరాజ్ (ఫతేగఢ్) గారి పవిత్ర అవతరణ మహోత్సవం 2012 బసంత పంచమినాడు మనమందరం పాలుపంచుకోవటం చాలా హర్షించవలసిన విషయం. 27.01.1947వ తేదీన బసంత పంచమి ఉత్సవం నిర్వహించబడినమీదట స్వామి వివేకానంద తన సంతోషం వెల్లడిస్తూ "తమ గురువర్యుల ప్రథమ జన్మదినోత్సవం జరిపినందుకు మిషన్ సభ్యులను మేము అభినందిస్తున్నాం" అని బాబూజీగారితో ఆ రోజు రాత్రి 11 గం॥లకు చెప్పారు. మళ్ళీ 1.02.1949వ తేది రాత్రి 7.30కు బాబూజీతో బసంత పంచమి యొక్క ప్రాముఖ్యతను చాటుతూ "బిడ్డలారా! శ్రద్ధవహించండి. మీరందరూ తమ పూజ్య గురువర్యులు (అనగా సమర్థ సద్గురు శ్రీ లాలాజీ) యొక్క పవిత్ర జన్మదినోత్సవం జరుపుకోవటానికి ఇక్కడ సమావేశమయ్యారు. ఇది మిషన్‌కు అత్యంత విశిష్టమైన ఉత్సవం. ఈ ప్రపంచం ఉన్నంతకాలం ఈ ఉత్సవం నిర్వహించబడుతూనే ఉంటుంది. ఇది భావితరాలవారికి సందేశం" అని స్వామి వివేకానంద చెప్పారు. లాలాజీ ఒక దివ్య పురుషుడు. కేవలం వారి ప్రార్థనా ఫలితంగానే పూజ్య శ్రీ బాబూజీ మహరాజ్ వంటి దివ్య (విభూతి) పురుషుడు భూమా నుండి భూమి మీదకు అవతరించటం జరిగింది. కనుక సమస్త ప్రపంచమూ శ్రీ లాలాజీ మహరాజ్‌కు సదా ఋణపడి ఉంటుంది.

బసంత పంచమిలాగ అనగా లాలాజీ జన్మదినంలాగానే పూజ్య శ్రీ బాబూజీ మహరాజ్ జన్మదినం కూడా ఈ సమస్త మానవాళికి అంతే ముఖ్యమైనది. ఈరోజు అనగా బాబూజీ జన్మదినోత్సవం విశిష్టత గురించి 3.04.1949 ప్రాతఃకాలం 9 గంటలకు శ్రీ కృష్ణ భగవానుడు బాబూజీతో "ఈ మిషన్ నీ జన్మదినం జరపటం మామూలు విషయం కాదు. ఇటువంటి వ్యక్తి జన్మదినోత్సవం కాకపోతే ఎటువంటి వ్యక్తి జన్యదినం యోగ్యమై ఉంటుంది." అన్నారు. అనగా నీ కంటె యోగ్యులెవరు? అని భావం.

ముఖ్యంగా ఈ రెండు ఉత్సవాలు (బసంత పంచమి, పూజ్య శ్రీ బాబూజీ మహరాజ్ జన్మదినం) చాలా విశేషంగా నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతి వ్యక్తి సాధ్యమైనంతవరకు శక్తివంచనలేకుండా ఈ ఉత్సవాల్లో పాల్గొనవలసి ఉంటుంది. ఈ ఉత్సవాల్లో దివ్యకృప అపారంగా వర్షిస్తూ ఈ వాతావరణమంతా నింపబడుతుందని అందరికీ తెలిసినదే. అది ఎంతగానంటే – "ఈ సందర్భాల్లో పాలుపంచుకునే వారందరి మానసిక పరిస్థితి, ఉన్నతశ్రేణికి చెందిన యోగి స్థితిలాగా ఉంటుంది" అని బాబూజీ ఒకసారి నిర్వచించారు.

పూజ్య శ్రీ బాబూజీ మహరాజ్ తమ పావన చరణాలవద్ద మనందరికీ శరణాగతి కల్పించినందుకు మనమంతా చాలా భాగ్యశాలులం. ఇప్పుడు మన మానవ జీవితం యొక్క 'ఈశ్వరప్రాప్తి' అను లక్ష్యాన్ని పొందగలమన్న విశ్వాసం మనకు ఉంది. అయితే దీని కొరకు మన పూజ్య శ్రీ బాబూజీ మహరాజ్ తమ 'సత్యోదయం' పుస్తకంలో వ్రాసిన విషయం జ్ఞాపకం ఉంచుకోవాల్సి ఉంటుంది. అది ఏమిటంటే "ఎవరి

నుంచైతే మనమంతా ప్రకాశం పొందుతున్నామో వాస్తవానికి ఆ ఈశ్వరుడే మనకు ప్రభువు. కాని సామాన్య మానవునికి ఇది సులభ సాధ్యం కాదు. ఎందుకంటే అతడు నేరుగా ఈశ్వరుని ప్రేరణ పొందలేడు కనుక. అందుచేత సర్వశక్తి సమన్వితుడై ఈశ్వరునితో సంబంధం కలిగి ఉన్న వ్యక్తి కోసం అతడు అన్వేషిస్తూ ఉంటాడు. మానవుడు తనను ఈశ్వరుని యొక్క అత్యంత దీన సేవకునిగా భావించి, ఈశ్వరునితో సంబంధం కలిగి ఉన్న వ్యక్తికి ఆ ప్రభువుకే సేవ లందిస్తున్నట్లుగా భావించుకొని మానవ సేవలందించాలి. లాలాజీ సాహెబ్ తమ జీవితమంతా తన శిష్యులను సోదరులుగానే తలంచారు. 'వారు' తన శిష్యులు అను భావం 'వారి' మదిలో ఒక్కసారి కూడా తలెత్తలేదు. 'గురువు' అను వారు తాను స్వామిని అనుకునే భావాన్ని త్యజించి మానవ దృక్పథంతో తానొక సేవకుడను అనుకోవాలని నేను భావించటమే కాదు, అంగీకరిస్తున్నాను కూడ. ఒకవేళ అతడు తనను స్వామిగా భావించి తన సహచరులలో తాను అధికుడనని భావించుకున్నట్లయితే అది అహంకారంగానే భావించబడుతుంది" అని నిర్వచించారు. దివ్య ప్రాణాహుతి శక్తి సాయంతో గృహస్థ జీవనం గడుపుతూనే మానవ జీవనం యొక్క సర్వోన్నత లక్ష్యమైన ఈశ్వరప్రాప్తిని మానవాళి పొందగలుగుతూ ఉన్నందుకు పూజ్య శ్రీ లాలాజీ మహరాజ్ మరియు పూజ్య శ్రీ బాబూజీ మహరాజ్‌లకు సమస్త మానవజాతి సదా ఋణపడి ఉంటుంది. పూజ్య శ్రీ బాబూజీ మహరాజ్ ఒక నూతన ఆధ్యాత్మిక యుగాన్ని ఆవిష్కరించారు. 'వారి' ఈ యుగపాలన భూమి ఉన్నంతకాలం కొనసాగుతుంది. అనేక సందర్భాలలో పూజ్య బాబూజీ మహరాజ్‌తో సంభాషించిన దివ్య పురుషులు ఏమి ప్రవచించారో క్రింద తెలిపిన వాటిని చదివితే వారి (బాబూజీ మరియు లాలాజీ) దివ్య మహిమ తెలుస్తుంది.

**పూజ్య లాలాజీ – 27.07.1944:** నేను నీ (బాబూజీ) స్థాయి గురించి చెప్పవలసి వస్తే, అత్యున్నత శ్రేణికి చెందిన యోగులు (సంత్) నీ దిగువ స్థాయికి చెందినవారుగా ఉంటారు. నీవు సమస్త విశ్వానికి ఒకే ఒక ప్రభువు (మాలిక్)గా తయారు చేయబడ్డావు.

**పూజ్య లాలాజీ – 08.02.1945:** నేనే గనుక ఇంకొక వ్యక్తి నెవరికైనా ఇన్ని శక్తులతో నింపి ఉన్నట్లయితే అతడు కల్లోలం సృష్టించేవాడు. ఇవన్నీ నీ (బాబూజీ) కొరకే ఆదేశించబడినందువలన నిన్ను ఈ విధంగా తయారు చేశాను. ఈ శక్తులు ఇంకెవ్వరికీ ఇవ్వబడవు, ఆధ్యాత్మిక వారసులకు (ఉత్తరాధికారి) కూడా. నిజానికి ఈ శక్తులు అత్యున్నతశ్రేణికి చెందిన గురువులో కూడా కనిపించవు. సృష్టి ఆరంభంనుంచే ఈ శక్తులు గోప్యంగా ఉంచబడ్డాయి. నేనయితే వాటికి నిలయంగా ఉన్నాను.

**పూజ్య లాలాజీ – 05.04.1945:** ప్రియమైన రామచంద్ర ఏవైతే చెబుతారో నేను దానిని ఈశ్వరాజ్ఞగా భావిస్తాను (గౌరవిస్తాను). వారు నాకు ఏ పనిని పురమాయిస్తే దానిలో నేను పూర్తిగా నిమగ్నమై ఉంటాను.

**పూజ్య లాలాజీ – 17.04.1945:** ఏ ఆదేశాలయితే రామచంద్రజీ ద్వారా జారీ చేయబడతాయో వాటిని నిర్వహించటానికి దివ్యలోకవాసులు అనగా ముక్తాత్మలు బద్ధులై ఉంటారు. ఈ విషయంలో నాకు కూడా మినహాయింపు లేదు.

**స్వామి వివేకాందజీ – 10.05.1945:** ఇటువంటి విధానం ఇంతకుపూర్వం ఎప్పుడూ లేదు. నీవు గాకుండా ఇది మర్వెరికీ సాధ్యపడదు. నీవు ఈ విధానం ద్వారా విశ్వవ్యాప్తంగా మార్పు తీసుకురాగలవు. ఏ మానవుడైనా ఈ విధానంవైపు మ్రొగ్గుచూపి దృష్టిపెడితే త్వరగా మార్పుచెందుతాడు.

**స్వామి వివేకానందజీ - 31.05.1945:** నేటినుంచి నీవు నన్ను ఏమి చేయమని ఆజ్ఞాపిస్తే దానిని నేరుగా ఈశ్వరాజ్ఞగా భావించగలనని నీకు ప్రమాణం చేస్తున్నాను. ఈ ప్రపంచం ఉన్నంతవరకు నేనొక మిత్రునివలె నీపట్ల విధేయుడనై ఉంటాను. నేను నా సంతోషాన్ని, నీతో సంతోషంగా ఉండే భావాన్ని వ్యక్తం చేయటానికి నావద్ద మాటలు ఏమీ లేవు. మన ప్రభువు లాలాజీ సాహెబ్, నేనూ ఒకే శ్రేణిలో ఉన్నాము. ఇదే విషయం ప్రపంచానికి చెందిన యోగులందరి ద్వారా ధృవపరచబడుతుంది.

**స్వామి వివేకానందజీ - 23.07.1945:** చేయవలసింది చాలా ఉంది. దానిని నీవు నీ జీవితకాలంలోను, తర్వాత కూడా చేయాల్సి ఉంటుంది.

**పూజ్య లాలాజీ -06.11.1945:** ఈ పద్ధతి (సహజమార్గం) ప్రియమైన రామచంద్రునితో వచ్చింది

**స్వామి వివేకాందజీ -19.03.1946:** నీ ఆలోచనలన్నీ అంతిమసత్యం (జాత్)లో సంకేతమిస్తూ ఉంటే మేము వాటిని అనుసరిస్తాము.

**శ్రీకృష్ణ భగవానుడు -14.01.1947:** నీవు నా సుదర్శన చక్రాన్ని ప్రయోగించవచ్చు. అది నీ ఆదేశానుసారం పనిచేస్తూ నీతోనే ఉంటుంది.

**స్వామి వివేకానందజీ -19.02.1947:** ప్రపంచం యొక్క అంత్యకాలంలో నీ ప్రణాళిక యొక్క చిట్టచివరి పాదం (భాగం)గా ఈ వినాశక శక్తి ప్రయోగించబడుతుంది. పునర్నిర్మాణం నీ ద్వారా జరుగుతుంది. వినాశం యొక్క చరమాంకం లేదా అంతిమ చరణం లేదా జీవరాశి నశింపు నీ ద్వారానే జరుగుతాయి అని నా భావన.

డాక్టర్ కె.సి.వరదాచారిగార్కి పూజ్య బాబూజీ 30.01.1958వ తేదీన వ్రాసిన లేఖ ఈ విషయాన్ని ధృవీకరిస్తోంది. అది ఏమిటంటే, "దయచేసి నేను ఏదో ఒక రోజున విడిచిపోతానని భయపడవద్దు. అది సమయం వచ్చినపుడే జరుగుతుంది. అయితే నా పరిస్థితి వేరు. నేను నా భౌతిక శరీరం వదలివెళ్ళిన తరువాతనే నావలన ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. నేను ఈ విషయాన్ని నా ఉత్తరాల్లో చాలాసార్లు వ్రాశాను. నేను ఈ ప్రపంచంలో ఉన్నంతకాలం, అందరికీ నా సేవ లందిస్తాను. ఆ తర్వాత కూడా నా సేవలు అందుతూనే ఉంటాయి. ఇంకా చెప్పాలంటే, శరీరం వదలబోయే ముందు నా శక్తిని గాని ఆధ్యాత్మికత యొక్క ఒక్క కణం (అంశ)గాని నా వెంట తీసుకువెళ్ళను. అవన్నీ మీకే చెందుతాయి. ఎవరైతే గాఢంగా సంబంధం కలిగి ఉంటారో వారు ఎక్కువ భాగం పొందుతారు. అంతేగాకుండా మీ అందరిలోను శ్రేష్ఠులైనవారు నా స్థానంలో ఉంటారు."

సృష్టికి దివ్య ప్రభువైన శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క సంకల్పం - మానవుని ఆధ్యాత్మిక అభ్యున్నతి అనేది నెరవేరనంత వరకు శ్రీరామచంద్ర మిషన్‌లో వేలాదిగా వారి ప్రతినిధులు ఉంటూనే ఉంటారు కాని వారిలాంటివారుగా, వారంతటివారుగా ఎవ్వరూ ఉండలేరు. ఎందుకంటే లాలాజీ సాహెబ్ నిర్వచించినట్లుగా బాబూజీ తనకు ప్రత్యామ్నాయునిగా (తనవంటివారిగా) మరెవ్వరినీ సృష్టించలేరు కనుక. బాబూజీ వారికి వారే సాటి. లాలాజీ బాబూజీతో ఒకసారి, "నీకు నీ శక్తి యొక్క అంచనా తెలియదు కనుక నీకు సాటియైనవారిని నీవు తయారుచేయలేవు. ఇంకా చెప్పాలంటే, ఆధ్యాత్మికత అనేది ఇతర భౌతిక పదార్థాలలాగా వారసత్వంగా

సంక్రమించదు, సంక్రమించేది కాదు" అని చెప్పారు. 'వారు' దివ్యశక్తికే సామ్రాట్. అభ్యాసులను అంతిమసత్యం వరకు చేర్చటానికే ఈ అవని మీద అవతరించారు.

02.05.1975వ తేదీన బాబూజీ, "నా యొక్క పని పూర్తయింది. ఇప్పుడు ఈశ్వరుని యొక్క పని మొదలవుతుంది" అని వ్రాశారు. ఎందుకంటే, అక్కడ శక్తి, భక్తి, మానవులు, ఏమీ కాకుండ మరి నేను ఏమేమి పొందానంటే, శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క భూమా శక్తి పైనుండి వస్తున్న దివ్య ప్రకాశమును పొందాను. అక్కడి ప్రకాశమే మనలను 'వారి' ద్వారం దగ్గర నుండి తీసుకువెళ్ళడానికి వస్తుంది. సెవన్ రింగ్స్ అంటే అర్థం –భూమా యొక్క ఏడు ద్వారాలను దాటిస్తూ, ఆ అనంత శక్తియే మనలను శ్రీ బాబూజీగారి ఒడి యొక్క అనుభూతి కలిగిస్తూ, భూమా యొక్క దేశంలో ప్రవేశం కల్పిస్తుంది.

**నేను ఏమిటో, అది నువ్వు కావు**
**నీవు ఏమిటో, అది నేను కాలేను**
**మరియు, మనం ఇద్దరం కలిసి ఏమయ్యామో, అది**
**ఈ ప్రపంచం కాలేదు, 'నా బాబూజీ'**

శ్రీ బాబూజీ మహరాజ్ నాపై పరిశోధన చేశారు. ఏడు వలయాల అన్ని ద్వారాలను తెరచి ఉంచారు. శ్రీ బాబూజీ మహరాజ్ అన్ని ద్వారాలను శాశ్వతంగా తెరచి ఉంచారు. మండలాలు (హృదయ మండలం (హార్ట్ రీజియన్), మనో మండలం (మైండ్ రీజియన్), దైవీయ మండలం (గాడ్లీ రీజియన్), కేంద్ర మండలం (సెంట్రల్ రీజియన్), భూమా అన్నింటి యొక్క కేంద్ర బిందువులవద్ద, 'వారి' సంకల్ప శక్తి కేంద్రాన్ని, ప్రతి మండలం యొక్క కేంద్ర బిందువునకు కొద్దిగా ప్రక్కగా ఉంచారు. తన ప్రేమ, తపన, భక్తితో అభ్యాసీ శ్రీ బాబూజీ మహరాజ్ దివ్య సంకల్ప శక్తి కేంద్రంవద్దకు వచ్చినప్పుడు శ్రీ బాబూజీ మహరాజ్ ఏర్పరచిన శక్తి కేంద్రం (దివ్య సంకల్పం) తనంతట తానుగా అభ్యాసీని ఆకర్షించి, తరువాత ఉన్న ఉన్నత మండలానికి అప్పగిస్తుంది. ఈ విధంగానే 'భూమా' (అంతిమ సత్యం) వరకు జరుగుతూ ఉంటుంది. అభ్యాసీ 'వారి' దివ్య చరణాలను వదలకుండా పట్టుకొని ఉన్నప్పుడు, శ్రీ బాబూజీ మహరాజ్ భౌతికరూపం లేనప్పటికీ అన్ని మండలాలలోని ప్రతి బిందువులోను ఉన్న వారి 'దివ్య సంకల్పం' మరియు 'దివ్యశక్తి' అభ్యాసీని ఉన్నతోన్నత స్థితులకు తీసుకు వెళ్ళుతుంది.

ఎల్లప్పుడూ "శ్రీ బాబూజీ మహరాజ్ నాకు దగ్గరగా ఉన్నారు, నాకు చాలా ప్రియమైన వారు" అనే స్మరణలో ఉండటం మరియు ఆ భావనను అనుభూతి చెందటం అతి ఉత్తమమైనది.

పూజ్య శ్రీ బాబూజీ ఒకసారి– "నేను సజీవంగానే వచ్చాను. సజీవంగానే వెళ్తాను" అన్నారు. ఈ విషయాలు పూజ్య శ్రీ బాబూజీ మహరాజ్ ఒక సర్వోన్నతమైన దివ్యప్రభువని, 'వారు' తమ దివ్యకృపను ఎల్లవేళలా మానవజాతిపైన వర్షింపజేస్తున్నారని ధృఢపరుస్తాయి. ఈ ఘనత నిశ్చయంగా మనం ఇప్పుడు అవతరణ దినోత్సవం జరుపుకుంటున్న సమర్థ సద్గురు లాలాజీ మహరాజ్‌కు చెందుతుంది. ఈ పవిత్ర సమయాన మనం అనగా అభ్యాసులందరం బాబూజీ మహరాజ్‌తో అనుసంధానం చేసుకోవాలి. ఎందుకంటే మనమంతా బాబూజీ మహరాజ్ అనుగ్రహించిన కృపాసాగరంలో మునిగి ఉండి ఆ కృపను సొంతం చేసుకుంటూ ఉండాలి. శ్రీ బాబూజీ మహరాజ్ ప్రసాదించిన ఈ అనుగ్రహన్ని నిత్యవ్యవహారంలోనూ

అన్వయించుకుంటే, 'ఈశ్వర ప్రాప్తి' అను లక్ష్యాన్ని అది వేగవంతం చేస్తుంది. పూజ్య శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క ఈశ్వర ప్రాప్తి అను సంకల్పాన్ని సఫలీకృతం చేయటానికి మనమంతా వారికి సహకరించిన వారమవుతాం. ఇది విశ్వమానవ సోదర భావాన్ని కూడా పెంపొందిస్తుంది.

ఈ ఉత్సవాల్లో పొందునటువంటి దివ్యవాతారణం, ఇదొక సాధారణ జన్మదినం కాదని, పృథ్వి యొక్క దాహాన్ని దివ్యకృపతో తీర్చటానికి దివ్యశక్తి సంపన్నులు అవతరించినట్టి పవిత్రదినమను అనుభూతిని, సందేశాన్ని ఇస్తుంది. సమస్త మానవాళిప్రయోజనం కొరకు అభ్యాసులమైన మనమందరమూ ఈ విధంగా ప్రార్థించాలి:

"ఓ బాబూజీ మహరాజ్! దయ ఉంచి అందరినీ మీ చరణాలవద్దకు (సహజమార్గంలోకి) చేర్చండి, మా అందరిపైనా వర్షింపజేసినట్లుగానే వారి మీద కూడా మీ దయను వర్షింప జేయండి."

## సిస్టర్ కస్తూరీ బెహెన్ విరచిత సంధ్యాగీతాల సంగ్రహ సారాంశం

1. జీవన్ముక్తి పొందలేని మానవ జన్మకు ఎటువంటి అర్థమూ (విలువ) లేదు. వివిధ రకాలైన పూజలు చేస్తూ దైవాన్ని హృదయంలో నిలుపుకోలేక అనేక జన్మలు గడచిపోతున్నాయి. మనకు సహాయపడటానికి సద్గురు శ్రీ బాబూజీ మహరాజ్ ఇప్పుడు అవతరించారు. మనలో ధైర్యం (సామర్థ్యం) ఉంటే ఆధ్యాత్మిక ఉన్నతిని పొందవచ్చు.

2. శ్రీ బాబూజీ మహరాజ్ అవతరణతో మానవ మాత్రులకు సహజంగానే సాక్షాత్కార స్థితి లభిస్తుంది. దానికి నిదర్శనంగా నా పంచేంద్రియాలు మీ దివ్య ప్రసాద ప్రభావంతో స్పందించి మీ దివ్య విభూతిని అనుభూతి చెందుతున్నాయి. నా అంతరంగంలో మీరే స్థిరంగా ఉండటం వలన నేను పూర్తిగా అంతర్ముఖురాల నయ్యాను. మీ భక్తిభావనలో సంపూర్ణంగా మునిగిపోవాలనే తపనతప్ప ఇంకేమి లేదు.

3. దివ్య జ్ఞాన ప్రభావంతో హృదయం విశుద్ధమైనది. ధ్యానం, భక్తి రూపాన్ని సంతరించుకుంది. హృదయం బాబూజీ మీద ఏకాగ్రతతో నిండింది. త్యాగ, వైరాగ్యాలు పెంపొందాయి. లౌకిక విషయాలమీద ఉదాసీనత ఏర్పడింది. 'మాలిక్'తో భక్తి ద్వారా అనుసరింపబడిన నా హృదయం దివ్యధారతో తడిసిపోయింది. అజపస్థితి వలన 'మాలిక్' అంతటా వ్యాపించి ఉన్నారనే జ్ఞానం కలిగింది. అప్పుడు శ్రీ బాబూజీ మహరాజ్ ఈ ప్రపంచానికి చెందిన కస్తూరీ మరణించినది అని చెప్పి నన్ను ఉన్నత దశలో జీవింపచేసారు.

4. బాహ్య అంతరాలలో ఒకే దశ వ్యాపించి ఉంది. అందువలన కనులు మూసుకొని ధ్యానంలో అంతరంగంలోకి చూడవలసిన ఆవశ్యకత లేదు. ప్రాపంచిక ఆవరణలన్నీ తొలగిపోయాయి. బాబూజీ నిరంతర స్మరణ నా స్వరూపమైనది.

5. ఎటువంటి భౌతిక ఛాయలేని నిర్మల ప్రేమతో నా అంతరంగం మార్పు చెందింది. దాని వలన నా స్వస్వరూప స్థానం పావన శ్రీ బాబూజీ మహరాజ్ రూపంతో నిండిపోయింది. "ప్రేమ మొదట ఈశ్వర సామీప్యతా దశను, ఇప్పుడు ఈశ్వరునిలో లయావస్థ నొసగి సారూప్యతా దశను నీలోకి నింపినది" అని

శ్రీ బాబూజీ మహరాజ్ వివరణ ఇచ్చారు. లయావస్థ కొరకై పడే తపన సంస్కారాలనన్నింటిని దగ్ధం చేసింది. అటువంటి సంస్కార రహిత స్థితిలో ఈ ప్రాపంచిక స్పర్శ అనుభూతి కలగటం లేదు. నన్ను నేను కోల్పోయి శూన్య రూపాన్ని పొందినప్పుడు హృదయం నిశ్చల స్థితితో నిండినది. నా కణకణము 'వారి' దివ్య శోభతో నిండి నేను వారిలో లయమై 'వారి' దివ్య రూపాన్ని పొందాను.

6. 'మాలిక్'లో యోగం తరువాత భౌతిక ఆకర్షణ నుండి దూరమయ్యాను. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సంపూర్ణంగా పొందటం దుర్లభం. అహం అనేది ఒక సరస్సు వంటిది. నీరు ఎక్కువైతే పొంగిపోతూ, ఎండ వేడిమికి ఎండిపోతూ ద్వంద్వాల పరిధిలో చలిస్తూ ఉంటుంది. కాని ఈశ్వరుడు అనే సాగరంలో ఎన్ని నదులు కలిసినా అది ప్రశాంతంగానే ఉంటుంది. ఇదే యోగి దశగా చెప్పబడింది. మనం ఈశ్వరీయ సాగరంలో యోగం చెందినా అంతిమ సాక్షాత్కారం కొరకు పట్టుదలతో, తపనతో సహజమార్గ సాధన కొనసాగించాలి.

7. ఈనాడు సద్గురువు దర్శన ప్రాప్తితో అనంత ఆనందంలో లయం చెందాను. 'వారి' అనుపమాన దర్శనాన్ని వర్ణించటానికి నావద్ద పదాలు కాని, సామర్థ్యం కాని లేవు. నా తనువంతా ఆధ్యాత్మికా రూపాన్ని పొంది సృష్టి అంతటా వ్యాప్తి చెందిన అనుభూతి కలిగింది.


8. 'మాలిక్'లో లయావస్థ చెందిన తరువాత దశలు త్వర త్వరగా మార్పు చెందాయి. తారతమ్యాలు తొలగిపోయి అన్నింటిలో సమభావం కలిగింది. ఈ ప్రపంచం ఒక స్వప్నంగా గోచరించింది. నా ఉనికి కోల్పోయి శూన్యదశ పొందినట్లుగా ఉంది. స్థితప్రజ్ఞ స్థితియే నా రూపమైనది. బాహ్య అంతరాలలో శ్రీ బాబూజీ మహరాజ్ విరాట్ రూప దర్శనమే గోచరించినది. నా స్థానంలో వారే సర్వకార్యాలు నిర్వర్తిస్తున్నట్లుగా అనుభూతి చెందాను. ఈ విధంగా అన్ని ఆధ్యాత్మిక దశలను మనకు ప్రసాదించటానికి శ్రీ బాబూజీ మహరాజ్ భూమి మీద అవతరించారు.

9. ఉన్నత ఆధ్యాత్మిక స్థితులను ప్రసాదించిన శ్రీ బాబూజీ మహరాజ్ కృపతో నాచేత బ్రహ్మాండ మండల యాత్ర కూడా చేయించి ఆ శక్తిపై ఆధిపత్యాన్ని ప్రసాదించారు. పిండదేశంలో నేను జీవించియు మరణించి 'వారి' ఊపిరిగా మారి 'వారి' స్మరణలో నిలిచాను. అందరూ మేల్కొని శ్రీ బాబూజీ మహరాజ్ పావన చరణాలను ఆశ్రయించండి.

10. శ్రీ బాబూజీగారి దివ్యరూపమే సదా నాకు గోచరిస్తున్నది. 'వారి' దివ్యశక్తితో నాలోని మాలిన్యాలన్నీ భస్మమై ఆ స్థానంలో 'వారి' నిరంతర స్మరణ నిలిచిపోయింది. తద్వారా ఆంతరిక ధృడ స్థితప్రజ్ఞ స్థితి పొందాను. అంతరంగంలో శ్రీ బాబూజీ మహరాజ్ దివ్య దర్శన ఫలితంగా పొందిన స్థితులవలన దివ్య సుగుణాలు నా అంతరంగంలో ఉప్పొంగాయి. సంస్కార బంధనాల నుండి విముక్తి కలిగింది. మనందరిని అనంత యాత్రను చేయించటానికి శ్రీ బాబూజీ మహరాజ్ అవతరించారు. (అంతరంగంలో శ్రీ బాబూజీ మహరాజ్ దివ్యరూపంతో బంధం ఏర్పరుచుకొని 'వారి'లో వ్యాపకత పొందినప్పుడు ప్రయాణం అనంతంవైపు సాగుతుంది.)

సహజమార్గ విధానం లేదా సాధనలో ఉన్న రహస్యం ఏమిటంటే, నిరంతర స్మరణను కలిగి ఉండటమే! దానివలన దైవంతో సంబంధం ఏర్పడి దైవంలోనేజీవించటం జరుగుతుంది. అభ్యాసీ మంచి ఆలోచనతో ఉండి 'వారి' స్మరణలోనే ఉంటే బాబూజీయే అభ్యాసీలో జీవిస్తారు. బాబూజీ అందరినీ ప్రేమించి అందరిచేత ప్రేమించబడటానికి భూతలానికి దిగి వచ్చారు.

ఆ నిరంతర స్మరణ వలన అభ్యాసీ యొక్క ఆలోచనలు, ఆచరణలు కూడా నిష్కల్మషమైనవిగా ఉండి స్వంత వ్యవహారాల్లోనూ, ప్రాపంచిక వ్యవహారాల్లోనూ పవిత్రత పొడసూపుతుంది. అది గుర్తించిన ఇతరులు కూడా అటువంటి వారికి హాని తలపెట్టరు. ఒక అభ్యాసీ బాబూజీని మీరు ఎవరిని బాగా ప్రేమిస్తారు –అని అడిగినపుడు "నేను నన్ను ద్వేషించే వారిని మరింతగా ప్రేమిస్తాను" అన్నారు. అలా ఎందుకంటే, అలాంటి వారిలో ప్రేమ బీజాలు, దివ్యత్వం నాటడానికే –అని చెప్పారు. వారు అందరినీ ప్రేమించటానికే వచ్చారు కాని, ఎవరినీ ద్వేషించటానికి కాదు.


God is not to be found within the fold of
a particular religion or sect.
He is not confined within certain forms or
rituals, nor is He to be
traced out from
within the scriptures.
Him, we have to seek for
in the innermost core of
our heart.